వెంకటరంగయ్య, మామిడిపూడి

ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

విజయనగరం, 1921

Record no. 800

# Veṅkaṭaraṅgayya, Māmiḍipūḍi

# Āṃglēyasāmrājyacaritramu

# Vijayanagaraṃ, 1921

Record no. 800

వెంకటరంగయ్య, మామిడిపూడి.
ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము / మామిడిపూడి వెంకటరంగయ్యచే వ్రాయబడినది.- విజయనగరం : వేదవ్యాస ముద్రాక్షరశాల, 1921.
4, 171 p. ;18 cm.
Record no. 800

Veṅkaṭaraṅgayya, Māmiḍipūḍi.
Āṃglēyasāmrājyacaritramu / Māmiḍipūḍi Veṅkaṭaraṅgayyacē vrāyabaḍinadi.- Vijayanagaraṃ : Vēdavyāsa Mudrākṣaraśāla, 1921.
4, 171 p. ;18 cm.
Record no. 800

ఆంగ్లేయ సామ్రాజ్య చరిత్రము

చరిత్ర

# ఆంగ్లేయ సామ్రాజ్య చరిత్రము.

ఇది

శ్రీ విజయనగర మహారాజావారి కళాశాలయందు
ప్రధాన చరిత్రోపన్యాసకులగు
మామిడిపూడి వెంకటరంగయ్య, ఎం. ఏ. చే
వ్రాయబడినది.

విజయనగరం.
శ్రీ వేదవ్యాస ముద్రాక్షరశాలలో
ముద్రింపబడినది.
1921.

 [ వెల రు 1.4.0.

# ఆంగ్లేయ సామ్రాజ్య చరిత్రము



ఇది

శ్రీ విజయనగర మహారాజావారి కళాశాలయందు

ప్రధాన చరిత్రోపన్యాసకులగు

మామిడిపూడి వెంకటరంగయ్య, ఎం. ఏ. చే

వ్రాయబడినది.

విజయనగరం.

శ్రీ వేదవ్యాస ముద్రాక్షరశాలలో

ముద్రింపబడియె.

1921.



[ వెల రు 1-4-0.

లన్యముగాకుండ చేసిరి. ఇందులకై వీరియెడ నేనెంతయో కృతజ్ఞుడనై యున్నాను. ఇట్టివారిసహాయముండినను ఈగ్రంథమందనేకలోపములున్నవని నేనెఱుఁగుదును; కాని ఈలోపములు నావియేకాని వారివికావు.

విజయనగరము 17-9-21 మామిడిపూడి వెంకటరంగయ్య.

---



## విషయసూచిక.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము.

## ప్రస్తావన.

ప్రభుత్వములలో కొన్ని, యొక్కరాష్ట్రముమీదనే యధికారమును చెల్లించునవిగను, మఱికొన్ని యేకకాలమం దనేక రాష్ట్రములపై నధికారము చెల్లించునవిగను నున్నవి. పర్షియా, గ్రీసు, సర్వియా, మొదలగు దేశములలోని ప్రభుత్వములు మొదటితరగతిలోను, జపాను, ఇంగ్లండు, ఫ్రాన్సు మొదలగు దేశములలోని ప్రభుత్వములు రెండవ తరగతిలోను చేరియున్నవి. ఈరెండవ రకములోనివానికే సామ్రాజ్యప్రభుత్వములనియు, సామ్రాజ్యప్రభుత్వములకు లోఁబడియుండు ననేక రాష్ట్రముల సముదాయములకే సామ్రాజ్యములనియు పేర్లు. సామ్రాజ్యమును పరిపాలించు ప్రభువునే చక్రవర్తి యని చెప్పెదరు.

అనాదిగా ప్రతి ఖండమునందును సామ్రాజ్యములు గలవు. సామ్రాజ్యాధిపతు లగుటచేతనే హరిశ్చంద్రుఁడు, నలుఁడు, మొదలగువారికి చక్రవర్తులను ప్రఖ్యాతికలిగినది. చంద్రగుప్తుఁడు, అశోకుఁడు, విక్రమాదిత్యుఁడు, శ్రీహర్షుఁడు, అగ్బరు మొదలగు రాజశ్రేష్ఠులు వంశానుగతముగ తమకు లభించిన

రాజ్యము నేగాక యిరుగుపొరుగులనున్న రాష్ట్రములనెన్నిటినో జయించి వశపఱచుకొని మన దేశమునం దంతట సామ్రాజ్యాధిపత్యమును నెలకొల్పిరి. మన దేశమందు మాత్రమే గాక దేశాంతరముల యందుఁగూడ నిట్లే పూర్వకాలమున జరుగుచుండెను. క్రీస్తుపుట్టుట కైదువందల సంవత్సరములకుపూర్వము సింధునదిమొదలు మధ్యధరాసముద్ర పర్యంతముగల దేశములనన్నిటిని పారసీక చక్రవర్తులు స్వాధీనపరచుకొని రెండువందల సంవత్సరములు నిరంకుశముగ పరిపాలించిరి. తదనంతరము, మహాశూరుఁడగు నలెగ్జాండరు వారిసామ్రాజ్యమును జయించిదానిస్థానమున గ్రీక్కులసామ్రాజ్యమునుస్థాపించెను. ఇట్లు పూర్వకాలమందెన్నియో సామ్రాజ్యము లొకటితర్వాత మఱియొకటి పుట్టుచుపెరుగుచు గిట్టుచుండెను; కానివీనియన్నిటిలోను నిరుపమానవైభవ మనుభవించి యద్వితీయమైనదను పేరు యొక 'రోమ్' సామ్రాజ్యము మాత్రమే సంపాదింపఁగలిగెను. వైశాల్య, జనబాహుళ్య, పరిపాలనపద్ధతుల యందు దానితో సాటిగల సామ్రాజ్యము మఱి యొకటి లేక యుండెను. అది వినాశముగాంచి పదునైదువందల సంవత్సరములైనను, దాని ప్రభావముమాత్ర మిప్పటికి కూడ పశ్చిమఖండవాసుల ధర్మశాస్త్రములందును సాంఘిక మర్యాదలందును నగపడుచున్నది.

ప్రస్తుత కాలమునందు ప్రపంచములో నెన్నియో సామ్రాజ్యములున్నవికాని, వీనిలోనొక జపానులదితప్ప, వృద్ధిదశలో నుండు మిగిలినవన్నియు పాశ్చాత్యులగు నైరోపాఖండవాసు



లచేతనే సంపాదితములై వారిస్వాధీనమందే యున్నవి. వీనిలన్నిటిలో మనప్రభువులగు నింగ్లీషువారి సామ్రాజ్యమగ్రగణ్యమై యనేక విశేషములతోఁ గూడుకొని యున్నది. విస్తీర్ణతయందును జనసంఖ్యయందును దీనితో తులఁదూగునది మఱియొకటిలేదు. ఇంగ్లీషువారు నివసించు ద్వీపము మిక్కిలిచిన్నదైనను ప్రపంచముయొక్క పాతికభాగము వారిస్వాధీనమందున్నది. ఇంగ్లీషువారందరు కలిసి నాలుగు కోట్లకంటె నెక్కువ లేకపోయినను, వారి పరిపాలనమునందు నలువదికోట్ల ప్రజలున్నవారు. ఇదియే మొదటివిశేషము.

ఇంగ్లండుదేశ మైరోపాఖండములో చేరినదైనను నాఖండములోని మఱియే దేశములును నింగ్లీషువారి స్వాధీనమునందు లేవు కాని యనేకసముద్రములకావలనున్న ఏషియా, ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియా, ఖండములలో వారి పాలనమం దెన్నియో రాష్ట్రములున్నవి. సమీపమందున్న ఫ్రాన్సు, స్పెయిన్ మొదలగు దేశముల వశపఱచుకొనక, యెన్నియో వేలమైళ్ళ దూరమందున్న ఇండియా, న్యూజీలండు మొదలగువానిని వారద్భుతముగ సంపాదింపఁగలిగిరి. ఇదియే రెండవవిశేషము.

ఆంగ్లేయ సామ్రాజ్యమందున్న ప్రజలలోఁ గనఁబడునన్ని భేదములు మఱియేసామ్రాజ్య మందలివారిలోను గనఁబడుట లేదు. కొన్ని భాగములయందు క్రైస్తవులును, ఇంగ్లీషు, ఫ్రెంచి, డచ్చి, మొదలగు పాశ్చాత్యభాషలమాటలాడు తెల్లవారును, మఱికొన్ని భాగములయందు బ్రాహ్మణ, బౌద్ధ,

మహమ్మదీయాది మతముల స్వీకరించి వివిధభాషల మాటలాడు నల్లవారును, కొన్ని ప్రదేశములలో రాజకీయ విషయములందు సర్వస్వాతంత్ర్యము కలిగిన ప్రజలును, మఱికొన్నిటిలో ప్రభుత్వమువారి నిరంకుశాధిపత్యమునకు లోఁబడి యుండువారును, గనఁబడుచున్నారు. ఇన్నివిషయముల వేఱువేఱుగనుండుప్రజల, నెవరెవరి నెవ్విధముగ నాదరింపవలయునో యవ్విధముగ నాదరించుచు, అందఱకు సంతుష్టి కలుగునట్లు నేర్పుతోను బుద్ధిసూక్ష్మతతోను పరిపాలించుచుండుట సామాన్యమైన పనికాదు. ఇట్టిసామర్థ్యము నింగ్లీషువారు చూపుచుండుటయే మూఁడవవిశేషము.

ఇదిగాక, సామ్రాజ్యసంపాదనము నింగ్లీషువారు మొదలిడి మూఁడు వందల సంవత్సరములకంటె నెక్కువ కాలేదు. సామ్రాజ్యములో ప్రధానభాగములగు నిండియా, కనడా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మొదలగురాష్ట్రములవశపఱచుకొనుటకు 1750 తర్వాతనే వారు ప్రయత్నములను గావించిరి. ఇంత స్వల్పకాలములో నింతగొప్ప సామ్రాజ్యము నిదివఱకే దేశపువారుగాని సంపాదించినదిలేదు. ఇంగ్లీషువారి యోగ్యతాదృష్టములను సూచించుటకు నిదర్శనాంతరములేవియు అవశ్యములు కానేరవు.

ఆంగ్లేయ సామ్రాజ్యమునకంటె విచిత్రమగు నంశము ప్రపంచమం దిప్పుడు మఱియొకటిలేదని నిస్సంశయముగ చెప్పవచ్చును. గనుకనే, దానిచరిత్రమును ప్రస్తుతపు స్థితిగతులను తెలిసికొనుట ప్రతిమనుష్యునికిని విధియై యున్నది. ఇదిగాక,



అనేక సంవత్సరములనుండి మన సుఖదుఃఖముల కన్నిటికిని ఆంగ్లేయులే కారణభూతులై యున్నారు. వారిసాహాయ్య సాంగత్యములు లేనియెడల మనదేశము బాగుపడఁ జాలదు. ఆంగ్లేయసామ్రాజ్యముయొక్క పురోభివృద్ధియే మనయభివృద్ధికి హేతువు. ఈసామ్రాజ్యములోని రాష్ట్రములలోనెల్ల మనదేశమే యగ్రగణ్యమైనది. మనలను పరిపాలించువారగుట చేతనే యాంగ్లేయుల కిప్పుడింత గౌరవమును, పేరు, ప్రతిష్ఠయును నిలిచియున్నవి. వారి మహైశ్వర్యమునకు చాలవఱకు మనమే కారణమైయున్నాము. మనకును వారికిని యిట్టి సంబంధమున్నది. ఈసందర్భములో నాంగ్లేయసామ్రాజ్య చారిత్రమును దెలిసికొనుట యందరికంటె మనకెక్కువ యావశ్యకము.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## ఒకటవ ప్రకరణము.

సామ్రాజ్యస్థాపనమునకు నింగ్లీషువారిని పురికొల్పినకారణములలో నెల్ల రెండుమాత్రము ప్రధానములుగ నున్నవి. విదేశములతో వ్యాపారముచేసి విశేషధనమును గడింపవలెనను నభిలాష మొదటికారణము. ఈమూలముననే వారు మనదేశమునకు వచ్చిరి. దేశాంతరములలో స్థిరనివాసముల నేర్పఱచుకొని కాపురము చేయుచున్నయెడల నెక్కువ సుఖమును స్వాతంత్ర్యమును ననుభవింప వచ్చుననెడి నమ్మకము రెండవకారణము. ఇందుచేతనే, వారు, న్యూజీలండు, ఆస్ట్రేలియా మొదలగు రాష్ట్రముల వశపఱచుకొనిరి. కాని, వ్యాపారముచేయుటకుఁ దగిన విదేశము లెన్నియో యుండినను వానితో వ్యాపారముచేయుటకు వారి కెట్టి యవకాశములు లేకపోవుటచేతను తెల్లవారు నివసించుటకుఁ దగిన శీతలదేశములు ప్రపంచమం దున్నవని వారికి తెలియనికారణముచేతను, సౌఖ్యస్వాతంత్ర్యముల ననుభవించుటకు స్వదేశమునువదలి పరదేశములకు వెళ్లవలసినంతటి యవసరము వారిలో నెవరికిఁగాని లేకపోవుటచేతను, 1500 లకు పూర్వము సామ్రాజ్యమునిమిత్తమై ఇంగ్లీషువారు ప్రయత్నము లెవ్వియునుచేయరైరి. 1500 ప్రాంతమున యీవిషయములలో కొన్ని గొప్ప మార్పులు కలుగుటచేత



విదేశముల వశపఱచుకొనుట కింగ్లీషువారుపక్రమించిరి.

ఐరోపా ఖండములోని దేశములయందు సామాన్యములగు నాహారపదార్థములు మాత్రమే పండుచుండుట వలనను, నాణెమైన వస్తుసామగ్రిని చేయుటకుఁ గావలసినంత నేర్పు పూర్వకాలమందా దేశస్థులలో విశేషముగ లేనికారణమునను, ననేకసహస్ర సంవత్సరములనుండి పాశ్చాత్యులకును ఇండియా చైనా మొదలగు తూర్పుదేశముల వారికిని అపరిమితమగువ్యాపారము జరుగుచుండెను. లవంగములు, జాజికాయ, జాపత్రి, ఏలకీఫలములు మొదలగు తాంబూల పదార్థములును, వజ్రములు, కెంపులు, పచ్చలు, పగడములు మొదలగు రత్నములును, అమూల్యములగు నౌషధరాజములును, అపురూపములైన మూలికలును, గంధము కస్తూరి మొదలగు సుగంధద్రవ్యములును, ప్రశస్తమైన రవసెల్లాలును, నాణెమైన పట్టువస్త్రములును, చిత్రవిచిత్రములగు కంబళ్లును, యివియవి యననేల ధనికులును, రాజాధిరాజులును, వేనిని భోగ్యపదార్థములుగ నెంచెదరో, వేనిని సంపాదించుటకై ధనరాసుల క్రుమ్మరించెదరో, వేనిని చేయుటకు బుద్ధిసూక్ష్మతయు ననుభవజ్ఞానమును గావలసియుండునో యటువంటిపదార్థములనన్నిటిని, అనాదిగా ఐరోపావారు మనవద్దనే కొనుచుండిరి. ఈ హేతువుచేత తూర్పుపడమటిదేశముల కేటేట కోట్లకొలఁది రూప్యముల విలువగల వ్యాపారము జరుగుచుండెను. పూర్వకాలమందలి ఐరోపియనులకు అమెరికా, ఆస్ట్రేలియా మొదలగు ఖండము లున్నవని తెలియనికారణముచే వారికి తూర్పు దేశములతోతప్ప మఱి

వేనితోను విదేశవ్యాపారము లేకయుండెను.

ఈవర్తకమంతయు ఏషియా ఖండములోని పెక్కుమిట్ట మార్గములమీఁదుగ నడచి, ఈజిప్టుదేశములోని అలెగ్జాండ్రియా, రోమ్ సామ్రాజ్యమునకు చిరకాలము ప్రధానపట్టణముగనుండిన కాన్‌స్టాంటినోపిల్, మధ్యధరాసముద్రపు తూర్పుతీరమందున్న అంటియోక్, స్మర్నా మొదలగుపట్టణములఁజొచ్చి వ్యాపించుచుండెను. లాభమునాశించిన ఐరోపా వర్తకులందఱు యీపట్టణములలో సరకులను మొత్తముగఁగొని, ఐరోపా దేశములకు వానిని దీసికొనివెళ్ళి విక్రయించుచుండు వారు. వారి వ్యాపారమున కంతకు నాకాలమున మధ్యధరాసముద్రము రాజమార్గముగను, దాని తూర్పు తీరమందున్న పట్టణములు మూలాధారములుగ నుండెను. ఈకారణముచే ఈసముద్రపు చుట్టుపట్లనున్న దేశములవారు మాత్రమే విశేషలాభమును సంపాదింపఁ గలిగియుండిరి. కనుకనే యీసముద్రమున కెన్నియో వందలమైళ్ళ దూరమందొక మూలలోనున్న యింగ్లీషువారికి వ్యాపారము చేయుటకుఁగాని తన్మూలమున విదేశముల సంపాదించుటకుఁగాని యవకాశము లేకయుండెను.

1400 సంవత్సరము మొదలు యీవ్యాపారమున కంతకొక గొప్పయాటంకము సంభవించెను. అనాగరకులై దిమ్మరులై క్రొత్తగ మహమ్మదీయ మతమును స్వీకరించి, క్రైస్తవులన్న అత్యంతాసహ్యతనుజూపు తురకజాతివా రొకరు మధ్యధరాసముద్రపు తూర్పుతీరమందొక రాజ్యమునేర్పఱచుకొని, ప్రాక్ప



శ్చిమ ఖండముల వ్యాపారమున కంతకు నాధారములుగనుండిన రేవుపట్టణముల క్రమక్రమముగ స్వాధీనపరచుకొని, క్రైస్తవులగు ఐరోపియన్ వర్తకులతో సర్వదా సంగ్రామము చేయసాగిరి. పౌరుషవంతులకు యుద్ధము చేయుటయే ధర్మమని, ఈతురకలు వాణిజ్యవ్యాపారముల నీచముగచూచుచు గర్హించుచుండువారగుటచేత, తూర్పుదేశపు సరుకుల కొనుటకు అలెగ్జాండ్రియా మొదలగు పట్టణములకు వెళ్లుచుండిన ఐరోపా వర్తకులెవ్వరు నచ్చటికి వెళ్లుటకు సాహసింపరయిరి. ధైర్యముతెచ్చికొని కొందఱు వెళ్లినయెడల, సరుకులతోను ఓడలతోను వారిప్రాణములు తురకలపాలగుచుండెను. ఈకారణముచే నదివఱకు తూర్పుదేశములతో జరుగుచున్న వ్యాపారమంతయు క్షీణింపసాగెను. దారిదోపిడిగాండ్రు మార్గమధ్యమందున్నప్పు డామార్గమున నెవరు నడువఁగలరు?

వ్యాపారము క్షీణించుచుండినను, తూర్పుదేశపు సరుకులయందు ఐరోపా వారికిఁ గల ప్రీతి హెచ్చగుచునే యుండెను. అందుచే, తురకలాక్రమించు కొన్న దేశములతో నెట్టి సంబంధము లేని ఇండియాను చేర్పు సముద్రమార్గము నొకదానిని గని పెట్టినయెడల, వ్యాపారమును యథాప్రకారముగ జరుపవచ్చునను నాశతో, ఇటలీ స్పెయిన్ మొదలగు దేశములలోనివారు శ్రద్ధాపూర్వకముగ ననేకప్రయత్నములచేయసాగిరి. ఇండియాకు తప్పక మఱియొక మార్గముండఁగలదని వారుదృఢముగనమ్ముటకుఁగూడ నప్పుడేయవకాశము కలిగెను. మనము నివసించు భూమి గుండ్రమైన గోళమనియు, కనుక మన మెక్కడనైన

నొకచోట బయలుదేరి చక్కఁగా తూర్పుదిక్కునకు వెళ్ళినను, లేక పడమటిదిక్కుగ వెళ్లినను కొంతకాలమునకు తిరిగి బయలుదేరిన స్థలమునకే వచ్చిచేరఁగలమనియు, ఐరోపా ఖండములోని శాస్త్రజ్ఞులప్పుడే సిద్ధాంతము చేసిరి. అంతకు మున్న మధ్యధరాసముద్రము మీఁదుగ తూర్పుదిక్కున ప్రయాణము చేసి ఐరోపానుండి వర్తకులందఱును ఇండియాకు వచ్చుచుండినన్లై ఇప్పుడు పడమటిదిక్కుగ వెళ్లినయెడల తప్పక ఇండియాను చేరవచ్చునని అనేకులు నిశ్చయముచేసిరి.

కాని, పడమటిదిక్కున ప్రయాణము చేయుటసుసాధ్యమా? ఆవైపున మహోన్నత తరంగములతో నిండియున్న అట్లాంటిక్ మహాసముద్రముండెను. అలలు లేక, సరస్సువలెనుండు మధ్యధరాసముద్రములో మాత్రము ప్రయాణము చేయుటయందనుభవము గలిగియుండిన వారగుటచే సామాన్యముగ నావికులందఱీ మహాసముద్రమున కొంత భయపడసాగిరి. భయపడినయెడల కార్యమెట్లుకాఁగలదు? మన దేశము కాంచన దేశమనియు, అందెక్కడ చూచినను రజత ద్రుమములున్నవనియు, ఆకాలపు ఐరోపియను లనుకొనుచుండువారు. కనుక, క్రొత్తమార్గమే యొకటి. మన దేశమునకు దొఱకినయెడల, మితిమేరలులేని లాభము సంపాదింప వచ్చునని వారిలో ప్రతి మనుష్యుఁడును నమ్ముచుండెను. ఇంతగొప్ప ఫలమెదుటనున్నపుడు దానినేలాగునైన సంపాదింపవలయునని సాహసవంతులు కొందఱు తీర్మానించుకొని, అట్లాంటిక్ సముద్రముమీఁదుగ ఇండియాకు త్రోవ కనిపెట్టుటకు బయలుదేరిరి.



వీరి ప్రయత్నములు సఫలములు కానుండుటంబట్టి అన్నియు వీరికి ననుకూలముగనే జరుగనారంభించెను. సముద్రమధ్యమందు దిక్కుల తెలిసికొనుటకదివఱకు తగినసాధనమొక్కటియు లేనందున, పశ్చిమదిక్కున ప్రయాణము చేయబయలుదేరినవీరు దిక్కుతప్పి మఱియొకదిక్కున వెళ్లుటతటస్థించునేమో యని సంశయింపసాగిరి. అట్టి యనుమానమును పోఁగొట్టుటకో యన్నట్లప్పుడే శాస్త్రజ్ఞులు కొందఱు మారినర్సుకాంపస్ అను దిగ్బోధినీ యంత్రమును కనిపెట్టిరి. ఇట్లే మహాతరంగములనైన ధిక్కరించి వడిగా ప్రయాణము చేయఁగల గొప్ప ఓడలనుకట్టుటకు మఱికొందఱు మొదలిడిరి. అప్పుడే భూగోళ శాస్త్రజ్ఞులు శిథిలములైయున్న కొన్ని ప్రాచీన గ్రంథముల సహాయమున ప్రపంచపటముల తయారుచేసి యే యేదిక్కులకు వెళ్లినయెడల ఇండియాకు క్రొత్తమార్గము దొఱకఁగలదో సూచించిరి. పుస్తకముల నచ్చువేయు యంత్రమునుగూడ అప్పుడే కొందఱు కనిపెట్టిన కారణముచే, నూతనవిషయముల గురించిన జ్ఞానము ఐరోపాఖండములో నొక దేశమునుండి మఱియొక దేశమునకతిశీఘ్రముగను సులభముగను వ్యాపింపఁదొడఁగెను. ఆకాలమందు ఇండియాకు నూతనమార్గమును కనుఁగొను విషయములో ఐరోపియనులు చూపిన యుత్సాహమును పట్టుదలయు వర్ణనాతీతములు. అట్టివారి ప్రయత్నము లెన్నటికైన కొనసాగకయుండుటయుఁ గూడ కలదా?

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## రెండవ ప్రకరణము.

1400 సంవత్సరము తర్వాత మన దేశమునకు క్రొత్త దారినికనుఁగొనుటకు ప్రయత్నము చేసినవారిలో నెల్ల, పోర్చుగల్ దేశస్థులును స్పెయిన్ వారును ప్రధానులైయుండిరి. మధ్యధరాసముద్రము అట్లాంటిక్ మహాసముద్రముతో కలియునట్టి ప్రదేశమందే రెండు దేశము లుండుటవలనను, అట్లాంటిక్ మీదుగా నూతనమార్గమును కనుఁగొనిన యెడల నీదేశములవారి కితరులకంటె నెక్కువలాభము సంపాదించుట కవకాశమున్నందువలనను, వీరెక్కువ యాసక్తితో పనిచేయసాగిరి. ఇదిగాక, స్వమతమగు క్రీస్తుమతమందు వీరికున్నంత యభిమానమును, పరమతములందు వీరికున్నంత ద్వేషమును, అట్లాంటిక్ తీరమందున్న మఱియే దేశస్థులకును లేకయుండెను. అనేకశత సంవత్సరములనుండి తమ దేశములను జయించి పరిపాలించుచుండినట్టి తురకలతో వీరు పోరాడి, తుదకు 1450 ప్రాంతమున వారినోడించి స్వాతంత్ర్యమును సంపాదించుకొన్నవారగుటచే, నిప్పుడు తురుష్కదేశములకు వెళ్లి తన్మతమును నాశనమునుగావించి, ప్రపంచమందంతటను క్రీస్తుమతమును వ్యాపింపఁజేసి దానినుద్ధరింపవలయునన్న యుత్సాహము వీరియం దమితముగా నుండెను. ఇండియాకు నవీనపథమును ప్రప్రథమమున కని పెట్టిన



ఘనతల వ్యాపారమువల్ల నైహికసుఖములనేగాక, ఇతర మతస్థులను క్రైస్తవులుగచేసి వ్యాపారలౌకిక సుఖమును గూడ పొందవచ్చునని వీరుద్దేశపడిరి.

ఇట్టి స్థితిలో 1492 సంవత్సరమునందు కొలంబసను నావికుఁడు స్పెయిన్ దేశపురాజునానతినిపొంది, ఇండియాకు పశ్చిమమార్గమును కనుఁగొనవచ్చునను దృఢనిశ్చయముతో అట్లాంటిక్ సముద్రముమీద రెండు మాసములు ప్రయాణముచేసి చేసి తుట్టతుదకు కొన్నిద్వీపములను చేరికొనెను. ఇవియే ఇండియాయని అతఁడు భ్రమపడి 1493 లో తిరిగి మఱియొకమారీమార్గముననే ప్రయాణముగావించి మఱికొన్ని దీవులకువచ్చిచేరెను. కాని, ఇదివఱకు ఇండియానుగురించి తానువినినట్టి వింతలేవియు నీద్వీపములలో కనఁబడని కారణముచేనివి ఇండియాలో చేరినవికావనియు, వీనిని దాటిసఁగాని ఇండియాకు వెళ్ళుటకు వీలుండదనియు, నతనికిస్పష్టమయ్యెను. ఇట్లాశాభంగము గలిగి మిక్కిలివిచారపడుచు 1498 లో నాతఁడా ద్వీపములకు మూఁడవప్రయాణము చేసి వానికన్నిటికి వెస్టిండీస్ (పశ్చిమ ఇండియా) దీవులని పేరుపెట్టెను. ఈపేరిప్పటికిఁగూడ వాడుకలో నున్నది. ఇవియే అమెరికాలోని ద్వీపములు. క్రమక్రమముగ మఱికొందఱు నావికులు వీనికావలకొంచెము దూరమున గొప్ప భూఖండమున్నదని తెలిసికొని దానినే అమెరికాయని పిలువసాగిరి. వీరందఱు స్పెయిన్ రాజుల సాహాయ్యమున నింతదూరము రాఁగలిగిన కారణముచే వారు కనుఁగొన్నఖండమంతయు పైరాజుల రాష్ట్రమాయెను. అది మొదలీ

ప్రభువులు అమెరికాయొక్క నిజస్థితిని దెలిసికొనఁగోరి మఱికొందఱిని పంపి వారిద్వారా దానిలోని దేశము లనేకముల కనుఁగొనిరి. ఇండియాకు నవ్యమార్గ మొకటి దొరకుటకు బదులు మహాఖండ మొకటి అట్లాంటిక్కునకావల నున్నదని కొలంబస్ మొదలగు నావికులయాత్రలవలన తెలియవచ్చెను.

ఇదివఱకే పోర్చుగీసువారు తమ దేశమునుండి దక్షిణపు దిక్కుగ వెళ్లినయెడల ఆఫ్రికాఖండమును దాటవచ్చుననియు, నచ్చటనుండి ఇండియాకొక మార్గముగలదనియు నూహించి, దానిని కనుఁగొనుటకై విశేషద్రవ్యమును ఖర్చుపెట్టి అనేక నావికులను పంపుచుండిరి. కాని వారి ప్రయత్నములన్నియు విఫలములగుచు వచ్చెను. అయినను 1492 లో కొలంబస్ చేసిన ప్రయాణమువలన పశ్చిమదిక్కునందు ఇండియాకు సులభమైన మార్గములేదని స్పష్టమగుటచే, పోర్చుగీసు నావికులు మునుపటికంటె నెక్కువ శ్రద్ధతో ఆఫ్రికామీఁదుగ ఇండియాకు త్రోవను కనిపెట్టుటకు ప్రయత్నింపసాగిరి. తుదకు 1497 లో వాస్కో-డిగామాయను పోర్చుగల్ దేశస్థుఁడిందు నిమిత్తమై పోర్చుగలులో బయలుదేరి, ఆఫ్రికాఖండపు పశ్చిమతీరమందు పయనము గావించి, దాని దక్షిణపు కొనయందున్న గుడ్‌హోపుటగ్రమునుదాటి, అచ్చటనుండి కొన్నినెలలకు 1498 లో మలయాళతీరమందున్న కళ్ళికోటపట్టణము వచ్చిచేరికొనెను. అప్పుడు పోర్చుగీసువారు పొందిన సంతసమింతయంతయని చెప్పుటకువీలు లేదు. ఎన్నియోవత్సరములనుండి పాశ్చాత్యులు మన దేశమునకువచ్చుటకై వెదకుచున్న సాముద్రి



ప్రథమము తుదకు పోర్చుగీసు వారికి దొరకెను. ఆనాఁటఁగోలె నూరేండ్లవఱకును ప్రాగ్దేశములతోడి వ్యాపారమంతయు పోర్చుగీసువారి యధీనమందే యుండెను.

ఇండియాకు అభినవ మార్గమును కనిపెట్ట వలయునని ప్రయత్నములు చేయుచుండిన యూరోపియను లిప్పు డిరుఫలములను పొందఁగలిగిరి. ఇండియాకు తురకలతో సంబంధము లేనిమార్గ మొకటి లభించుటయేగాక బ్రహ్మాండసదృశమగు అమెరికాఖండ మొండు వారికి ప్రాప్తించెను. అయినను ప్రథమమున నీఖండముయొక్క ప్రయోజనము వారికి తెలియక పోవుటచే కాఁబోలు, వారు దానినిగురించి విశేషోత్సాహమునుపొందక ఇండియాతో వ్యాపారముచేయుట కనుకూలత గలిగించిన దారిని కనుఁగొనినట్టి పోర్చుగీసువారే ధన్యులని భావించుచు వచ్చిరి. కాని, స్పెయిన్‌వారు కాలక్రమముగ అమెరికాఖండములోపల ప్రవేశించి, దానిమహిమ నంతయు కనుఁగొనిరి. సమస్తైశ్వర్యములతో తులదూఁగు సామ్రాజ్యములును, విశాలమగు నగరరాజములును, అఖండమగు వెండిబంగరు గనులును బహుసారవంతమగు భూమియు వారికండ్లకు పొడగట్టెను. అందుమీఁదవానిని సంపాదింపవలయునను నభిలాషతో స్పెయిన్ దేశపురాజులు సైన్యములనంపి, కొలఁదికాలముననే మెక్సికో పెరు లోనగు దేశములనన్నింటిని జయించినిరుపమానసామ్రాజ్యమునుస్థాపించిరి. అది మొదలేటేటను అమెరికానుండి స్పెయిన్‌కువచ్చుచున్న వెండిబంగారములకు మితి మేర లేకయుండెను. అదివఱకు సామాన్యముగ నెన్నఁబడు స్పెయిన్ రాజ్యమతిశీఘ్ర

కాలముననే ఐరోపాలోని దేశములందెల్ల నగ్రపదము నలంకరించి లెక్కకుమీరిన సైన్యములను నావలనుకలదై శత్రువుల కెల్ల భయోత్పాదకముగనుండెను.

ఇదేవిధముగ పోర్చుగీసువారుకూడ తూర్పుదేశములయందెల్లను వారియధికారమును నిలుపుటకు ప్రయత్నించి, అదివఱకీదేశములతో విశేషవ్యాపారము చేయుచున్న అరబ్బీల నోడించి, కొలఁదికాలములోపలనే యేడన్ పట్టణము మొదలు జావా ద్వీపమువఱకు వారివ్యాపారస్థలముల నేరుపరచికొనిరి. సముద్రయుద్ధమందు వారెక్కువనేర్పు గలవారగుటచే క్రమముగ శత్రువినాశముగావించి సింహళద్వీపమును మలకారాష్ట్రమును మన దేశములోని గోవా డయ్యూ మొదలగు రేవుపట్టణములను స్వాధీనము చేసికొనఁగలిగిరి. ఇంతటితో తృప్తిపొందక వారు అమెరికాఖండమునకుఁ గూడ వెళ్ళి దారిలోని బ్రెజీలు దేశమునాక్రమించుకొని, స్పెయిన్ వారివలెనే మిక్కిలి నైశ్వర్యవంతులైరి.

ఇట్లు అట్లాంటిక్ సాగరముమీదుగ ఇండియాకు బాటయేర్పడుటయు, దానికవ్వల అమెరికా ఖండమున్నదని తెలియుటయు, ఐరోపాఖండవాసుల చరిత్రలో వర్ణనాతీతమైనమార్పునుకలుగఁజేసెను. 1500 వఱకు ఐరోపాఖండమందుప్రాముఖ్యమును పొందిన గ్రీసు, ఇటలీ మొదలగు దేశములన్నియు మధ్యధరాజలధితీరమందే యుండినవి. ఇతర దేశములతో వ్యాపారముచేసి ధనమును సంగ్రహించుటకును, దాని మూలమున సైన్యములనభివృద్ధిచేసికొని ఇతరరాష్ట్రముల జయించుటకును



నా దేశములవారి కున్నంత యవకాశము మఱి యేరికిని లేకయుండెను. వ్యాపారమునకెల్ల నాసముద్రమే రాజమార్గమై యుండిన కారణమున నింత వైభవమును ఇటలీలోనగు దేశములవారనుభవించుటయు, దానికి దూరముందున్న పోర్చుగల్, ఇంగ్లండు, హాలెండు దేశములవారు వెనుకఁబడి యుండుటయు సంభవించెను. కాని, 1500 తర్వాత నన్నిటికిని అట్లాంటిక్ సముద్రమే రాదారియగుటవలన మధ్యధరాసముద్రపు తీరమందున్న దేశములు స్వాతంత్ర్యమును కోలుపోయి నానాఁటికిక్షీణదశకు వచ్చినయవి. ఈకారణముననే అట్లాంటిక్ సముద్రముఖమందున్న ఇంగ్లండు, ఫ్రాన్సు, పోర్చుగల్ దేశములవారు విశేషధనమును సంపాదించి కొలఁదికాలముననే మహోన్నతస్థితికి రాఁగలిగిరి. నూరేండ్లలోపల స్పెయిన్ పోర్చుగల్ దేశములవారు నిరుపమానమైన సామ్రాజ్యాధిపతు లగుటయె యిందుకు తార్కాణము.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## మూఁడవ ప్రకరణము.

అట్లాంటిక్ సముద్రము విదేశవ్యాపారమునకంతకు రాజమార్గమగుటచేత ఇంగ్లీషువారు లాభముసంపాదించుట కవకాశము కలిగినప్పటికిని, తూర్పుదేశములతోడివర్తకమును వారు 1600 వఱకు మొదలిడలేదు. ఇండియాకు నవీన మార్గమును కనిపెట్టినది పోర్చుగీసువారు. కనుక దానినుపయోగించుటకు వారికిమాత్రమే హక్కుకలదనియు, వారియనుమతిలేక మఱియెవరు నాదారిని నడువఁగూడదనియు నాకాలపువారు తీర్మానించికొని యుండిరి. యూరపియనులందఱీమర్యాద ననుసరించినవారగుటచే, ఇంగ్లీషువారుకూడ దానికిబద్ధులై అట్లాంటిక్ పథమున ఇండియాకువచ్చి వ్యాపారముచేయ మొట్టమొదట నిష్టపడరైరి. ఇట్టి సందర్భములో సాహసికులగు ఇంగ్లీషునావికులుకొందఱు ఐరోపాకు నుత్తరదిక్కునందున్న యార్కిటిక్ సముద్రము మీఁదుగ ఇండియాకుమఱియొక త్రోవకనిపెట్టనెంచి 1500 మొదలనేక పర్యాయములావైపున ప్రయాణముచేసిరి. కాని యాసముద్రములో చాలభాగము సర్వదామంచుగడ్డతో కప్పఁబడియుండుటచేత, వారిప్రయత్నములన్నియుతుదకువిఫలములాయెను. ఇట్లుండఁగా, హాలెండుదేశస్థులగు డచ్చివారది



వఱకు క్రొత్తమార్గములగురించి యేర్పడియున్న మర్యాదనుల్లంఘించి, పోర్చుగీసువారు కనుఁగొనిన మార్గము మీఁదుగ ఇండియాకువచ్చి వ్యాపారముచేసి విశేషద్రవ్యము సంపాదించుటకు మొదలిడిరి. దీనిని ఇంగ్లీషువారుకనుఁగొని, డచ్చివారు చేయుచున్నట్లు తాముగూడ చేయుటలో దోషమేమియులేదని, 1600 లో తూర్పుదేశములతో వ్యాపారముచేయుటకొక సంఘమేర్పాటు చేసిరి. ఈవర్తక సంఘపువారే ప్రస్తుతము ఇండియాలోని ఆంగ్లేయసామ్రాజ్య కర్తలు.

కొలంబస్ అమెరికాఖండమును కనుఁగొనినప్పటినుండి వెండి బంగారము లపరిమితముగ స్పెయిన్‌దేశమును చేరుచుండుటచేనా దేశస్థుల యైశ్వర్యముదినదినాభివృద్ధిగాంచుచుండుటచే ఇంగ్లీషువారుచూచి, తాముకూడ అమెరికాతో వ్యాపారము చేయనిశ్చయించి, అందుకై కావలసిన ప్రయత్నముల నెల్ల చేయుచుండిరి. కాని, ఇంగ్లీషువారు అట్లాంటిక్‌సముద్రమును దాటుటయు, అమెరికాలో స్పెయిన్‌వారి ప్రభుత్వమునకు లోఁబడియున్న దేశములతో వ్యాపారముచేయుటయు, వారికే మాత్రమిష్టము లేకయుండెను. కనుక, ధైర్యముగొని ఇంగ్లీషువర్తకులెవరైన అమెరికాకువెళ్ళినయెడల స్పానిషుఉద్యోగస్థులు వారియోడలకును సరుకులకును కొన్నిసమయములందు వారిప్రాణములకునుగూడ నష్టమును కలుగఁజేయుచు వచ్చిరి. ఈకారణముచే క్రమక్రమముగ ఇంగ్లండు స్పెయిన్ దేశములకు పరస్పరవిరోధము సంప్రాప్తమాయెను.

వ్యాపారమూలమున పుట్టినట్టి వైరమభివృద్ధియగుటకు మఱి

కొన్ని హేతువులు తోడ్పడఁజొచ్చెను.

1521 సంవత్సరమున ఐరోపాఖండములోని క్రైస్తవుల లోనొకగొప్ప విప్లవముత్పత్తియాయెను. ఆదినములకా ఖండపు పశ్చిమ మధ్యభాగములందున్న వారందఱు రోమ్ పట్టణపీఠము నధిష్ఠించియున్న 'పోప్' ను గురువులుగ భావించుచు, మతవిషయములందాతని యాజ్ఞను శిరసావహించుచుండిరి. కాని, యనేక కారణములచే క్రమక్రమముగ నాతనియాధిక్యతక్షీణించి 1521 తర్వాత క్రైస్తవులలో రెండుశాఖాభేదములు జనింపఁజేసెను. పోపును మతగురువుగ నమ్మినఁగాని మోక్షములభింపదని కతాలిక్ శాఖవారును, మతవిషయములం దాతని కెట్టి యధికారములేదని ప్రొటెస్టాంటు శాఖవారును వాదింపసాగిరి.

దేశములన్నిటిలో ఇంగ్లండు ప్రప్రథమమున ప్రొటెస్టాంటు మతమును స్వీకరించిన దగుటచేతను, సహజముగనే ఇంగ్లీషువారప్పటికి మిక్కిలి బలవంతులుగ నుండిన హేతువుచేతను, కష్టదశయందున్న ప్రొటెస్టాంటు దేశముల వారందఱు ఇంగ్లీషువారి సహాయమున కెదురుచూచుచు, తద్వారా స్వమతరక్షణమునుఁ జేసికొన దలఁచుచుండిరి. ఆకాలము ఐరోపాలో నెక్కడఁజూచినను కతాలిక్ మతమును నిర్మూలము చేయవలయునని ప్రొటెస్టాంటులును, ప్రొటెస్టాంటుమతమును రూపుమాపవలయునని కతాలిక్కులును హోరాహోరిగ పోరాడుచుండిరి. ప్రొటెస్టాంటు దేశములలోనెల్ల ఇంగ్లండగ్రపదవి చెందిన విధముననే కతాలిక్ దేశములలోనెల్ల స్పెయిను ప్రధాన



మైనదిగ నుండెను. అనాదిగా స్పెయిను దేశపు ప్రభువులుస్వమతమునం దపరిమితమైన యభిమానము కలిగినవారు. ఇదిగాక 1520 మొదలు పశ్చిమదేశములలో ననేకములు వారిపరిపాలనయం దుండినందున వారివైభవము సాటిలేక వర్ధిల్లుచుండెను. వారిసహాయమున ప్రొటెస్టాంటు మతమునునడుగంటఁజేసి, పూర్వమునవలె స్వాధికారమును సమస్త దేశములయందు వ్యాపింపఁజేయ పోపు సమకట్టియుండెను. కతాలిక్ మతము నుద్ధరించి మతాంతరములనెల్ల నాశముచేయ స్పెయిన్ రాజులు కంకణము గట్టుకొని యుండిరి. ఇట్టి సందర్భములో ప్రొటెస్టాంటులందఱిలో ప్రముఖులుగనుండిన ఇంగ్లీషువారికిని స్పెయిన్ వారికిని యుద్ధము తప్పదాయెను.

ఇంగ్లీషువా రుదాసీనులైయుండక, స్పెయిన్ వారి మూలబలమును వినాశముకావించుట యావశ్యమని నిశ్చయించుకొని యందునిమిత్తమై వడివడిగ ప్రయాణము చేయఁగలిగినట్టియు యుద్ధమున కనుకూలములైనట్టియు ఓడల ననేకములతయారుచేసి అట్లాంటిక్ సముద్రముమీద ప్రయాణము గావింపసాగిరి. స్పెయిన్ వారి యాధిక్యత కంతకు అమెరికానుండి వచ్చుచున్న వెండిబంగారములే ప్రధానకారణము లగుటవలన నీలోహముల తెచ్చునోడల పట్టుకొని వానిలోని విలువగల పదార్థముల నన్నిటిని నపహరించుటయే శత్రుబలమునడఁచుటకు మార్గమని ఇంగ్లీషునావికులు సముద్రముమీద నక్కడక్కడదాగియుండి, సమయము దొరకినపుడెల్ల శత్రుసంబంధమగు నోడలనెల్ల పట్టుకొని వానిలోని వెండిబంగారములదో

చికొని, వానినిముంచి, స్వదేశమునకు రాఁబోచ్చిరి. ఇట్లు 1570 మొదలేటేటనెన్నియోపర్యాయములు జరుగుచువచ్చెను ఇందువలన అమెరికాయందలి గనులలో పనిచేసి లోహముల సంపాదించుటకై కష్టపడువారు స్పెయిన్ దేశస్థులుగను, తత్ఫలమునంతను ననుభవించువారు ఇంగ్లీషువారుగను, ఏర్పడిరి.

ఇంగ్లీషువారీవిధముగ కలిగించుచున్న నష్టము నెంతమాత్రము సహింపలేక, వారిని తగువిధముగశిక్షింపనెంచి, స్పెయిన్ ప్రభువెన్నియో యుపాయములనుపన్ని తుదకు 1587 లో నదివఱకెవరును వినికని యెఱుఁగనంతటి నౌకాబలమును తయారుచేసి ఇంగ్లండుపై దాడివెడలుటకు సంసిద్ధుఁడాయెను. కాని, కడుసాహసులగు ఇంగ్లీషు నాయకులలో కొందఱు స్పెయిన్ దేశపు టోడలలో ప్రవేశించి, ఈనౌకాబలములోని చాలభాగము నగ్నిహోత్రునిపాలుగావించి, కడునేర్పుతో తిరిగి స్వదేశమునకు వచ్చిచేరిరి. స్పెయిన్ రాజు మాత్రము తనపట్టుదలను విడిచినవాఁడు కాఁడు. విశేషపరిశ్రమచేసి, యపరిమిత ధనమును ఖర్చుపెట్టి, మఱియొక నౌకాబలము నతివేగముగ సమకూర్చి 1588 లో నింగ్లండుపై దాడివెడలెను.

ఇట్టి యుపద్రవము తమదేశమునకు కలుగునని అదివఱకే ఇంగ్లీషువారెఱిఁగియుండిరిగాన వారుకూడ వారి యోడలను సిద్ధముచేసి, శత్రుబలమునంతను 'ఇంగ్లీషుచానల్' అనుసముద్రభాగమున నెదుర్కొనిరి. అప్పుడిరుపార్శ్వములవారికిని ఘోరయుద్ధము సంప్రాప్తమాయెను. కాని, సముద్రయుద్ధమందు ఇంగ్లీషువారెక్కువ నేర్పరులగుటవలనను, ఇంగ్లీషువారి యోడ



లెక్కువవేగముగ ప్రయాణముచేయఁగలవగుటచేతను, శత్రువులయోడలలో మందుగుండు మొదలగు యుద్ధసామగ్రిచాల తక్కువగ నుండినందునను, ఇంగ్లీషువారికి పరిపూర్ణజయము లభించెను. శత్రునావలలో చాలభాగముసముద్రునిపాలాయెను మిగిలినవి స్వదేశమునకు వెళ్లుటకు ప్రయత్నించుచుండఁగా సముద్రమధ్యమందు తుపానొకటిలేచి వానినన్నిటిని వినాశముగావించెను.

అదివఱకెన్నఁడుగాని యింతగొప్ప జయము ఇంగ్లీషువారి కబ్బినదిలేదు. ఇంతగొప్ప పరాభవము నదివఱకు స్పెయిన్ దేశస్థులెన్నఁడు పొందినవారు కారు. ఇదిమొదలు ఇంగ్లీషువారి యాధిక్యత నలుఖండములందువ్యాపింపఁదొడఁగెను. సముద్రముమీఁద ఇంగ్లీషువారితో సమానముగనిలిచి యుద్ధముచేయఁగలవారొండొరులు లేరనుప్రఖ్యాతి వారు సంపాదించిరి. స్వేచ్ఛగా అమెరికాకువెళ్లి వ్యాపారముచేసి ద్రవ్య సంపాదనము చేయుటకు ఇంగ్లీషువారి కవకాశము కలిగెను. కనుకనే 1588 లో సంప్రాప్తమైన యీజయ మాంగ్లేయ సామ్రాజ్యమునకు పునాదియని చెప్పఁదగియున్నది.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## నాల్గవ ప్రకరణము.

1588 లో ఆంగ్లేయులు స్పెయిన్ వారి నోడించి, అట్లాంటిక్ సముద్రముమీఁద స్వేచ్ఛగా ప్రయాణము కావించుటకును సమస్తదేశములతో నిరాటంకముగ వ్యాపారము చేయుటకును హక్కును సంపాదించిరి. కాని, ఆకాలమం దిండియా, చైనా మొదలగు ప్రాగ్దేశములుమాత్రమే ఇంగ్లీషువారి వాణిజ్యమున కనుకూలించి యుండెను. వీనిలోని ప్రజలుమాత్రమే ఐరోపాఖండమందు దొరకని యమూల్య పదార్థముల నుత్పత్తిచేసివిక్రయింప సమర్థులుగ నుండిరి. ఐరోపాదేశములనుండి వర్తకులు తీసికొనివచ్చు విలువగల సరకులనుగొనుటకు కావలసినంత ధనధాన్యములు వీరికిమాత్రమే యుండెను. అనాదిగ వీరు విదేశవర్తకులతో క్రయవిక్రయములను చేయుచుండినందున నిప్పుడు వీరితో వ్యాపారముచేయుట ఇంగ్లీషువారికి సులభముగను, ఆదాయకరముగను కన్పట్టెను. అమెరికాలోని దేశములస్థితి ఆకాలమం దిట్లుండలేదు. మధ్య దక్షిణ అమెరికా లదివఱకే శత్రువులగు స్పెయిన్ వారిస్వాధీనమై యుండినందున వానితో ఇంగ్లీషువారు వ్యాపారముఁగావించుట సులభసాధ్యము కాదాయెను. ఉత్తర అమెరికాయంతయు నాతికఠినముగ ఇంగ్లీషు



వారిస్వాధీనము కాఁగలిగినను అందులోచాలభాగమాకాలమం జనశూన్యమై కారడవులతోను ఘోరమృగములతోను నిండియున్నందున ఆప్రదేశమందు ప్రథమమున ఇంగ్లీషువారి వర్తకమున కిట్టివసతియు లేకపోయెను. కొన్ని భాగములు నిర్జనములు గాక యుండినను, అందులోనివారు దిమ్మరులగు ననాగరికులగుటచే వారితో వ్యాపారము చేయుట కష్టతరముగ నుండెను. ఇంగ్లీషువారికి కావలసిన పదార్థముల నుత్పత్తిచేసి విక్రయించుటకుఁగాని, వారివద్దనున్న వస్తుసముదాయమును కొనుటకుఁగాని, యాయడవిజాతివా రనర్హులై యుండిరి. ఈ కారణములచేతనే ఇంగ్లీషువారు మన దేశమునం దడుగిడిన దాదిగ లాభము గడింపఁగలిగియుండిరిగాని, అమెరికా లభించినందుకు వారికి ప్రప్రథమమున విస్తారపు టాదాయము కలుగకపోయెను.

వ్యాపారమున కనుకూలింపని నిర్జనప్రదేశము లనేకములు స్వాధీనమైనప్పుడు వానివలన ఫలమును సంపాదింపఁ గోరిన యెడల వానిని జనసహితములుగ చేయుటకన్న వేరుమార్గము లేదు. ఉత్తర అమెరికా ఖండమం దాకాలమున ధనము గడింప సమర్థులగు మనుష్యులుమాత్రమే లేకయుండిరి గాని, ధనమును సంపాదించుటకు వలయు మిగిలిన వసతు లన్నియు నపరిమితముగ నుండెను. అనంతములైన వెండిబంగారు గనులును, మితిలేని పంటలుపండు సారవంతమైన భూమియు, వ్యవసాయ వ్యాపారముల కనుకూలించు సముద్రములంతటి నదులును, సరస్సులును, ఆఖండమందు వెలయుచుండెను. ఇట్టి

స్థితిలో నాగనులయందు పనిచేయఁగలిగినట్టియు, అడవుల ఖండించి, మృగముల పారఁదోలి భూమినిచక్కఁపరచి వ్యవసాయము చేయఁగలిగినట్టియు, ఇతరములైన నైసర్గికసదుపాయముల నెల్ల తగువిధమున నుపయోగింపఁగలిగినట్టియు, ప్రజలెంతయధికముగనక్కడికి వెళ్ళి కాపురముచేసినయెడల నంతయధికముగ నాదాయము సంపాదించుట కవకాశముండెను. కాలక్రమముగ ఐరోపాఖండవాసులీ రహస్యమును గ్రహించి, యిందుకొరకై తగుప్రయత్నముల చేయసాగిరి. వీరందఱిలో ఆంగ్లేయుల యుద్యమములే తుదకు ఫలించినందు వలన ఉత్తరఅమెరికాయంతయు నాజాతివారి కనికిపట్టై వారిస్వాధీనము కాఁగలిగెను.

ఉత్తరఅమెరికాలోని దేశములు నిర్జనములగుటయే గాక మిక్కిలి శీతలముగనుండుటచే తెల్లవారు వెళ్లి కాపురముచేయుటకు యోగ్యములై యుండినవి. క్రమక్రమముగ ఇంగ్లీషువారనేకులు మాతృదేశమును వదలి అక్కడనివసించుటకు మొదలిడిరి. కొంతకాలమునకు వీరిసంఖ్య యభివృద్ధి యగుటచే అమెరికాయొక్క తూర్పుసముద్రతీరమందంతటను వారువ్యాపించిరి. మాతృదేశమగు ఇంగ్లండుకన్న అమెరికాయందే యెక్కువసౌఖ్యముగ జీవనముచేయవచ్చునని వీరికితోఁచుటచే వీరక్కడనే పల్లెలను పట్టణములను కట్టుకొని కొంతకాలమునకు అమెరికాఖండమునే స్వదేశముగ భావింపఁదొడఁగిరి. ఇంగ్లీషువారనేకులు మాతృదేశమును వదలి ఈవిధముగ అమెరికాయందు స్థిరనివాసముల నేర్పరచుకొనుట చేతనే అఖండ



ములో చాలభాగము వారిస్వాధీనమాయెను. ఇట్లు స్వదేశమును బొత్తిగ వదలిపెట్టిన యింగ్లీషువారు కాపురముచేయుచుండు ప్రదేశములకే "కాలనీల"ని పేరు. ఇంగ్లీషువారు రాకపూర్వమీ "కాలనీలు" జనశూన్యములుగనో, లేక, యనాగరికులగు వారినివాసస్థానములుగనో, యుండినవి. ఇప్పుడివి జనబాహుళ్యములైనాగరికులగు ఇంగ్లీషు వారినివాసములుగనున్నవి. 1600 కు పూర్వము ఇంగ్లీషువారికి ఇంగ్లండు మాత్రమే స్వదేశమైయుండెను. ఇప్పుడుఆస్ట్రేలియా, కనడా, న్యూజిలండు మొదలగు కాలనీలన్నియు వారిలో ననేకులకు స్వదేశములుగనున్నవి.

కాలనీలయభివృద్ధి కంతకు జనబాహుళ్యమే ప్రధాన హేతువు. ఏదేశమందు జనసంఖ్యయెక్కువగ నుండునో, ఎందులోనిప్రజలు నిర్భయముగ స్వదేశమునువిడిచి దేశాంతరములకు వెళ్లి తమస్థితిగతులను బాగుచేసికొనవలయునను పట్టుదలనెక్కువగ కలిగియుందురో, అట్టిదేశముల వారికాలనీలెల్లప్పుడు నున్నతస్థితియందుండఁగలవు. ఈసదుపాయములు లేనివారు కాలనీల నొకప్పుడు సంపాదింపఁగలిగినను వానివలన విశేష లాభమును పొందఁజాలరు. ఇంగ్లీషువారికంటె ననేకసంవత్సరములకు పూర్వమునుండి స్పెయిన్ వారు అమెరికాయందు విస్తారమైన రాజ్యమును సంపాదించినను, అమెరికాకు వెళ్లి యచ్చటనే స్థిరముగ నివాసముచేయుట కిష్టపడినప్రజలు స్పెయిన్ దేశమందు విశేషముగ లేనికారణముచే వారికాలనీలు ఇంగ్లీషుకాలనీలవలె వృద్ధినొందుట కవకాశము లేక

పోయెను. పోర్చుగీసువారు కూడ ఇంగ్లీషువారికంటెపూర్వమే కాలనీల సంపాదించుటకు ప్రారంభించిరి. కాని, పోర్చుగల్ మిక్కిలి చిన్న దేశమగుటవలనను, అందులోని జనసంఖ్య మిక్కిలి తక్కువగుట వలనను కాలనీలలోనికి వెళ్లి వానివలన లాభము సంపాదించుటకు కావలసినందఱు ప్రజలులేరైరి. ఇందుచేతనే పోర్చుగీసువారి కాలనీ లతిస్వల్పకాలముననే క్షీణతనుపొందినవి. ప్రస్తుతకాలమందు ఇంగ్లీషు కాలనీలు మిక్కిలి యుచ్ఛస్థితియందుండుటకు వారిజనబాహుళ్యమును, ఉత్సాహమును ప్రధానకారణములు.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## ఐదవ ప్రకరణము.

అమెరికా ఖండమందు కాలనీల సంపాదించుటకు ఇంగ్లీషువారు 1583 మొదలు ప్రయత్నములను చేయుచుండినను కొన్ని సంవత్సరములవఱకు వారియుద్యమములు సఫలములుగాక యుండెను. అమెరికాయందెక్కడ చూచినను వెండిబంగారు గనులున్నవనియు, అక్కడకు వెళ్లినవారందఱు అనాయాసముగ కుబేరులు కాఁగలరనియు నాకాలమునందలి ఇంగ్లీషువారు భ్రమపడియుండిరి. ఇట్టి భ్రమకు లోనైనవారే 1583 మొదలు మాతృదేశము వదలి కాలనీల నేర్పరచుకొనుటకై వెళ్ళుచుండిరి. కాని వెండిబంగారు గనులగపడుటకు మారు వారికి దుర్గమములగు నరణ్యములును భయంకరములగు మృగములును దిమ్మరులగు అడవిజాతి మనుష్యులును కనఁబడిరి. ఈ యరణ్యములను ఛేదించి మృగములను పారఁదోలి భూమిని బాగుచేసికొని యుండినయెడల కాలక్రమమున వారికపరిమితముగ సౌఖ్యమును లాభమును గలిగియే యుండును. అట్లుగాక వారందఱు పెద్దయిండ్లలో పుట్టి కాయకష్టమన నేమియో యెఱుఁగని వారగుటచేతను, సులభమార్గమున వెండిబంగారముల సంపాదింపవచ్చునని యాసతో నింతదూరము వచ్చిన

వారగుటచేతను సోమరులై కొందఱును రోగపీడితులై మఱి కొందఱును శత్రువులపాలై తక్కినవారును నశించిరి. అందుచే కొంతకాలమువఱకు ఇంగ్లీషుకాలనీ యొకటికూడ అమెరికాయందేర్పడలేదు.

ఇట్లు కొంత కాలము జరిగినతర్వాత ఇంగ్లీషువారిలో ప్రముఖులు కొందఱు కాలనీ నొకదానినేలాగైన నంపాదింపవలయునను దీక్షవహించి ప్రభువునాజ్ఞనుపొంది యొక సంఘముగ నేర్పడిరి. ఇంగ్లండును వదలి అమెరికాకువచ్చి చేరినట్టివారిని కొన్నిసంవత్సరముల పర్యంతము తామే అన్నవస్త్రముల నిచ్చి పోషించెదమనియు, పిమ్మట వారికి కావలసినంత పొలమునిచ్చి వ్యవసాయము చేయుటలో తోడ్పడెదమనియు నాసంఘమువారొప్పుకొనిరి. వీరియొక్క పట్టుదలవలన 1605 లో వర్జీనియా అను కాలనీయొకటి యేర్పడెను. క్రమక్రమముగ ననేకులు దీనిలోనికివచ్చి చేరిరి. వారు భూమినిచక్కపరచి సేద్యమును ప్రారంభించి, నేలమిక్కిలి సారవంతమైనదగుటచే తగినలాభమును పొందసాగిరి. ఇట్లుకొంతకాలము జరిగినతర్వాత నదివఱకు ఐరోపియనులు ఎఱిఁగియుండినట్టి పొగాకును "వర్జీనియా" లోనివారు పండింప మొదలిడిరి. ఈకాలనీలోని భూమి దీనికి మిక్కిలి యనువైనదగుటచే వీరియైశ్వర్యమునకంతకు నిదియే మూలాధారమాయెను.

వర్జీనియాకాలనీ జయప్రదముగ స్థాపింపఁబడిన తర్వాతసహితము ఇంగ్లీషువారనేకులు అమెరికాకు వెళ్ళుటకు జంకుచుండిరి. స్వదేశమునువదలి అమెరికాకనేకులు వెళ్లినయెడల ఆం



గ్లేయసామ్రాజ్య మభివృద్ధి గాంచఁగలదనియు, అట్లుచేయుట దేశభక్తిగలవారికి విధియనియు, అందువలన దేశమునకేగాక వెళ్లువారికిఁగూడ విశేషలాభము కలుగుట కవకాశమున్నదనియు, ఆంగ్లేయులలోని ప్రముఖులు ప్రజలకు బోధించుచునే యుండిరి. ఆకాలమందు ఇంగ్లండులోననేకులు జీవనాధారములులేక భిక్షాటనమువలన కాలక్షేపము చేయుచుండిరి. కాని అమెరికాకు వెళ్ళుటకు కావలసినంత యుత్సాహసాహసములు వారియందు లేకయుండెను. దూరదేశములకు వెళ్లుటకు పూర్వమిట్లు సంకోచించుట కొంతవఱకు మనుష్యస్వభావమే గదా! ఈకారణముచేత కాలనీలు త్వరితముగ నభివృద్ధియగుటకవకాశము లేకపోయెను.

అయినను, ఇంగ్లీషువారి యదృష్టవశమున క్రమక్రమముగ నిదియంతయు మాఱఁజొచ్చెను.

1500 తర్వాతక్రైస్తవులలో కెతాలిక్కు, ప్రొటెస్టాంటు అనుశాఖలు రెండు బయలుదేరినవనియు, ఇంగ్లీషువారిలో చాల భాగము ప్రొటెస్టాంటులైరనియు నిదివఱకే మీరు చదివియున్నారు. ప్రాచీనమతగురువగు "పోపు"యొక్క యధికారమును ధిక్కరించుటయందు "ప్రొటెస్టాంటు"లందఱేకీభవించిరి గాని, దానిస్థానమున నెట్టిమతము స్వీకరింప వలయునను విషయములో వీరిలోవీరికి పరస్పరాభిప్రాయభేదములు కలిగి కలహములకు కారణమాయెను. వేదములకిదియర్థమని శంకర మతస్థులును, ఇదియర్థమని రామానుజమతస్థులును ఇవిరెండునుకావని మాధ్వులును పోరాడినట్లు బైబిలు మొదలగు క్రీస్తుమత

గ్రంథములలోని ధర్మముల విషయమై ప్రొటెస్టెంటులలో భిన్నాభిప్రాయములు జనించెను. ఇట్టి సందర్భమున ఇంగ్లండు దేశపురాజులు స్వాధికారము నధికముగావించుకొన నుద్దేశించి అదివఱకు మతవిషయములందు "పోపు"ను గురువుగ నెంచుకొనినట్లు ఇంగ్లండులోని ప్రొటెస్టెంటు లందఱిఁక మీఁదట ఇంగ్లీషు ప్రభువును మతగురువుగ నెంచుకొనవలసినదనియు, ఇదియే క్రైస్తవ ధర్మమనియు, మతవిషయములందు ప్రభువునాజ్ఞను శిరసావహింపనివారు దండనార్హు లగుదురనియు, ననేక శాసనములు గావించిరి. వీనికి బద్ధులగుట కిష్టపడినవారి కందఱికిని 'ఆంగ్లికన్ల'ను పేరుకలిగెను. కాని, మతవిషయము లందెవరికి వారే గురువులనియు, లేక పండితసభయే గురువని చెప్పుటకు తగియున్నదనియు ప్రభువెన్నటికిని గురువు కాఁజాలఁడనియు తక్కిన ప్రొటెస్టెంటులు వాదింపఁజొచ్చిరి. ఇట్టివారికి ప్యూరిటన్లను పేరుకలిగెను.

ఆకాలమందు ఐరోపా దేశములలో మతసహన మనునది మందునకైన కానరాకుండెను. ప్రతిమనుష్యుఁడును వానిమతమే సత్యమైనదనియు; స్వమతవిరోధుల బలవంతపఱచియైన తనమతములో చేర్చుకొనుట విధియనియు నభిప్రాయపడుచుండెను. ఇట్లే ప్రభువులుకూడ తలఁచుచుండిరి. కావున, ఆంగ్లికన్ మతమును స్వీకరించిన అప్పటి యింగ్లీషుప్రభువు లందఱు ప్యూరిటన్లననేకవిధముల బాధించుచుండిరి. ప్యూరిటన్లు వారి సొంత దేవాలయములకు వెళ్ళఁగూడదనియు వారిగ్రంథముల ప్రచురించి వారిమతము నితరులకు బోధింపఁ



గూడదనియు ఆంగ్లికన్లాచరించుచుండిన కర్మలనన్నిటిని వారుగూడ నాచరింపవలసినదనియు చట్టములనేకముల నమలులో నుంచిరి. ఇందుచే స్వమతోద్ధారణమునకై ప్యూరిటన్లు పడుచుండిన బాధల సంఖ్యాకములై యుండెను. వారిలో ననేకులు యావజ్జీవము కారాగృహములందే గడపవలసి యుండిరి. అనేకులు చెవులు ముక్కులు మొదలగు నంగముల గోలుపోయి కురూపులైరి. ఇట్లనేకవిధములగు శిక్షలకు పాత్రులగుటచే నిక తమజన్మము వృథాయనియు తాము ఇంగ్లండులో నుండునంతవఱకు స్వమతధర్మముల నాచరించుటకు వీలుండదనియు పరమతధర్మముల స్వీకరించినయెడల నరకప్రాప్తి యగుననియు, ఇహసుఖము లెన్నియున్నను పరసుఖమార్గము లేనప్పుడు జీవించియుండుట యనుచితమనియు ప్యూరిటన్లలో ననేకులు నిశ్చయము చేసికొనిరి.

ఈప్యూరిటన్ల దురవస్థలే ఇంగ్లీషువారి కాలనీలయభివృద్ధికి కారణమాయెను. నిలుచుటకు స్వదేశమందు నీడలేక ప్రభువుల ప్రబలవిరోధమునకు పాత్రులై మతనిరతులైన ప్యూరిటన్లు ఇంగ్లండునుండి సమస్తబాధల పడుటకన్న దేశాంతరములకు వెళ్లి యథేచ్ఛగ స్వమతధర్మముల పాటింపవచ్చుననెడి స్థిరనిశ్చయముతో అమెరికా ఖండమందు నిర్జనప్రదేశము లెన్నియో యుండుటచే నచటికి వెళ్ళినయెడల వారిని నిర్బంధించువారెవ్వరుండఁజాలరని మాతృదేశమును వదలుటకు తీర్మానించుకొనిరి. ఈప్యూరిటన్లు మిక్కిలి పట్టుదలగలవారు. వీరికి స్వాతంత్ర్యమందున్నంత ప్రేమ మరి దేనియందు లేదు. వీరం

దలు కమధనవంతులు కమదరిద్రులునుగాక కష్టపడి పనిచేసి గృహస్థధర్మముల నిర్వర్తించుటయందు మిక్కిలి యాసక్తిగలిగినట్టివారు. ప్రప్రథమమున నెన్నియో కష్టములపడినఁగాని అమెరికాయందు తమకు జీవనాధారములు కలుగఁజాలవనివీరెఱిఁగియుండినను కష్టములను వీరుగమనింపక 1620 మొదలు వీరిలో ననేకులు అమెరికాకు వెళ్ళసాగిరి.

1640 లోపుగా నిరువదియైదు వేల ప్యూరిటన్లు ఆలుబిడ్డలతోఁగూడ ఇంగ్లండునువిడిచి వర్జీనియా కుత్తరభాగమందు ప్లిమత్, మెసచెసట్సు, రోడ్ అయిలెండు, కనెక్టికట్ అనుకాలనీల స్థాపించిరి. 1640 తర్వాత కొన్నిసంవత్సరముల పర్యంతము ప్యూరిటన్లు అమెరికాకు వెళ్ళుటమానిరి. దీనికి కారణము లేకపోలేదు. ఆకాలమందు ఇంగ్లండును పరిపాలించుచుండిన మొదటి చార్లెసుయొక్క దుష్కృత్యముల వారుభరింప లేకయతనితోఁకలహించి గొప్పసైన్యములను కూర్చుకొని యుద్ధమందతనినోడించి తుదకాతని నురిదీసి 1649 లో ప్యూరిటన్ ప్రభుత్వమును ఇంగ్లండులో స్థాపించిరి. 1660 వఱకు వీరిప్రభుత్వమే ఇంగ్లండునందు సాగుచుండినందున నదివఱకు వీరుపడుచుండిన కష్టములన్నియు తొలఁగినవి. కావున మాతృదేశమును వదలి అమెరికాకు వెళ్లుట వారికవసరము లేకపోయెను. 1660 లో మొదటి చార్లెసు కుమారుఁడగు రెండవచార్లెసు సింహాసనాధిష్ఠితుఁడగుటచే ఆంగ్లికన్మతము పునరుద్ధారణము కావింపఁబడెను. ఈకారణముచే ఆంగ్లికన్లు కాని వారుకొందఱు పూర్వమువలె స్వదేశమునువదలి అమెరికాలో పెన్సల్వేని



యా యను కాలనీని 1681 లో స్థాపించిరి.

మతబాధల నోర్వఁజాలక అమెరికాకువెళ్ళిన వారొక ప్యూరిటన్లుమాత్రమే కారు. ఇంగ్లండులోని కతోలిక్కుల స్థితికూడ మిక్కిలిశోచనీయముగ నుండినందున వారిలోఁగూడ కొందఱు 1632 లో "మేరీలాండు" అనుకాలనీని స్థాపించుకొనిరి.

ఇట్లు క్రమముగ వేలకొలఁది ఇంగ్లీషువారు అమెరికాకు వెళ్ళి స్వతంత్రులగుటయేగాక మిక్కిలి ధనమునుగూడ సంపాదింపఁగలిగిరి. దీనినిచూచి మరికొందఱెక్కువ సాహసముతో నచటికివెళ్ళి క్రొత్తకాలనీల నేర్పరచుకొని వ్యవసాయ వ్యాపారముల మూలమున నెక్కువధనమును గడింపఁగలిగిరి. ఉత్తరకారొలైనా దక్షిణకారొలైనా జార్జియా మున్నగుకాలనీల స్థాపించినవారు వీరే. మరికొందఱుత్తర అమెరికాకువెళ్ళక పశ్చిమ ఇండియాదీవులలోఁ జేరిరి. ఈప్రదేశములలోని భూములు చెరకుపంటకు మిక్కిలియోగ్యములై యుండెను. బర్మ్యుడాస్, సెంకిట్ట్సు మొదలగు కాలనీలిట్టివారిచే సంపాదింపఁబడినవి. ఈవిధముగ మతోద్ధారకులు, వర్తకులు, కర్షకులు మొదలగువారి యుద్యమముల మూలమున పదునేడవ శతాబ్దాంతములోపుగ ఉత్తరఅమెరికాయొక్క తూర్పుతీరము.లో చాలభాగమును మధ్యఅమెరికాలోని పశ్చిమఇండియా ద్వీపములలో కొన్నియును ఆంగ్లేయుల స్వాధీనము కాఁగలిగెను.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## ఆరవ ప్రకరణము.

కాలనీలీవిధముగ వృద్ధియగుచుండిన కాలమందు స్పెయిన్ హాలెండు దేశములవారు ఇంగ్లీషువారియెడల విరోధమును వహించియుండిరి. కాని 1588 తర్వాత స్పెయిన్ వారిబలము క్షీణింపసాగినందున వారివలన ఇంగ్లీషువారికి విశేషములగు కష్టములు కలుగలేదు. ఇదిగాక ప్యూరిటన్ల యధికారము ఇంగ్లండులో స్థాపితమైనపుడు ప్యూరిటన్ సేనాధిపతియగు క్రాంవెల్ 1655 లో స్పెయిన్ వారిని పూర్తిగనోడించి వారిస్వాధీనమందున్న అమెరికాలోని జమైకాద్వీపమును వశపరచుకొనెను. అదిమొదలు స్పెయిన్ వారనిన ఇంగ్లీషువారికి లక్ష్యమే లేకపోయెను.

హాలెండుప్రజలగు డచ్చివారినోడించుట ఇంగ్లీషువారికింత సులభముగాకయుండెను. ఇంగ్లీషువారివలెనే డచ్చివారుకూడ ప్రొటెస్టాంటుమతమును స్వీకరించిరి. వారివలెనే వీరుకూడ సముద్రయానమందును, సముద్రయుద్ధమందును మిక్కిలి యారితేరినట్టివారు. స్వమతమును స్వాతంత్ర్యమును రక్షించుకొనుటకై 1600 కు పూర్వమువారికి పరిపాలకులుగనుండిన స్పెయిన్ వారితో ముప్పదిసంవత్సరములు ఘోరయుద్ధము గావించి, వారిదేశము మిక్కిలి చిన్నదియైనను, స్పెయిన్ ప్రభువులకుండినంతబలము వారికి లేకయుండినను, వారిశౌర్య పరాక్రమములచేతను స్వాతంత్ర్యరక్షణమందు వారికుండిన యుత్సాహముచేతను శత్రుబలమునెల్ల నాశనముగావించి స్వరాజ్యమును సంపాదించుకొనఁగలిగిరి. అదివఱకూరుపేరులేక పరుల యధికారమునకు లోఁబడియుండిన డచ్చివారు యుద్ధవిషయములందదిమొదలధికమగు ననుభవమును సంపాదించి, అసమానముగు యుద్ధకౌశలము గలవారను ప్రఖ్యాతిగాంచిరి. స్వబలమును తెలిసికొనినట్టి వీరు దేశాంతరములతో వ్యాపారము చేయనమకట్టి ఇండియా మొదలగు తూర్పుదేశములకు పోర్చుగీసువారు కనిపెట్టిన మార్గముమీదుగ నోడలనంపి విశేషద్రవ్యము గడింపసాగిరి. ఇదిగాక వీరియోడలసంఖ్య మిక్కిలియధికముగనుండినందున తూర్పుదేశములనుండి యిరోపాలోని యితరదేశములకు సహితము వచ్చుచున్న సరకులన్నియు వానిలోనే వచ్చుచుండెను. వ్యాపారముతోమాత్రము తృప్తిచెందక, వీరు కాలనీల స్థాపించుటకుఁగూడ ప్రయత్నించి అమెరికాలోని ఇంగ్లీషుకాలనీలనడుమ న్యూయాంస్టెర్డు, న్యూజెర్సియను కాలనీలను దక్షిణఅమెరికా దక్షిణఆఫ్రికాలయందు మరికొన్నిటిని సంపాదించిరి. ఈకారణములచే 1650 నాటికి వీరిబలమసమానమైనదిగనుండెను.

డచ్చివారు స్పెయిన్ వారితో స్వాతంత్ర్యముకొఱకై

యుద్ధముగావించుచున్న కాలమందు ఇంగ్లీషువారు వారికి మిత్రులై విశేషముగు సహాయముచేసినప్పటికిని, వారును ఇంగ్లీషువారు నొక్కటేమతము నవలంబించినవారైనప్పటికిని, వ్యాపారము నిమిత్తముగను కాలనీలకొరకును వారిద్దరకు పరస్పరవిరోధము సంప్రాప్తమాయెను. తూర్పు దేశములతో వ్యాపారము చేయనుద్దేశించి డచ్చివారొక వర్తకసంఘమేర్పాటుగావించుకొని జావా, సుమాత్రా మొదలగు ప్రదేశములకు వారియోడలను పంపుచుండిరి; ఇంగ్లీషువారుకూడ నిట్లేచేయుచుండుటచేత నీద్వీపములలో వీరిరువురకు కలహములు సంభవించి 1623 లో "అంబాయనా" అనుస్థలమందుండిన ఇంగ్లీషువర్తకుల కొందఱిని డచ్చివారుచంపిరి. అదిమొదలు విరోధ మభివృద్ధిగాంచి తుదకు యుద్ధములకు కారణమాయెను.

1649 మొదలు పదునొకండు సంవత్సరములు ఇంగ్లండంతయు ప్యూరిటన్ల ప్రభుత్వమందుండెను. ఆకాలమందు వీరందఱికి క్రాంవెల్ అనుమహాపురుషుఁడు నాయకుఁడై దేశమును నిరంకుశాధికారముతో పరిపాలించుచుండెను. ఆంగ్లేయసామ్రాజ్యము నభివృద్ధిచేసి దేశములన్నిటిలో ఇంగ్లండు నగ్రగణ్యముగ నుంచవలయునని యాతని ప్రధానోద్దేశము. నౌకాబలము లేనియెడల నీయుద్దేశము నెరవేరఁజాలదని ఇంగ్లీషు నావలసంఖ్యను వృద్ధిచేయుట కతఁడొకచట్టమును కావించెను. ఈచట్టము డచ్చివారి నౌకాధిక్యతకు లోపముగలిగించునదిగ నుండినందున డచ్చివారు ఇంగ్లీషువారితో యుద్ధమునకుపూనిరి. ఈకారణములచే 1652 మొదలు డచ్చివారికిని ఇంగ్లీషు



వారికి ననేకయుద్ధములు జరిగెను. వీనియన్నిటిలో 1652 మొదలు 1654 వఱకు క్రాంవెల్ కాలమున జరిగినట్టిదియు తర్వాత రెండవచార్లెసు కాలమున 1664 మొదలు 1667 వఱకును 1672 మొదలు 1674 వఱకును జరిగిన రెండు యుద్ధములును మిక్కిలి ప్రధానములయినవి. వీనియందు డచ్చివారధికముగు పరాక్రమముచూపినను కొన్నిసమయములందు ఇంగ్లీషువారికి గొప్పనష్టము సంభవించినను తుదకు జయముమాత్రము ఇంగ్లీషువారికేలభించెను. ఈయుద్ధములవలన డచ్చివారి స్వాధీనమందుండిన ఉత్తరఅమెరికాలోని రెండుకాలనీలు ఇంగ్లీషువారివశమాయెను. తూర్పుదేశములతో ఇంగ్లీషువారు చేయుచుండిన వ్యాపారము వృద్ధిపొందఁదొడఁగెను: డచ్చివారి నౌకాధిక్యత క్షీణింపసాగెను.

1680 తర్వాత డచ్చివారివలన ఇంగ్లీషువారి కెట్టిభయమును లేకపోయెను. ప్రథమమున సమస్తవిషయములందు ఇంగ్లీషువారితో సమానులుగనుండిన వీరు ఇంగ్లీషువారివలె సామ్రాజ్యాధిపతులు గాకపోవుట కనేక హేతువులు గలవు. ఇంగ్లండు అట్లాంటిక్ సముద్రమందలి యొకద్వీపమగుటచే వ్యాపారమునకు ఇంగ్లీషువారికున్నంత సదుపాయములు వీరికి లేకపోయెను. ఇదిగాక హాలెండు ఐరోపాఖండ భూభాగమున నొక దేశమై అన్నివైపుల బలవంతులగు శత్రువులచే బాధింపఁబడుచుండెను. ఇంగ్లండట్లుగాక మహాసముద్రమందొక ద్వీపముగ నుండుటవలన ఐరోపాఖండమందు ఇంగ్లీషువారి కెందఱో శత్రువులుండినను ఇంగ్లండుపై దండెత్తి వచ్చువారెవ్వరు లేక

పోయిరి. ఈకారణముచేత ఇంగ్లీషువారు సైన్యముల కొరకై విశేషద్రవ్యమును ఖర్చుపెట్టవలసిన యవసరము లేకపోయెను. కావుననే వారియాదాయమునంతయు నౌకాబలమభివృద్ధి చేసికొనుటకై వారు వినియోగపరచి దానిమూలమున వారిసామ్రాజ్యము పెంపొందునట్లు గావించుకొనిరి. డచ్చి వారికిట్టి వసతులు లేకపోయెను. వారికిపొరుగున వారిదేశమును వశపరచుకొన ప్రయత్నించుచుండిన ఫ్రెంచివారుండిరి. సైన్యములులేనియెడల ఫ్రెంచివారినోడించుట కష్టతరమగుటచే డచ్చివారు వారిద్రవ్యమును నౌకాబలము నిమిత్తము మాత్రము ఖర్చుపెట్టక సైన్యములకొరకును కోటలకొరకును వ్యయపరచవలసియుండెను. ఈకారణముచే కొలఁదికాలముననే వీరినౌకాబలము హెచ్చుటమాని ఇంగ్లీషువారిబలముతో తులతూఁగలేకపోయెను. మఱియు ఫ్రెంచివారివలన స్వదేశమునకు గలుగుచుండిన యుపద్రవము హెచ్చగుచుండుటచేత ఇంగ్లీషువారి సహాయము లేకపోయినయెడల ఫ్రెంచివారి నోడించుట సాధ్యముకాదనియెఱిఁగి డచ్చివారు ఇంగ్లీషువారితో విరోధము సాధింపక వారితోమైత్రిని కోరఁదొడఁగిరి. కావున కొన్నిసంవత్సరములవఱకు నిరాటంకముగ ఇంగ్లీషువారు వారిసముద్రవ్యాపారము నభివృద్ధి చేసికొనఁగలిగిరి.

---

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## ఏడవ ప్రకరణము.

వాస్కోడిగామా, మనదేశమునకు నూతనమార్గ మొక దానిని కనుఁగొనినప్పటినుండి తూర్పుదేశములతో వ్యాపారముచేసి విశేషలాభము గడింపవలయుననెడి యుద్దేశము ఇంగ్లీషువారిలో ననేకులకుండెను. అట్టివారు కొందఱు 1600 న "తూర్పిండియాసంఘము"ను పేరుతో నొకవర్తకసంఘముగ నేర్పడిరి. అప్పుడు ఇంగ్లండునకు పరిపాలకురాలుగనుండిన "ఎలిజబెత్" రాణి వారిప్రయత్నముల సఫలము గావింపనెంచి వారుతప్ప తక్కిన ఇంగ్లీషువారెవ్వరు తూర్పుదేశములతో వ్యాపారము చేయఁగూడదని శాసించుచు వర్తకవిషయమున వారికి స్వతంత్రాధికారము కలుగునట్లుగ నొకయాజ్ఞాపత్రము నొసంగెను. దీనినాధారము చేసికొని వారది మొదలీ దేశములతో వ్యాపారమునకుపక్రమించిరి.

ఆకాలమున ఐరోపాఖండవాసులు ప్రాగ్దేశములనుండి కోరుచున్న పదార్థములలో లవంగములు మొదలగు తాంబూలద్రవ్యములును మిరియాలును మిక్కిలిప్రధానములై యుండెను. వీనికి జావా సుమాత్రా సెలబిస్ మొలకస్ ద్వీపములు

పుట్టినిల్లు. కావున తూర్పిండియాసంఘమువారు ప్రప్రథమమున మనదేశముతో వ్యాపారమంత ముఖ్యమని యెంచక వారియోడల నీద్వీపములకు పంపుచువచ్చిరి. కాని వారికి పూర్వము కొన్నిసంవత్సరములనుండి డచ్చివారీ ద్వీపములతో వర్తకము చేయుటయేగాక వానిని పరిపాలించుచుండిన రాజులతో వ్యాపారసంబంధమగు కొన్ని యొడంబడికలనుగూడ కావించుకొని యుండిరి. ఇట్టిసందర్భమున ఇంగ్లీషువారుకూడ నచటికివచ్చుటవలన తమకదివఱకు దొరకుచుండిన లాభము తగ్గిపోవునని యెంచి డచ్చివారు ఇంగ్లీషువారివ్యాపారమున ననేకములగు నాటంకములు గలిగింపఁదొడఁగిరి. ఇంగ్లీషువారు మాత్రము కొన్నిసంవత్సరముల వఱకు నిరుత్సాహులుగాక పట్టుదలతో నాప్రదేశములకు వెళ్లుచు వారికికావలసిన పదార్థములను స్వదేశమునకు కొనితీసికొని పోవుచుండిరి. ఇట్లుకొంతకాలము జరిగినతర్వాత పరస్పరవిరోధమువలన నిరుదేశములవారికి నపరిమితమగు నష్టము సంభవించునని ఇంగ్లీషువారు డచ్చివారితో కలిసి యొకవర్తకసంఘముగ నేర్పడి పనిచేయుట యుక్తముగ నుండునని తీర్మానించుకొనిరి. డచ్చివారుకూడ 1619 లో దీనికంగీకరించిరిగాని తుదకు వారసూయాపరులై ఆంగ్లేయులవర్తకమును నిర్మూలము కావింపసమకట్టి వారిపై లేనిపోనినేరముల మోపి వారిలో కొందఱిని "అంబాయనా" అనుచోట పట్టుకొనిచంపిరి. ఇంగ్లీషువారి కాగ్రహముకలిగెనుకాని వారాసమయమున నేమియు చేయలేకపోయిరి. ఇట్లు 1623 లో డచ్చివారివలన వారు పరాభవమును పొంది,



ఆద్వీపములతో వర్తకముచేయుట దుస్సాధ్యమని తలఁచి అదిమొదలు మనదేశముతో వ్యాపారముచేయుటయం దెక్కువ శ్రద్ధను వహించిరి.

తూర్పిండియా సంఘపువర్తకులు మనదేశమునకు మొట్టమొదట 1608 లో వచ్చిరి. అదిమొదలు వారాకాలమున మనదేశము నేలుచుండిన రాష్ట్రాధిపతుల యనుజ్ఞనుపొంది అచ్చటచ్చట వర్తకశాలలను కోటలను కట్టుకొనఁదొడఁగిరి. వర్తకముకొఱకై వచ్చిన ఇంగ్లీషువారు కాపురముండుటకును, వారు విదేశములనుండి తెచ్చినసరుకులను మనదేశమందుండి విదేశములకు తీసికొనిపోఁదలచి నట్టివానిని నిలువచేసికొనుటకును వారికి వర్తకశాలలత్యావశ్యకములై యుండెను. ఇదిగాక దారిదోపిడిగాండ్రవలనను ఐరోపా ఖండమందుండి వారితో పాటు వర్తకముచేయ నెంచివచ్చిన డచ్చి పోర్చుగీసు మొదలగు వారివలనను వారిసరుకులకును ప్రాణములకు నప్పుడప్పుడపాయము కలుగుచుండుటచే నట్టిసమయములందు సంరక్షణానిమిత్తమై వారికికోటలుగూడ నావశ్యకములై యుండెను. విదేశవర్తకులు చేయుచుండిన వ్యాపారము రాష్ట్రాధిపతులకుఁగూడ నాదాయకరముగ నుండుటచే వారికిబ్బందులు గలుగచేయక కోరినప్రదేశములందు వర్తకశాలల నిర్మించుకొనుటకు నిరాటంకముగ ననుజ్ఞనిచ్చుచుండిరి. ఆంగ్లేయుల వర్తకశాలలు క్రమక్రమముగ నభివృద్ధినై వారిని మనదేశమునకధిపతులుగ చేయఁగలిగియుండునని స్వప్నమందుఁగూడ నూహించుటకవకాశము లేకయుండెను.

తూర్పుద్వీపములలో డచ్చివారు ఆంగ్లేయుల వర్తకమును నిరోధించినట్లు పోర్చుగీసువారు మనదేశమునకు ఆంగ్లేయులు రాకుండునట్లు ననేకములగు ప్రయత్నములనుచేసిరి. 1498 లో పోర్చుగీసు నావికుఁడగు వాస్కో-డిగామా మనదేశమునకువచ్చెను. అదిమొదలుకొని నూరుసంవత్సరముల వఱకు ప్రాక్పశ్చిమదేశముల వ్యాపారమంతయు పోర్చుగీసువారియధీనమందుండెను. పదునేడవశతాబ్ద ప్రారంభమున ఆంగ్లేయులు కూడ నీవ్యాపారలాభము నపేక్షించి మనదేశమునకు రాఁగా తమకదివఱకు దొరకుచుండిన యాదాయమంతయుక్షీణించునేమోయని భయపడి పోర్చుగీసువారు ఇంగ్లీషువారిపై సముద్రయుద్ధమునకు పూనిరి. ఇట్టియుద్ధమొకటి 1612 న మనదేశపు పశ్చిమతీరమున సూరత్ పట్టణమువద్ద జరిగెను. అప్పటికే నౌకాయుద్ధములందు ఆంగ్లేయులకుఁగల కౌశలమధికమైయుండి నందున వారీయుద్ధములో పోర్చుగీసువారిని సంపూర్ణముగ నోడించిరి. డచ్చివారుకూడ నదివఱకనేక ప్రదేశములందు పోర్చుగీసువారి నోడించియుండుటచే శత్రువులుభయులునై నేకకాలమందు విరోధముసాధించుట దుస్తరమని ఇంగ్లీషువారితో సఖ్యముగనుండుట యుక్తమనియెంచి 1634 లో పోర్చుగీసువారుఆంగ్లేయులతో సమాధానము చేసికొనిరి. అదిమొదలు ఇంగ్లీషువారు మనదేశములో చేయుచుండిన వ్యాపారము నిరాటంకముగ జరుగఁదొడఁగెను.

శత్రువులతో నీవిధముగ పోరాడుచుండిన కాలమందు ఆంగ్లేయుల వర్తకస్థానముల సంఖ్యమాత్రమభివృద్ధి గాంచు



చునేయుండెను. 1611 లో వారు మచిలీపట్టణమందొక వర్తకస్థానమును స్థాపించిరి. 1612 లో మొగలాయీ చక్రవర్తియగు జహాంగీరునానతిపొంది సూరత్ పట్టణములో నొకవర్తకశాలను కట్టుకొనిరి. పశ్చిమతీరపు వ్యాపారమునకంతకునిది యాధారమై బొంబాయిపట్టణము ఇంగ్లీషువారి స్వాధీనమగువఱకు పశ్చిమభాగమునకిదియే ముఖ్యపట్టణమై యుండెను. 1639 లో చంద్రగిరిరాజుయొక్క యనుజ్ఞనుపడసి ఇప్పుడు మదరాసుపట్టణముండు ప్రదేశమును సంపాదించి సెంటుజార్జికోట నచటకట్టుకొనిరి. క్రమక్రమముగ వర్తకస్థానములన్నిటిలో మదరాసుపట్టణము ముఖ్యమైనదాయెను. ఇట్లుండఁగా వైద్యమందు కొంచెము ప్రవేశము గలిగియుండిన తూర్పిండియాసంఘపు నౌకర్లలో నొకఁడు బంగాళారాష్ట్రపు సుబేదారుని యుద్యోగములోచేరి, బంగాళాయందంతటను ఆంగ్లేయులు వర్తకము చేసికొనుటకును హుగ్లీపట్టణములో నొకవర్తకశాలను కట్టుకొనుటకును 1650 లోననుజ్ఞపొందెను. 1661 న ఇంగ్లండుదేశమునకు ప్రభువగు రెండవచార్లెసు పోర్చుగల్ దేశపు రాజుయొక్క కుమార్తెను వివాహమాడఁగా నదివఱకు పోర్చుగీసువారి స్వాధీనమందుండిన బొంబాయిపట్టణ మామెకరణముగ నీయఁబడెను; దీనిని రెండవచార్లెసు తూర్పిండియాసంఘమువారి కొసంగెను. ఇదిచక్కని రేవుపట్టణమగుట చేతను గొప్పయోడలు సహితము నిలువుటకు యోగ్యమైయుండుట చేతను మనదేశపు పశ్చిమభాగమందలి వర్తకస్థానములన్నిటికి ప్రధానపట్టణమాయెను. వర్తకస్థానము లభివృద్ధికాను

కాను వ్యాపారమువలన వచ్చుచుండిన లాభముగూడ నధికముగుచుండెను. ఇట్టిసమయమున పదునేడవ శతాబ్దాంతమందు చక్రవర్తిగనుండిన ఔరంగజేబునకు మహారాష్ట్రులవలన పరాజయము సంభవింపఁగా నాతనినధిక్కరించి మరికొన్ని ప్రదేశముల సంపాదింపవచ్చునని యుద్దేశముతో తూర్పిండియా సంఘమువారు క్రీ॥ 1686 లో నతనిపై యుద్ధమునకు పూనిరి. కాని కొలఁదికాలముననే వారతనిచే నోడింపఁబడుటయే గాక, అదివఱకు వారిస్వాధీనమందుండిన వర్తకశాలల ననేకముల కోల్పోయిరి. చక్రవర్తి మాత్రము వారియెడల దీర్ఘక్రోధమును వహింపక వారినిమన్నించి వర్తకస్థానములనన్నిటిని వారికిచ్చి యిప్పుడు కలకత్తా పట్టణమున్న ప్రదేశమున సెంటువిలియంకోటను కట్టుకొనుట కంగీకరించెను. ఇట్లు పదునెనిమిదవ శతాబ్దప్రారంభమగు నప్పటికి మన దేశమందు ఆంగ్లేయుల వ్యాపార మవిచ్ఛిన్నముగ జరుగుటకు కావలసిన వసతులన్నియు నేర్పడెను.

పదునేడవ శతాబ్దమున తూర్పిండియా సంఘమువారికి తక్కిన ఇంగ్లీషువారినుండికూడ కొన్ని కష్టములు సంభవించెను. హిందూదేశముతోడి వ్యాపారమువలన వీరికి విశేషలాభము వచ్చుచుండుటచూచి, ఆవ్యాపారము చేయుటకు వీరికిమాత్రమే హక్కుండుట యసంగతమనియు, ఇంగ్లీషువారిలో నెవరనిన వారీవ్యాపారము చేయవచ్చుననియు కొందఱువాదించి. వీరికిపోటీగా మన దేశమునకు రాఁదొడఁగిరి; మఱికొందఱు తూర్పిండియాసంఘము మోస్తరుగ వేరొకసంఘమును స్థాపించి



ప్రదేశములలో వ్యాపారము చేయుటకా కాలపు ఇంగ్లీషుప్రభువుయొక్క యనుజ్ఞనుపొందిరి. ఇట్లు కొంతకాలము వఱకు ఇంగ్లీషువారిలో పరస్పరవైషమ్యము పుట్టి వర్తకులందఱికి నష్టహేతువాయెను. కాని తుదకీరెండు సంఘములవారు నేకమై వారికదివఱకుండిన మనస్పర్థలమరచి 1707 మొదలు సర్వస్వాతంత్ర్యముతో వర్తకము చేయసాగిరి.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము.

## ఎనిమిదవ ప్రకరణము.

వర్తకము చేయనుద్దేశించి వచ్చినఇంగ్లీషువారు మనదేశమునకంతకు నెట్లు పరిపాలకులైరో మనమిప్పుడు తెలిసికొనవలసియున్నది.

పదునెనిమిదవ శతాబ్దప్రారంభమున మనదేశపు రాజకీయస్థితిగతులలో ప్రధానములగు మార్పులనేకములు కలిగెను. వీనిలో మొదటిది దేశమునకంతకు నొక్కటేప్రభువు లేకపోవుట. ప్రఖ్యాతిగాంచినటువంటి మొగలాయిచక్రవర్తియగు ఔరంగజీబు 1707 లో కాలధర్మమొందెను. తదనంతరము ఢిల్లీసింహాసనము నధిష్టించిన పాదుషాలెల్లరు బలహీనులును పౌరుషహీనులును పరిపాలనా సమర్థతలేనివారును నగుటచే పేరునకు వారు దేశమునకంతకుచక్రవర్తులుగ నుండినను నిజముగ వారి యధికారము ఢిల్లీపట్టణప్రాంతమందుతప్ప మరియెచటను చెల్లదాయెను. అయోధ్య బంగాళము దక్కను మొదలగురాష్ట్రముల నేలుచుండిన సుబేదారులు పేరునకు ఢిల్లీచక్రవర్తికి లోబడినవారైనను నిజముగ సర్వస్వాతంత్రిగలవారై చక్రవర్తినిధిక్కరించి వానిపై తిరుగబడి కొన్నిసమయములందు



కప్పములుగూడ చెల్లింపక స్వాధికారముతో ప్రవర్తించుచుండిరి. ఇప్పటి బొంబాయి రాజధానిలోని జిల్లాలలోమహారాష్ట్రులు ప్రబలి ముప్పదిసంవత్సరముల కాలము ఔరంగజీబుతో ఘోరయుద్ధముగావించి అతనిని సంపూర్ణముగనోడించి స్వతంత్రరాజ్య మొక్కదానిని స్థాపించుకొని అతనియనంతరము గుజరాత్ మాళవము విదర్భలోనగు రాష్ట్రములుగూడ స్వాధీనము గావించుకొనిరి. ఇట్లే రాజపుత్రస్థానములోని రాజపుత్రులును వారిసమీపమందుండిన జాటులును పంజాబులోని సిక్కులును మొగలాయీలతో కలహించిస్వతంత్రరాజ్యములను స్థాపించుకొనిరి. ఇట్టిసందర్భమున విదేశస్థుల బారినుండి మనదేశమును సంరక్షించు భారమొక్కరిపై లేకపోయెను. నూతనముగ సంపాదించిన వారివారి యధికారమును ప్రత్యేకముగ వారువారు కాపాడుకొననుద్దేశించి యుండిరేగాని దేశమునకంతకు నుపద్రవము కలుగుచున్నదను విషయముగుర్తెరిగి అట్టియపాయమును తొలగించుటకై ప్రయత్నించిన వారొక్కరును లేకుండిరి.

స్వతంత్రరాజ్యముల స్థాపించుకొని పరిపాలించుచుండిన వారిందఱుండినను నిజముగ దేశమంతయు నరాజకముగ నుండెననియే చెప్పదగియున్నది. దేశమంతయు నేలుటకు హక్కుగల ఢిల్లీచక్రవర్తిని ధిక్కరించి రాజ్యములు సంపాదించిన వీరియధికారము న్యాయమైనదని చెప్పుటకు వీలులేదనియు బలవంతులగుటచే నేవిధముగ వీరు ఢిల్లీపాదుషాయొక్క యాజ్ఞలనుల్లంఘించి స్వరాజ్యముల నిర్మించుకొనగలిగిరో అట్లే

బలవంతులగు తక్కినవారెవరైనను వీరిరాష్ట్రము లపహరించుటలో దోషమేమియు లేదనియు బలమెవరికుండిన వారుబలహీనులజయించి వారిరాజ్యముల వశపరచుకొనవచ్చుననియు రాజ్యకాంక్షగలవారెల్లరు భావించుచుండిరి. పౌరుషవంతుఁడెవఁడైనను కొందఱుసైనికులను చేర్చికొని ఈరాష్ట్రాధీశులపై దాడివెడలి క్రొత్తరాజ్య మొకదానిని స్థాపించుకొనుట పౌరుషధర్మమనియు, ఈవిషయములలో న్యాయాన్యాయవిచారణ మసంగతమనియు బలవంతులగు వారెల్లరనూహించుచుండిరి. ఒకసంవత్సరమున రాజ్యపరిపాలనము గావించుచున్నవాఁడు మరుసటిసంవత్సరము రాజ్యభ్రష్టుఁడై యుండుట సంభవమగుచుండెను. రాష్ట్రములు యెల్లలు దినదినమునకు మార్పొందఁదొడఁగెను. ప్రతిసుబేదారుఁడును ప్రతిరాష్ట్రాధీశుఁడును ఇరుగుపొరుగు వారి రాజ్యముల నపహరింపసమయమును కనిపెట్టుచు అట్టితరుణము గలిగినపుడది వృధగాఁకుండఁ జూచుచుండెను. రాష్ట్రాధీశులలో పరస్పర వైషమ్యము ప్రబలి దేశమును నిరంతరయుద్ధపూరితముగ కావింపఁజొచ్చెను.

ఇట్టి రాజకీయ విప్లవములలో న్యాయాన్యాయముల విచారణముచేయ సమర్థులుగాని న్యాయసంస్థాపనము చేయఁగల వారుగాని దేశమందు లేకుండిరి. ప్రజల విత్తములును ప్రాణములును దినదినగండములతో కూడియుండెను. వర్తకవ్యాపారములుజరుగుట దుస్సాధ్యమాయెను. ఈవిధముగ మొగలాయీ సామ్రాజ్యము వినాశమొందుచున్న యీసంధికాలమున కలిగిన సంక్షోభమింతింతయని చెప్పుటకు వీలులేదు. ఇట్టితరుణ



మున వర్తకము చేయుటకై మనదేశమునకువచ్చిన ఇంగ్లీషు వారికి రాజ్యస్థాపన మత్యావశ్యకమాయెను.

పెక్కువేలమైళ్ళ దూరమునుండి వచ్చినవారైనను వీరు పదునెనిమిదవ శతాబ్ద ప్రారంభమగునప్పటికి మనదేశమందచ్చటచట వర్తకశాలలను కోటలనునిర్మించుకొని, ఐరోపియను శత్రువులనెల్లఁ దునుమాడి వ్యాపారమువలన విశేషలాభము సంపాదించుచుండుట చేత దేశమందుకలిగిన యరాజకము వలన వారివర్తకమునకు నష్టముకలుగునేమోయని భయపడసాగిరి. రాష్ట్రములోని వర్తకులనుసంరక్షించుభారము రాష్ట్రాధీశునిదైనను అప్పటికాలపు రాష్ట్రాధీశులు క్రొత్తవారగుటవలనను వారియధికారమింకను స్థిరముగ నాటుకొనకుండుటవలనను ఇంగ్లీషువారి వ్యాపారమునురక్షించుటకు వారుసమర్థులుగాకుండిరి. అధికారులు దినదినమునకు మారుచుండుటవలన వర్తకవిషయమై పూర్వపురాజులు తమకొసంగిన హక్కులకు భంగము కలుగునేమోయని ఇంగ్లీషువారనుమానింపవలసివచ్చెను. ఈయనుమానముగూడ వారినధికముగ బాధింపలేదు. క్రొత్తగవచ్చిన రాజుల నేదియో విధమున మంచిచేసికొని వారికితగిన నజర్లనిచ్చి వారియనుగ్రహమునకుపాత్రులుగావచ్చునని ధైర్యమువహించియుండిరికాని 1740 మొదలట్టి ధైర్యము వహించుటగూడ దుస్సాధ్యమాయెను. దీనికి ఫ్రెంచివారువారివ్యాపారాభివృద్ధికై కావించుచుండిన ప్రబలప్రయత్నము లేకారణము. అదివఱకే ప్రపంచమందితరఖండములలో ఇంగ్లీషువారికిని ఫ్రెంచివారికిని పరస్పర వైషమ్యమధికమగుచుం

డినందున ఫ్రెంచివారిప్రాబల్యము మన దేశమందుఁ గూడ నతిశయించినచో తమవ్యాపారముక్షీణింపఁగలదని ఇంగ్లీషువారు సమయానుగుణముగ పరివర్తింపవలసినవారైరి.

ఆంగ్లేయులవలె ఫ్రెంచివారు గూడ మన దేశముతో వ్యాపారముచేయ ననేకప్రయత్నములకావించి తుదకు 1664 లో తూర్పిండియా వర్తకసంఘ మొకదానిని స్థాపించుకొని, మన దేశపుపరిపాలకుల యనుజ్ఞనుపొంది కొన్ని వర్తకశాలలను కోటలను గట్టుకొనఁగలిగిరి. 1741 లో డూప్లేయనువాఁడు ఫ్రెంచివర్తకశాలలకు ప్రధానపట్టణముగనుండిన పుదుచ్చేరికి గవర్నరాయెను. అది మొదలు ఫ్రెంచివారి యుద్యమములందు మార్పుగలిగి తుదకుఇంగ్లీషువారికి రాజకీయలాభము సంప్రాప్తమగునట్లు చేసెను.

ఫ్రెంచివారికి ఇంగ్లీషువారికిని మన దేశమందచ్చటచట కొన్నికోటలుండినవని ఇదివఱకే మీకు తెలిసియున్నది. వీనిని రక్షించుకొనుటకును, చేయుచున్న వ్యాపారమునకు శత్రువులవలన నష్టము కలుగకుండుటకును కొద్దిగ వారివారి దేశములనుండి సైన్యములుదెచ్చుకొని యాకోటలలో వారుంచుకొనియుండిరి. ఈసైన్యములమూలమున మన దేశమును జయింపవలయుననెడి యుద్దేశము ఇంగ్లీషువారికిఁగాని ఫ్రెంచివారికిఁగాని అప్పటివఱకు లేదు; కాని 1744 తర్వాత డూప్లే ఫ్రెంచిసైన్యముల వేరొకవిధముగ నుపయోగపరుప తీర్మానించుకొనెను. 1744 మొదలు 1748 వఱకు ఫ్రెంచివారికిని ఇంగ్లీషువారికిని యుద్ధమొకటిజరుగుచుండఁగా ఫ్రెంచివారు చెన్నపట్ట



ణమును ముట్టడించి 1746 లో పట్టుకొనిరి. అప్పుడు కర్ణాటరాష్ట్రమునకు నవాబుగనుండిన అన్వారుద్దీన్ దీని నిష్టపడక ఫ్రెంచివారిపై దాడిరాఁగా వాని సైన్యములకును ఫ్రెంచిసైన్యములకు నొకయుద్ధమాయెను. నవాబుసైన్యములు ఫ్రెంచిసైన్యములకంటె నెన్నియోరెట్లధికముగ నుండినను తుదకవి పరాజయము నుపొందెను. డూప్లే మిక్కిలి యుత్సాహమును పొంది ఫ్రెంచిసైన్యముల నెదిరింపఁదగిన స్వదేశరాజులాప్రాంతమున నెవ్వరులేరనిభావించి అదిమొదలు సైన్యములమూలమున విస్తారలాభము సంపాదింప తీర్మానించుకొనెను. యుద్ధకౌశలమును మంచికట్టుదిట్టములను కలిగియుండిన ఫ్రెంచిసైనికులు మనసైనికులకన్న నధికులనిచెప్పుటలో నతిశయోక్తి లేదు. డూప్లే ఇంతటితో తృప్తిపొందక మనసైనికులనుగూడ కొందఱిని తననౌకరిలో చేర్చుకొని వారిని ఫ్రెంచిసైనికులవలె తర్ఫీదుగావించి తనబలము నధికపరచుకొనఁ దొడఁగెను. సైన్యము నీవిధముగ వృద్ధిచేసికొనుటలో రాజ్యము సంపాదింపవలయుననెడి యభిప్రాయము వానికి కలుగలేదు. అప్పటి కాలమున మన దేశమందు రాజకీయవిషయములలో కలుగుచుండిన యాందోళనమునందు ఏదియోయొక పక్షమవలంబించి తనకిష్టమువచ్చినవానిని రాజుగ చేసి వానిమూలమున ఫ్రెంచివారివర్తక సంబంధములగు హక్కులవృద్ధిపరచుకొని ఫ్రెంచివారిలాభమునధికముచేయుటయే వానియుద్దేశమైయుండెను.

ఈయుద్దేశము నెరవేర్చుకొనుట కాతనికి 1748 లో సమయముదొరకెను. కృష్ణానదికిదక్షిణమందుండు దేశమునకంతకు

నాకాలమున కర్ణాటమని పేరు. ఇది దక్కను రాష్ట్రములో నొక్కభాగమై దక్కను సుబేదారుఁడగు హైదరాబాదు నిజామునకు లోఁబడియుండెను. నిజాము దీనిని స్వయముగ పరిపాలింపక యొక నవాబు స్వాధీనముచేసి వానివలన కప్పము పొందుచుండెను. 1748 లో అన్వారుద్దీన్ కర్ణాటకమునకు నవాబుగనుండెను. డూప్లే ఇతని నిష్టపడక ఇతనికి ప్రతిస్పర్థిగ నుండిన చందాసాహేబను వానిపక్షమవలంబించి 1749 లో నొక యుద్ధమందు తన సైన్యములతో నితని నోడించి చంపి చందాసాహేబును నవాబుగ చేసెను. అన్వారుద్దీన్ కుమారుఁడగు మహమ్మదాలీ పెక్కు కష్టములకులోనై తుదకు దక్షిణభాగమందున్న తిరుచునాపల్లి కోటలో చేరెను. చందాసాహేబు డూప్లే యెడల వానికిఁగల కృతజ్ఞతను చూపువాఁడై అతనికపరిమిత ధనమును ఎనుబది గ్రామములను నిచ్చెను. ఇదియే సమయమున హైదరాబాదు నిజాము కాలగతినొందఁగా వానిసింహాసనమునకై వాని పుత్రులలో కొందఱికిని వాని మనుమలలో కొందఱికిని వివాదము కలిగెను. అప్పుడు డూప్లే వారిలో నొకని పక్షమవలంబించి కొంత ఫ్రెంచి సైన్యమును వానికి సహాయముగ నంపి వానిని నిజాముగ చేసెను. అప్పుడతఁడు డూప్లేను కర్ణాటమునకంతకు తనకు ప్రతినిధిగ చేసి ఉత్తరసర్కారులను ఫ్రెంచివారికిచ్చెను. ఫ్రెంచివారి సహాయము లేక నిజాముగాని చందాసాహేబుగాని వారి యధికారమొక నిమిషము కూడ నిలుపుకొనలేనట్టి స్థితిలో నుండిరి; కావున వారు డూప్లే చేతిలోని బొమ్మలై వాని యిష్టానుసారముగ ప్రవర్తింపఁదొడఁగిరి.



ఫ్రెంచివారి స్థితి యిందీవిధముగ కలుగుచుండిన మార్పులు చెన్నపట్టణములోని ఇంగ్లీషువారికి భయమును ఆగ్రహమును కలిగించెను. వర్తకవిషయమున ఫ్రెంచివారు వారికి విరోధులై యుండిరి. చెన్నపట్టణము కర్ణాటరాష్ట్రములో చేరియుండెను. ఫ్రెంచివారి స్వాధీనమందుండిన చందాసాహేబు కర్ణాటనవాబగుటవలనను డూప్లే నిజామునకు ప్రతినిధియగుటవలనను వారి వ్యాపారమునకంతకు భంగము కలుగునట్లుండెను. ఫ్రెంచివారి సలహాలను పొంది నవాబుగాని నిజాముగాని కర్ణాటములో ఇంగ్లీషువారడుగిడఁగూడదని శాసించినచో వారి వ్యాపారమంతయు నడుగంటును గదా? ఇట్టి సందర్భమున నూరకుండుట వ్యాపారవినాశనమునకు హేతువగునని ఇంగ్లీషువారు తిరుచునాపల్లిలోనున్న మహమ్మదాలీ పక్షమవలంబించి అతనిని కర్ణాటమునకు నవాబుగ చేయ సమకట్టిరి. చందాసాహేబు ఫ్రెంచి సైన్యములతో కలిసి తిరుచునాపల్లిని ముట్టడించియుండెను; ఆకోట శత్రువశము కాకుండ రక్షించినఁగాని మహమ్మదాలీని నవాబుగ చేయుట దుస్తరముగనుండెను. అప్పుడు చెన్నపట్టణములో నొక సామాన్యపు గుమాస్తాగానుండిన క్లైవు దీనికొక యుపాయముగని పెట్టెను. “కర్ణాటకమునకు ఆర్కాటు ముఖ్యపట్టణము. చందాసాహేబు తిరుచునాపల్లిలో నుండునపుడు దానిని స్వాధీనముచేసికొనినయెడల దానిరక్షణార్థమై తిరుచునాపల్లి ముట్టడిని వదలి చందాసాహేబు ఆర్కాటునకు వచ్చును. అందువలన మహమ్మదాలీకి కలుగనుండిన

యుపాయ మదృశ్యమగును." అనియాలోచించి క్లైవు ఆర్కాటును పట్టుకొనెను. అతఁడనుకొనినట్లే చందాసాహేబు వాని ముఖ్యపట్టణము రక్షించుకొనుటకై గొప్పసైన్యము ఆర్కాటునకంపెను; కాని క్లైవు ఈసైన్యముల నోడించి ఆర్కాటు శత్రువశముగాకుండ కాపాడెను. ఇంగ్లీషువారిచట జయము సంపాదించి, క్రమక్రమముగ వారిసైన్యములను బలపరచుకొని తిరుచునాపల్లికోటవద్ద ఫ్రెంచిసైన్యములను పూర్తిగనోడించి మహమ్మదాలీని సురక్షితునిగ చేసిరి. డూప్లేప్రయత్నములన్నియు నిష్ఫలములాయెను; తర్వాత కొలఁదిదినములకే అతనిని గవర్నరుద్యోగమునుండి తొలఁగించి ఫ్రెంచివారు వాని స్థానమున మరియొకని నియమించిరి. చందాసాహేబు అప్పటికేమృతిచెందియుండెను. కావున మహమ్మదాలీ కర్ణాటమునకు నవాబాయెను. ఇంగ్లీషువారిసహాయములేక మహమ్మదాలీ నవాబగుటగాని నవాబుపదవిని నిలుపుకొనుటగాని తటస్థింపనందున కర్ణాటమందు ఇంగ్లీషువారి వ్యాపారమిది మొదలు ప్రతికూలములెట్టివియులేక జరుగఁదొడఁగెను. యుద్ధముచేయుటలో ఫ్రెంచివారికన్న ఇంగ్లీషువారలే అధికులను నభిప్రాయముకూడ దక్షిణఇండియాయందంతట వ్యాపించెను. ఈయుద్ధమువలన ఆంగ్లేయులకు రాజ్యలాభము విశేషముగ కలుగకపోయినను అట్టిలాభము సంపాదించుటకు వలయు నవకాశములన్నియు నేర్పడెను. కర్ణాటయుద్ధము ముగిసినపిమ్మట తమసైన్యముల హైదరాబాదునకంపి ఫ్రెంచివారి నచటఁగూడ నోడించి నిజామునుసహితము తమకు మిత్రునిగా చేసికొనుటకై



ఇంగ్లీషువారే క్వాటులు గావింపఁదొడఁగిరి. కాని ఇవిపూర్తియగుటకు పూర్వమే బంగాళారాష్ట్రములో వారివ్యాపారమునకనేకములగు చిక్కులు సంభవించినందున వారి సైన్యములనన్నిటి నచటికి పంపవలసినవారైరి.

హిందూదేశములోని ధనధాన్యసమృద్ధిగల రాష్ట్రములలోనెల్ల నాకాలమందు బంగాళమగ్రగణ్యమైయుండెను. భూమి సారవంతమై జలసమృద్ధిగలిగి వ్యవసాయమునకు మిక్కిలియోగ్యమైయుండెను. బట్టలునేయుటలోనగు చేతిపనులలో నసమానమగు నేర్పుగలకర్మకరు లనేకులా రాష్ట్రమందుండుటచే విదేశముల కెగుమతియగుచుండిన వస్తువులలో ననేకము లచటినుండియే ఐరోపావర్తకులుకొనుచుండిరి; గంగానది ముఖద్వారసమీపమున కలకత్తామొదలగు గొప్పరేవుపట్టణములుండినందునను సామాన్యమగు నోడలుసహితము ప్రయాణముచేయుటకు గంగానది యనుకూలించియున్నందునను ఐరోపియన్‌వర్తకులెల్లరు నచట వ్యాపారముచేసి విస్తారమగు లాభముగడించుచుండిరి. ఆరాష్ట్రముమహమ్మదీయుల పరిపాలనలోనుండినను ధనికులగు వర్తకులెల్లరు హిందువులుగనే యుండిరి. 1756 ప్రాంతమున చిన్నవయసువాఁడును క్రూరస్వభావుఁడునునగు సరాజడౌలాయనువాఁడు బంగాళమునకునవాబాయెను. పన్నులనధికముచేసి వానిపూర్వులుగూడకొందఱుహిందూవర్తకులను బాధించుచుండిరికాని ఇతనికాలములో నాబాధ వృద్ధిచెందెను. ఇట్లుండఁగా ఐరోపియన్ వర్తకులయెడఁగూడ నితనికి ద్వేషబుద్ధిపుట్టెను. కర్ణాటమందు వీరు రాజకీయ విషయము

లలో జోక్యము కలుగచేసికొని నవాబుల సింహాసనాధిష్ఠితులుగను సింహాసనభ్రష్టులుగను చేయుచు యుద్ధములదారుణత్వమును బలపరచుచుండుట చూచినవాఁడై బంగాళములోఁగూడ వీరిట్లే ప్రవర్తించి తనయధికారమునకుభంగముకలిగింతురేమోయనిఅతఁడనుమానించి వారికోటలనునిర్మూలము చేయ సమకట్టెను. 1756 లో ఫ్రెంచివారికిని ఇంగ్లీషువారికిని యుద్ధము సంభవింపనుండఁగా కలకత్తాలోని ఇంగ్లీషువారు వారికోటను బాగుచేసికొనుచుండిరి. సరాజఉద్దౌలా దీనినెంతమాత్రమిష్టపడక కోటలను బలపరుపఁగూడదని యాజ్ఞాపించెను; ఇంగ్లీషువారీయుత్తరువును మన్నింపకపోయిరి. అప్పుడునవాబుకుపితుఁడై బంగాళములోని ఇంగ్లీషువారివర్తకశాలలను తన స్వాధీనము చేసికొని కలకత్తా పట్టణమునుగూడ పట్టుకొనెను. ఇందుచే బంగాళాయందలి ఆంగ్లేయులవర్తకమంతయు మూలసహితముగ వినాశమొందునట్లాయెను.

ఈవార్త కొద్దిరోజులకు చెన్నపట్టణపు దొరతనము వారికి తెలిసెను. ఆదివఱకు సెలవుపైని ఇంగ్లండునకు వెళ్లియుండిన క్లైవు మరికొంతసైన్యమును తీసికొని అప్పటికి చెన్నపట్టణము చేరియుండెను. బంగాళములోని దుస్థితి తెలియఁగనే అదివఱకు సైన్యములనన్నిటిని హైదరాబాదుపైకి పంపనేర్పాటులు జరిగియుండినను కలకత్తాపట్టణమునుపట్టుకొని బంగాళములోనివర్తకమును పునరుద్ధారణము చేయుటలో కాలవిలంబముకాఁగూడదనియెంచి చెన్నపట్టణపు దొరతనపువారు సర్వసైన్యమునకు క్లైవు నధిపతిగచేసి బంగాళమునకతనినంపిరి. క్లైవుసునా



యాసముగ బంగాళమును ప్రవేశించి నవాబు సైన్యముల నోడించి కలకత్తాను స్వాధీనము చేసికొనెను. అప్పుడు తక్కిన వర్తకశాలల నిచ్చివేయుటకును తనవలన నదివఱకు ఇంగ్లీషువారి వ్యాపారమునకు సంభవించిన నష్టమును పూరించుటకును నవాబంగీకరించెను; కాని ఇంగ్లీషు వారిపై కుట్రలు పన్నుటమాత్రమతఁడు మానివేయనందున క్లైవునకతనిపై ననుమానమధికమగుచుండెను. అట్టిసమయమున నతనిచే బాధింపఁబడిన హిందూవర్తకులును అతనియుద్యోగమం దుండినను వానిదౌర్జన్య మిష్టపడని ప్రముఖులు కొందఱును వానిని రాజ్యచ్యుతునికావింప రహస్యముగ ప్రయత్నములు గావించుచుండఁగా క్లైవు వారితోనేకీభవించి వానినిరాజ్యభ్రష్టునిచేసి వానిస్థానమున సేనానియగు మీర్జాఫరును నవాబుగచేయుట కంగీకరించెను. తర్వాత క్లైవు తనసైన్యములనెల్ల చేర్చుకొని సరాజఉద్దౌలాను ప్లాసీవద్దనెదుర్కొని కడుసులభముగ నతనినోడించెను. మరునాఁడు మీర్జాఫరు బంగాళమునకు నవాబాయెను. తాను నవాబగుటకు ఇంగ్లీషుసైనికులే ప్రధానకారణమగుటచేత కృతజ్ఞతాసూచకముగ నతఁడు తూర్పిండియాసంఘమువారికి కలకత్తాసమీపమందున్న "ఇరువదినాలుగుపరగణా"లను జిల్లానిచ్చెను.

కాని నిజముగ నాలోచించిన యెడల ప్లాసియుద్ధమువలన బంగాళాయంతయు ఇంగ్లీషువారి స్వాధీనమయ్యెనని చెప్పక తప్పదు. మీర్జాఫరును నవాబుగచేసినవారు ఇంగ్లీషువారు.

వారి సైన్యముల సహాయము లేనియెడల నొకదినముగూడ నతఁడధికారము చెల్లించుట దుస్సాధ్యముగనుండెను. వారికనుకూలముగ ప్రవర్తించునంత కాలమే వారువానిని నవాబుగ నుంచెదరుగాని ప్రతికూలుఁడైనచో వానితప్పించి మరియొకని నవాబుగ చేయసమర్థులై యుండిరి. కావున పేరునకు మీర్జాఫరు నవాబుగాని నిజముగ నధికారమంతయు ఇంగ్లీషువారియధీనమందుండెను. బంగాళమిట్లు వశమగుటచే మనదేశములోని తక్కినరాష్ట్రముల జయించుట వారికిమిక్కిలిసులభమాయెను. బంగాళమందుండి వారికిలభించుచుండిన ఆదాయమమితముగనుండెను. అందుచేవారు సైన్యముల వృద్ధిపరచుకొని సమయమువచ్చినపుడు వారిశత్రువుల నణఁచుకొనుటకవకాశముకలిగియుండిరి. ఈకారణముల చేతనే ఆంగ్లేయసామ్రాజ్యము మనదేశమందు వ్యాపించుటకు ప్లాసీయుద్ధము మూలమని చెప్పఁదగియున్నది.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## తొమ్మిదవ ప్రకరణము.

ఆంగ్లేయులు వారిసామ్రాజ్యమును విస్తరింపఁజేసికొనుటలో నొక్కొకశతాబ్దమం దొకరితో యుద్ధము చేయవలసియుండిరి. పదునారవ శతాబ్దమందు వారి నెదిరించినవారు స్పెయిన్‌రాజులు. పదునేడవశతాబ్దమందన్నో డచ్చివారువారి ప్రయత్నములకెల్ల విఘాతము గలిగించుచుండిరి. కాని 1680 నాఁటికి వీరినోడించి ఆంగ్లేయులచ్చటచట వారియాధిక్యతను స్థాపించుకొనఁగలిగిరి. అదిమొదలు సుమారు నూటయిరువది సంవత్సరముల వఱకు వారినెదుర్కొనిన వారు ఫ్రెంచివారై యుండిరి; తుదకు 1815 నాఁటికి వీరినిగూడ పరాజితులనుకావించి స్వసామ్రాజ్యమును ప్రపంచమందన్ని ఖండములలో వ్యాపించునట్లు చేసికొనిరి. అదియెట్లుజరిగెనో మనమిప్పుడు తెలిసికొనవలసియున్నది.

1680 నాఁటికనేకవిషయములందు ఐరోపాఖండవాసులందఱిలో ఫ్రెంచివారు మిగులఘనతనుచెంది, అంతఃకలహములమాని ఐకమత్యముగలిగి దేశభక్తిపూరితులైయుండిరి. అప్పటికే వారనేకపర్యాయములు జర్మనులను స్పెయిన్‌వారిని నోడించి వారిరాష్ట్రముల కొన్నిటిని వశపఱచుకొని తమరాజ్య

ము నగ్రగణ్యముగ చేసికొనిరి. ఆకాలమందు ఫ్రాన్సు దేశమును పరిపాలించుచుండిన లూయీ ప్రభువమితమగు శక్తిసామర్థ్యములు గలవాఁడై స్వాధికారమును ఐరోపాలో నితరదేశములన్నిటిపై స్థాపించి ఖండమునంతను తనవశమందుంచుకొనవలయునను పేరాశకుపాత్రుఁడై అద్వితీయములగు సైన్యములను కూర్చుకొని యుద్ధసన్నాహము చేయుచుండెను. యుద్ధములందారితేరిన సైన్యాధిపతులును నీతికోవిదులగు మంత్రులును వానికి సహాయులై వాని యాజ్ఞల నెంతయో యుత్సాహముతో శిరసావహించుచుండిరి. లూయీ రాజ్యమునకు వచ్చినప్పటికి ఫ్రాన్సు దేశమున విస్తారమగు సైన్యము మాత్రమే యుండెనుగాని అతఁడు మాత్రము దానితో తృప్తినొందక యుద్ధనౌకలనేకముల తయారుచేయించి అమెరికా ఖండమందలి ఫ్రెంచి కాలనీల వృద్ధి గావించుటకును ప్రాగ్దేశములతోడి ఫ్రెంచివ్యాపారమును బలపరచుటకును పూనుకొనెను.

దీనినంతను చూచి ఇంగ్లీషువారు సహజభీతిని పొందిరి. లూయీయొక్క యుద్యమములు కొనసాగిన యెడల వారదివఱకు కష్టపడి సంపాదించిన కాలనీలును తూర్పుదేశములతో వారు చేయుచున్న వ్యాపారమును వారివశమందు నిలువక ఫ్రెంచివారిస్వాధీనమగునని వారుద్దేశపడసాగిరి. కావున నిట్టి ప్రయత్నముల భంగపరచుటకై లూయీతో యుద్ధమునకు పూనుట ఇంగ్లీషువారికి విధియాయెను.

ఇంతియుగాక వారూరకుండినయెడల వారిస్వాతంత్రతకుఁ గూడ నపాయము కలుగునేమోయని సంశయించుటకు వాని



చర్యల నవకాశము కలుగఁజేసెను. 1688 లో వారదివఱకు ప్రభువుగనుండిన రెండవ జేమ్సును సింహాసనమునుండి తొలఁగించి వారికనురక్తుఁడైనట్టియు అప్పుడు హాలెండునకు ప్రభువుగనుండినట్టియు మూఁడవవిలియమును తమదేశమునకు రాజుగ చేసికొనిరి. అదివఱకే లూయీకిని విలియమునకును బద్ధవైరమున్నందున విలియమింగ్లండునకు రాజగుటనుచూచి లూయీ అసూయాపరుఁడై రెండవ జేమ్సును మరల ఇంగ్లండునకు ప్రభువును కావింపసమకట్టి ఇంగ్లీషువారి ననేకవిధములుగ బెదరింపసాగెను. ఇంతటితో నిలువక హాలెండు బెల్జియం దేశముల స్వాధీనపరచుకొనుటకును ఐర్లెండును ఇంగ్లీషుపరిపాలననుండి వేరుపరచుటకును నతఁడు వ్యూహములనెన్నిటినో పన్నుచుండెను. హాలెండు బెల్జియం దేశములతీరమందు వ్యాపారమున కనుకూలించు రేవుపట్టణములనేకములుకలవు. అవిస్వాధీనమైనయెడల ఇంగ్లండుపై దండెత్తివచ్చుట సులభసాధ్యమగును. కావున నీదేశముల జయించుట కెవరుప్రయత్నించినను వారిప్రయత్నములకు విఘ్నముగలిగించుట అనాదిగా ఇంగ్లీషువారికి సహజధర్మముగనుండెను. ఇన్నిసందర్భములుండుటఁబట్టి 1688 మొదలు1815 వఱకు ఇంగ్లీషువారు ఫ్రెంచివారితో యుద్ధములను చేయవలసివచ్చెను.

ఈయుద్ధములలో మొదటిది1689 మొదలు 1697 వఱకుజరిగెను. ఇందువలన ఇంగ్లీషువారిసామ్రాజ్య మభివృద్ధిగాంచక పోయినను లూయీకిమాత్రము విశేషనష్టము సంభవించెను. అయినప్పటికిని లూయీవాని తొలియుద్దేశముల మరచిన

వాఁడుకాఁడు. 1700లో నపుత్రకుఁడగు స్పెయిన్ దేశపు రాజు చచ్చుటకు సిద్ధమైయుండఁగా వానియనంతరము తనమనుమని స్పెయిన్‌కు ప్రభువుగ చేసి ఫ్రెంచివారి యధికారమును స్పెయిన్ దేశముమీఁదను అమెరికాలోని స్పెయిన్ వారి కాలనీలందును స్థాపింపవలయునని (లూయీ) పట్టుపట్టెను. ఇది యేఁగొనసాగినయెడల అమెరికాఖండమంతయు ఫ్రెంచివారిస్వాధీనమై అందులోని ఇంగ్లీషుకాలనీల కపాయము గలుగుననియు ఐరోపాలోని హాలెండు మొదలగు దేశముల స్వాతంత్ర్యమునకు నష్టముసంభవించుననియు ఇంగ్లీషువారు యుద్ధమునకు పూనిరి. హాలెండు ఆస్ట్రియా ప్రష్యాలోనగు దేశములవారందఱు యుద్ధమున వీరిలోకలిసిరి. యుద్ధము 1700 మొదలు 1713 వఱకు పదుమూఁడుసంవత్సరముల పర్యంతము జరిగెను. ఇందులో ఆంగ్లేయసేనాధిపతియగు మార్లబరో చూపిననేర్పును పన్నిన వ్యూహములును మిక్కిలి యద్భుతముగనుండెను. ఇందుచే లూయీయొక్క సైన్యములన్నియు తుదకపజయమొంది నలుదెసల పారిపోవలసివచ్చెను. 1713 లో యుద్ధానంతరము ఫ్రెంచివారు ఇంగ్లీషువారితో సమాధానముచేసికొని అమెరికాలోని హడ్సన్ బే అకేడియా న్యూఫౌండ్లాండు కాలనీలను ఐరోపాలోని జిబ్రాల్టరు మైనార్కా అను ప్రదేశములను వారికిచ్చివేసిరి. అట్లాంటిక్ మహాసముద్రము మెడిటరేనియన్ సముద్రముతో కలియుచోట జిబ్రాల్టరుండుటవలన నప్పటినుండి మెడిటరేనియన్ సముద్రముమీఁద ఇంగ్లీషువారి యధికారము స్థాపించుట కవకాశ మేర్పడెను.



అమెరికాలోని ఆంగ్లేయులసామ్రాజ్యము మరికొంతయభివృద్ధిఁగాంచెను; నౌకాయుద్ధమందును నౌకాబలాధిక్యమునందును ఇంగ్లీషువారితో సమానులెవ్వరు లేరనికూడ నీయుద్ధమందు బయల్పడెను.

ఇట్లు కొన్నిసంవత్సరములు గడచినతర్వాత ఆంగ్లేయసామ్రాజ్య ముత్తరఅమెరికాయందంతట వ్యాపించుటకు తగినతరుణముసమీపించెను. ఇందుకు ఫ్రెంచివారిదురాశయే ప్రధానహేతువు. అమెరికాయందు కాలనీలను సంపాదించుటకు ఇంగ్లీషువారు ప్రయత్నించినప్పుడే ఫ్రెంచివారుకూడ నట్టిప్రయత్నములను కొన్నిటినిగావించి తుదకు „కనడా”,యను కాలనీనిస్థాపించుకొనిరి. అదిక్రమక్రమముగనభివృద్ధియై అనేకవిషయములందు ఇంగ్లీషుకాలనీలతో సమానముగనుండెను. వ్యాపారమును వృద్ధిపరచుకొనుటయందును, అమెరికాలోని ఇండియన్లను క్రైస్తవులను కావించుటయందును కనడాలోని ఫ్రెంచివారికధికమగు నుత్సాహముండిన కారణముచే వారిలోననేకులుఅమెరికాఖండముయొక్క స్థితిగతులనుచక్కఁగ తెలిసికొనవలయునను నుద్దేశముతో కనడాకు దక్షిణదిక్కునందున్న సరస్సులగుండా మిసిసిపీ నదీప్రాంతములందుప్రవేశించి కొంతదూరమానదిమీఁదుగ ప్రయాణముచేసి తుదకు దాని ముఖద్వారమును చేరఁగలిగిరి. మిసిసిపీనది ప్రపంచములోని గొప్పనదులలోనెల్ల నొక్కటియైయున్నది. దానికిరుప్రక్కలందు సారవంతములగు భూములును విశాలములగు నడవిప్రదేశములు నుండుటవలన నదిప్రవహించుభాగమునంత తమస్వాధీ

నము చేసికొన నెంచి దానిముఖద్వారమున "న్యూఆర్లియన్స్" అను పట్టణముగట్టి అందుకొండలు కాపురము చేయసాగిరి. తర్వాత దీనిసమీపమందున్న భూభాగమునంతే నాక్రమించుకొని దానికి "లూయీసియానా" అను పేరు పెట్టిరి. "లూయీసియానా" ఉత్తరఅమెరికా దక్షిణభాగమందును, "కనడా" దానియుత్తరభాగమందు నుండుటచే నీరెంటికిని సంబంధము చెడకుండ చేయుటకై మధ్యభాగమం దచ్చటచ్చట కోటలను గూడకట్టి వీనిసహాయమున మరియెవరిని నాప్రాంతమునకు రానీక యడ్డగించుచుండిరి.

ఇదియంతయు ఇంగ్లీషుకాలనీల కపాయకరముగనుండెను. ఉత్తరఅమెరికాఖండపు తూర్పుతీరమందు ఇంగ్లీషువారికి పదుమూడుకాలనీలుండినవని చదువరులకిదివఱకే తెలిసియున్నది. వీనికిపశ్చిమదిక్కున అలెఘనీపర్వతములకును ఓహియోనదికిని ఆవలనున్న ప్రదేశమునంతను క్రమక్రమముగ వశపరచుకొనికొంతకాలమునకు ఆంగ్లేయసామ్రాజ్యమునుత్తరఅమెరికాలోని మధ్యభాగమందంతట వ్యాపింపచేయవలయుననెడి కుతూహల మీకాలనీలలో ననేకులకుండెను. కాని ఫ్రెంచివారుగావించుచున్న యుద్యమములుఇంగ్లీషువారి కాశాభంగము గలుగచేయునవిగ పరిణమింపఁదొడఁగెను. ఏప్రదేశమును ఇంగ్లీషువారాక్రమించుకొన నుద్దేశించియుండిరో దానినంతను "లూయీసియానా" అను పేరుతో ఫ్రెంచివారు స్వాధీనము చేసికొనిరి. దీనివలన అట్లాంటిక్ సముద్రమునకును ఓహియోనది అలెఘనీపర్వతములకును మధ్యనున్న స్వల్పభాగము



మాత్రము ఇంగ్లీషువారియనుభవములో నుండుటయు తక్కిన భాగమంత ఫ్రెంచివారస్వాధీనమగుటయు సంభవించెను. ఇదిగాక ఓహియోనదీతీరమున ఫ్రెంచివారు కట్టినకోటల వలన ఇంగ్లీషువారు పడమటిభాగమం దడుగిడుటకూడ దుస్సాధ్యమాయెను. మరియొకకష్టముగూడ ఫ్రెంచివారివలన వీరికి కలుగుచుండెను. స్వదేశస్థులగు ఇండియన్లతో నెల్లప్పుడు ఫ్రెంచివారు చెలిమిగలిగి వారిని ఆంగ్లేయులపై కలహింప ప్రేరేపించుట వారికభ్యాసమైయుండెను; ఇంగ్లీషుకాలనీలకు పశ్చిమమందున్న ప్రదేశమంతయు ఫ్రెంచివారి స్వాధీనమగుటచే ఇండియన్లవలని బాధకూడ నతిశయింపఁదొడఁగెను. ఇట్టిసందర్భములో ఇంగ్లీషుకాలనీలలోనివారికిని కనడాయందలి ఫ్రెంచివారికిని యుద్ధము తప్పదాయెను.

ఈయుద్ధము 1753లో ప్రారంభమయ్యెను. పడమటిదిక్కుగ పోనీక యడ్డగించుచున్న ఓహియోనదీప్రాంతమందలి కోటల నుపట్టుకొనవలెనని ఇంగ్లీషుకాలనీలవారు ప్రయత్నముల నేకములు గావించిరి; కాని వానివలన ఫలము చేకూరదాయెను. దీనినిచూచి 1755 లో ఇంగ్లీషుప్రభుత్వమువారు ఇంగ్లండు నుండి కాలనీలసహాయార్థమై యొకసైన్యమంపిరి. అదియుఁగూడ ఫ్రెంచివారిచే పూర్తిగనోడింపఁబడెను. 1756 నాటికి ఐరోపాయందుఁగూడ ఇంగ్లీషువారికిని ఫ్రెంచివారికిని సంగ్రామమారంభమై "సప్తసంవత్సరయుద్ధ"మను పేరుతో 1763వఱకు జరిగెను. ఇది అమెరికా ఇండియా ఆఫ్రికాలోనగు ఖండములందుఁగూడ వ్యాపించెను. ఫ్రెంచిరాష్ట్రములుగాని ఇంగ్లీషు

రాష్ట్రములుగాని ప్రపంచమందేయే ప్రదేశములందుండెనో వానిలోనికెల్ల నిరుపక్షములవారిసేనయు నౌకాబలమును వెళ్లి కడుతీవ్రముగ పోరఁజొచ్చెను. రూఢాగ్రేసరులలో నొకఁడని ప్రఖ్యాతివహించిన ప్రష్యాదేశపురాజగు ఫ్రెడరిక్ ఇంగ్లీషువారిసహాయమునకువచ్చి ఐరోపాఖండమందు ఫ్రెంచి సైన్యముల నెదుర్కొనెను. కాని యుద్ధమారంభించినతర్వాత రెండుసంవత్సరములవఱకు ఇంగ్లీషు వారిసైన్యములకు అమెరికాలో జయముకలుగలేదు. ఫ్రెంచివారికోటలను పట్టుకొనుట కెన్నిపర్యాయములు ప్రయత్నించినను లాభము లేకుండెను. మెడిటరేనియన్ సముద్రమందుజరిగిన యొకనౌకాయుద్ధములో ఇంగ్లీషువారు పరాజితులై 1713 న వారికి లభించిన "మైనార్కా" ద్వీపమును కోల్పోయిరి. ఇంతేగాక కనడాను ఇంగ్లీషు కాలనీలను మధ్యను ఇంగ్లీషువారు కట్టుకొనియుండిన దుర్గములుగూడ శత్రువశమాయెను.

ఇట్టిసమయములో ఆంగ్లేయసామ్రాజ్యముద్ధరించుట కవతరించిన వాఁడనఁదగిన "పిట్" మహాశయుఁడు ఇంగ్లండునకు 1758 లో యుద్ధమంత్రియాయెను. అతని దేశభక్తియు, ఉత్సాహమును పరులనాకర్షించుశక్తియు మంత్రశక్తియు వర్ణనాతీతములు. మిసిసిపీ ఓహియోనదులమధ్యనుండిన ప్రదేశమందుండియే గాక ప్రపంచమందితర భాగములలో ఫ్రెంచివారి స్వాధీనమందుండిన రాష్ట్రములందుండి సహితము వారినితొలఁగించిఆంగ్లేయసామ్రాజ్యమునలుదిక్కులవ్యాపింపఁజేయ నతఁడుసంకల్పించెను. ఈయుద్దేశము నెరవేరుటకై



ఫ్రెడరిక్కునకు ద్రవ్యసహాయ మమితముగ నొసంగి వానిసైన్యములసంఖ్యను వృద్ధిచేసి వానిమూలమున ఫ్రెంచిప్రభుత్వమువారు కనడాసంరక్షణార్థమై సైన్యములను పంపుటకు వీలులేనట్లు కావించెను. అసమర్థులగు ఆంగ్లేయసేనాధిపతులనెల్ల నుద్యోగమునుండి తొలఁగించి యుద్ధకౌశలులును నేర్పరులును ఉత్సాహపూరితులును యౌవనమందుండుటచే పటుత్వముగలవారును నగుయోధులను సేనానులుగచేసి అమెరికాఖండమునకంపెను. యుద్ధనౌకలను ఫ్రాన్సులోని రేవుపట్టణముల ముఖద్వారమందును అచ్చటచట అట్లాంటిక్ మహాసముద్రమందును నిలిపి అమెరికాకుఁగాని తక్కిన ఫ్రెంచిరాష్ట్రములకుఁగాని ఫ్రాన్సునందుండి సైన్యములురానీక యరికట్టెను. జయముసమకూరుట కొనర్పవలసిన యేర్పాటులన్నిటిని కాలవిలంబము కలుగకుండునట్లు కావించెను. కావున 1758 మొదలన్ని ప్రదేశములందును ఆంగ్లేయులకు జయములభింపఁదొడఁగెను. వారిసైన్యములవడ్డగించుచున్న ఓహియోనదీప్రాంతమందున్నట్టియు కనడాపొలిమేర యందున్నట్టియు కోటలొకటితర్వాతనొకటి 1758,1759లో వారివశమాయెను. ఫ్రెంచిసైన్యము లమితనష్టమొంది, లూయిసియానా కాలనీనిపూర్తిగవదలి కనడానుసంరక్షించుకొనవలసివచ్చెను. 1759న ఇంగ్లీషువారు కనడాపైకిఁగూడ వారిసైన్యములనంపిరి. ఆకాలనికి "క్వెబెక్" ముఖ్యపట్టణము. దానిని స్వాధీనముచేసికొనినయెడల ఫ్రెంచివారియధికారమంతరించిపోవుటలో సందేహమించుకగూడ లేదు. క్వెబెక్ దుర్గము సెంట్ లారెన్సునది కావల కొండలమధ్య

నుండుటచేతను కొండతోవలన్నియు మిక్కిలి యిరుకుగనుం
డుటచేతను దానిని పట్టుకొనుటకు మిగుల నేర్పుగల సేనాధిపతి
యుండవలయుననియెంచి "వుల్ఫు"అనువాని నాపనికై, పిట్
నియోగించెను. "వుల్ఫు"నకప్పటికి ముప్పదిమూడుసంవత్సర
ముల వయస్సైనను బాల్యమందుండి యుద్ధములలో నారి తే
రినవాఁడగుటచే నీపనినిసాధించుటకు తగియుండెను. ఇతఁడు
గావించిన ప్రథమప్రయత్నములు రెండును విఫలములైనను
నిరుత్సాహమును పొందక పట్టుదలతో మరియొకమా రాదుర్గ
ముపైఁబడి ఫ్రెంచిసైన్యములతో యుద్ధముచేసివానిని సంపూ
ర్ణముగనోడించెను. కాని విధివశముచే యుద్ధాంతమందతనికి
గుండుదెబ్బయొకటితగిలి మృత్యువువాతనతనిపడఁద్రోసెను.
తర్వాత కొద్దిదినముల కాతనిజయప్రభావమువలన క్వెబెక్ప
ట్టణము ఇంగ్లీషువారి స్వాధీనమాయెను. 1760 లో కనడా
లోని తక్కిన పట్టణములనుగూడ ఇంగ్లీషువారు పట్టుకొనఁగలి
గిరి; ఇందుచే నాకాలనీయంతయు వారికివశమాయెను.

సప్తసంవత్సరయుద్ధ మారంభమైనప్పటినుండి మన దేశము
లో నప్పటికి ఇంగ్లీషువారి స్వాధీనమందున్న చెన్నపట్టణము
లోనగు ప్రదేశములను పట్టుకొనఁదలఁచి ఫ్రెంచిప్రభుత్వము
వారు సైన్యమును నౌకాబలమును ఫ్రాన్సు దేశమున తయా
రుచేయసాగిరి. ఆలస్యముచేయక 1756 నందే వారీసైన్య
ముల నిండియాకు పంపియుండినయెడల వారియుద్యమములు
జయప్రదములైయుండి యుండును. 1756 లో సరాజడౌలా
ఇంగ్లీషువారిని బంగాళమందుండి తొలఁగింప ప్రయత్నించు



చుండెను; అందుచే వారిసైన్యములన్నియు బంగాళమందుం
డవలసివచ్చెను. అట్టిసమయమున చెన్నపట్టణపు తీరమునకు
ఫ్రెంచిసైన్యములు వచ్చియుండినయెడల వానినెదుర్కొనుట
ఇంగ్లీషువారికి దుస్తరమైయుండియుండును. కాని ఆంగ్లేయుల
యదృష్టవశమున నిట్టిదేదియు జరుగలేదు. 1757 లోఁగూడ
ఫ్రెంచివారిసైన్యములు ఇండియాను చేరలేదు. అప్పటికి ఆం
గ్లేయుల స్థితిగతులు పూర్తిగమారెను. వారికి హితుఁడగు
మీర్జాఫరు బంగాళమునకు నవాబగుటయు, యుద్ధమునకుకా
వలసినద్రవ్యమంతయు నారాష్ట్రమందుండి సులభముగలభిం
చుటయు ఆంగ్లేయులజయమునకు మూలకారణములాయెను.

1758 లో మన దేశమునకు వచ్చిన ఫ్రెంచి సైన్యములకు
"లాలీ"యనువాఁడధిపతిగనుండెను. అతఁడు తక్షణమే ఇంగ్లీ
షువారి సెంటుడేవిడ్కోటను ముట్టడించి పట్టుకొనెను. తర్వా
త సైన్యములనన్నిటిని తీసికొని చెన్నపట్టణపుకోటను ముట్టడిం
చెను; కాని ఖర్చులకు కావలసినంతటి ద్రవ్యమితనివద్ద లేక
పోవుటచేతను, అతనికినితక్కిన ఫ్రెంచిసేనానులకు నైకమత్యము
చాలకపోవుటచేతను, చెన్నపట్టణము వానివశముగాకయుండెను.
ఇట్టిసమయములో ఇంగ్లీషువారియుద్ధనౌకలుకొన్ని చెన్నపట్ట
ణపు రేవునుచేరి ఫ్రెంచివారిపైఁబడఁగా లాలీ మరికార్యములేద
ని తీర్మానించి పుదుచ్చేరికి పారిపోయెను. లాలీ దక్షిణఇండి
యాకు వచ్చుటనువిని క్లైవు బంగాళమందుండి తనసైన్యము
లో కొంతభాగమునువిడదీసి, అప్పటిఫ్రెంచివారి యధీనమం
దుండిన "ఉత్తరసర్కారులను" పట్టుకొనుటకంపెను. 1759లో

సీసైన్యములు ఫ్రెంచివారిని పూర్తిగనోడించి ఉత్తరసర్కారులందుండి వారినితఱిమివేయఁగలిగెను. అదివఱకు ఫ్రెంచివారి సహాయమపేక్షించియుండిన హైదరాబాదు నిజాం వారియుపజయములనుకాంచి, ఇంగ్లీషువారితో సమాధానము గావించుకొని మచిలీపట్టణమును వానిసమీపమందుండిన ప్రదేశమును వారికిచ్చెను. ఇదిమొదలుత్తరసర్కారులలో ఇంగ్లీషువారి ప్రభుత్వమారంభమాయెను. 1760 లో లాలీ పుదుచ్చేరినివదలి వండివాసనువోట మరియొకయుద్ధముచేసి దానియందుఁగూడ పరాజితుఁడుకాఁగా ఇంగ్లీషువారు పుదుచ్చేరిని ముట్టడించిరి. ఇదియుఁగూడ 1761 లో వీరిస్వాధీనమాయెను. అంతటితో మన దేశమందుజరుగుచుండిన యుద్ధముముగిసెను.

ఇట్లు 1756 మొదలు 1763 వఱకు జరిగిన సప్తసంవత్సర యుద్ధములో నన్నిఖండములందు ఆంగ్లేయులకు జయములభించెను. ఇందువలన (1) కనడా (2) మిసిసిపీనదికి తూర్పుగనుండిన దేశము (3) పశ్చిమఇండియాద్వీపములు కొన్నియును ఆంగ్లేయులకులభించెను. ఉత్తరఆమెరికాఖండమందు ఫ్రెంచిసామ్రాజ్యముండవలయునా? లేకఇంగ్లీషువారిసామ్రాజ్యముండవలయునా? అనువివాదమీయుద్ధమువలన పరిష్కరింపఁబడెను. ఇదేవిధముగ మనదేశమందుఁగూడ ఫ్రెంచి సామ్రాజ్యము వ్యాపించుటకవకాశము లేదనువిషయ మీయుద్ధముతో స్థిరపడెను. పుదుచ్చేరిలోనగు వర్తకశాలలు యుద్ధానంతరము ఫ్రెంచివారికిచ్చివేయఁబడినను వీనిని వ్యాపారముకొఱకు మాత్రమే యుపయోగింపవలెననియు వీనిలోకోటలుగట్టి సైన్య



ములను చేర్పఁగూడదనియు లోనగునిబంధనలకు వీరంగీకరించిన కారణమున నిదిమొదలు వీరివలన ఇంగ్లీషువారి కెట్టిభయము లేకపోయెను. ఈయుద్ధములో ఆంగ్లేయుల నౌకాబలముగాంచిన విజయములవలనను వారిశత్రువులనౌకలకు కలిగిననష్టమువలనను ఆంగ్లేయులనౌకాబలపుటాధిక్యముసుస్థిరముగ ప్రపంచమందంతట నాటుకొనెను. ఇన్నిఫలముల నొసంగిన "సప్తసంవత్సరయుద్ధము" ఇంగ్లీషువారి సామ్రాజ్యచరిత్రలో మిక్కిలి వన్నెగాంచియుండుటయం దాశ్చర్యమేమియున్నది?

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము.

## పదియవ ప్రకరణము.

సామ్రాజ్యసంపాదనార్థమై ఇంగ్లీషువారు పైవిధముగ ఫ్రెంచివారితో యుద్ధముచేసి విజయముగాంచిన యిరువది సంవత్సరములకే అమెరికాలోని పదుమూఁడుకాలనీలును 1763 లో ఫ్రెంచివారిచ్చిన మిసిసిపీనదీ ప్రాంతదేశమును వారుకోల్పోయిరి. ఇంతటినష్టము వారికెట్లుసంభవించెనో మనమిప్పుడు తెలిసికొనవలయును.

మాతృదేశముయొక్క ఐశ్వర్యమభివృద్ధి యగుటయందు తోడ్పడుటయే కాలనీలవలని ప్రయోజనమనియు అట్టిప్రయోజనమును పొందుటకువలయు చట్టములను మాతృదేశప్రభుత్వమువారుచేసి కాలనీలయందమలులో నుంచవచ్చుననియు నాకాలమందు ఇంగ్లండులోనివారలేగాక కాలనీలుగలిగియుండిన తక్కిన దేశములవారుకూడ నభిప్రాయపడియుండిరి. దీనిననుసరించి ఇంగ్లండులో నుత్పత్తిగానట్టియు ఇంగ్లీషువారికవసరమైనట్టియు నీలిమందు, కాఫీ, పొగాకు, తారు, నార, లోనగువస్తువులను కాలనీలలోనివారుత్పత్తి చేయవలసినదనియు అట్లుచేయువారికి ప్రభుత్వమువారు ధనసహాయమొనరురనియు



ఇంగ్లీషుపార్లమెంటు వారనేకశాసనములు గావించి యుండిరి. ఇదిగాక ఇంగ్లండులోని కార్మికులుతయారుచేయుచుండిన టోపీలు బట్టలు ఇనుపసామానులులోనగువానిని కాలనీలవారుత్పత్తిచేసి విదేశములకెగుమతి చేయఁగూడదనియు అట్లుచేసినయెడల ఇంగ్లండులోని చేతిపనులకు నష్టముసంభవించుననియు నుద్దేశపడి తదనుగుణముగ మరికొన్నిచట్టముల వారునిర్మించియుండిరి; వీనివలన ఇంగ్లండులోని చేతిపనులున్నతస్థితియందుండుటయేగాక నచటతయారైన సామానులన్నియు కాలనీలలోఖర్చగుటకవకాశముకలిగెను. కానిటోపీలుతయారుచేయుటకువలయుబొచ్చు, బట్టలునేయుటకువలయు ఉన్ని, ఇనుపసామానులనుచేయుటకు వలయుఇనుము కాలనీలలోదొరుకుచుండినపుడు వీనినితయారుచేయఁగూడదని శాసించుటన్యాయముకాదని కాలనీలవారు వాదింపసాగిరి. ఇట్లేవిదేశవ్యాపారవిషయమునఁగూడ నిర్బంధములుకొన్నిటిని ఇంగ్లీషుప్రభుత్వము వారు విధించియుండిరి. ఇంగ్లండు ద్వీపమగుటచేతను ఇంగ్లీషుసామ్రాజ్యములో చేరినరాష్ట్రములన్నియు సముద్రములకావలనుండుటచేతను అధికమగునౌకాబలము లేనియెడల శత్రుబాధనుండి వీనినిరక్షించుట దుస్తరమగునుకావున నౌకాబలము నభివృద్ధిచేయుటకై ప్రథమమునుండి ప్రభుత్వమువారు కొన్నిచట్టములనుచేసిరి. కాలనీలసంబంధించిన ఎగుమతి దిగుమతివ్యాపారమంతయు ఇంగ్లండులోఁగాని కాలనీలలోఁగాని తయారుగావింపఁబడినట్టియు ఇంగ్లీషువారుగాని కాలనీలలోనివారుగాని నడుపునట్టియు ఓడలలోజరుగవలయునేగాని విదేశ

స్థులయోడల నిందులకై యుపయోగింపఁగూడదను శాసన మొకటియుండెను. ఇందువలన ఇంగ్లీషుయోడలసంఖ్య వృద్ధి యయ్యెనుగాని కాలనీలకుమాత్రము కొంచెమునష్టము తప్ప దాయెను. ఫ్రెంచివర్తకులెవరైననుప్రాగ్దేశముల యందుండు ఫ్రెంచియోడలలో సరుకులను తెచ్చి చౌకగ కాలనీలవారి కమ్మఁగలిగినను వానినికొనుటకు వీరికిహక్కు లేకుండెను. ఇట్లే కాలనీలలో నుత్పత్తియగు నీలిమందు, పొగాకు, ప్రత్తి, బియ్యములోనగువానిని ఇంగ్లీషువర్తకులకేగాని తక్కినవిదేశ వర్తకులకు విక్రయింపఁగూడదనియు, కాలనీలలోని వారికి కావలసినట్టి విదేశపుసామానులను ఇంగ్లీషువర్తకులనుండియే గాని స్వయముగ విదేశములనుండి కొనఁగూడదనియు శాసిం పఁబడియుండెను. కావున వ్యాపారవిషయమున కాలనీలవారికి స్వాతంత్ర్యమనునది కొంచెముగూడ లేకపోయెను.

నిర్బంధములన్ని యుండినను 1763 కు పూర్వము వారు వారియసంతృప్తిని పైకికనుపరుపలేదు. దీనికనేక కారణములు కలవు. ఇట్టిచట్టములా కాలమందన్ని దేశములయందుండినవి. మొత్తముమీఁదవీనివలన విస్తారమగునష్టమెవరికిని కలుగలేదు. వీనిని జాగరూకతతో అమలుచేయనికారణమున వీనికివ్యతిరి క్తముగ ప్రవర్తించి కొందఱు విశేషలాభమును గడించుచు నేయుండిరి. వ్యాపారవిషయములం దిట్టినిర్బంధములుండినను తక్కినరాజకీయవిషయములందు కాలనీలవారికి ఇంగ్లండులో ని ఇంగ్లీషువారికంటె నధికమగు స్వాతంత్ర్యముండెను. ప్రతి కాలనీయందు ప్రజలచే నెన్నుకొనఁబడిన ప్రజాప్రతినిధిసభ



యొకటి యుండెను; కాలనీయొక్క గవర్నరు ఇంగ్లండురాజుచే నియమింపఁబడినను ఈసభయొక్క యనుమతినిపొందక యతఁ డుప్రజలనుండి పన్నులువసూలుచేయుటకుగాని పన్నులనుఖర్చు పెట్టుటకుగాని శాసనములనుచేయుటకుగాని వీలు లేకుండెను. కాల నీలలోనివారు ఇంగ్లీషుప్రభుత్వమును ధిక్కరింపకుండ నుండి నందులకు వీనికంటె ప్రబలతరమగు హేతువొకటియుండెను. 1763 కు పూర్వము ఫ్రెంచివారుత్తరఅమెరికా నంతయు వశప రచుకొన ప్రయత్నించుచుండిరి; వారిప్రయత్నములు చాల వఱకు సఫలతగాంచియుండుటచే క్రమక్రమముగ తమ్మను గూడ వారెక్కడ స్వాధీనముచేసికొనెదరేమోయను భయ మీపదుమూఁడుకాలనీలవారికుండెను. మతమందును, జీవనో పాయములందును, సాంఘికాచారములందును ఒక కాలనీవారి కిమరియొక కాలనీవారికిని భేదములుండుటచే వారందఱుకలిసి ఫ్రెంచివారివలన కలుగుచుండిన కష్టములను తొలఁగించుట కసమర్థులై యుండిరి. వారిలో వారికైకమత్యము లేనికారణము చే ఇంగ్లీషుప్రభుత్వపుసహాయములేక ఫ్రెంచివారి బాధనుండి తప్పించుకొనుట దుస్సాధ్యమైయుండెను. కావున వ్యాపార సంబంధములగు నిర్బంధములెన్నియుండినను మాతృదేశపు ప్రభుత్వమును ధిక్కరింపక వారియెడల ననుకూలురైప్రవ ర్తించుచుండిరి. కాని 1763 నాఁటికి ఫ్రెంచివారిసామ్రాజ్య మడుగంటుటచేత నిట్టిసహాయము కాలనీలలోనివారి కనావ శ్యకమయ్యెను. ఇంగ్లీషువారి సహాయములేకున్నను తమస్వా తంత్ర్యమున కెట్టిభంగము గలుగఁజాలదని వారునిశ్చయిం చుకొనిరి.

ఇట్టిసమయమున వారికి మరింతక్రోధముగలుగునట్లుగ పార్లమెంటువారు ప్రవర్తింపసాగిరి. కాలనీలసంరక్షణార్థ మొనరింపఁబడిన సప్తసంవత్సరయుద్ధమునకై ఇంగ్లీషువారెంతయో ద్రవ్యమును ఖర్చుపెట్టిరి. దీనిలో కాలనీలవారు కొంతభాగమునైనభరింపలేదు. యుద్ధము ముగిసినతర్వాతఁగూడ శత్రుబాధకొంచెముండినందున కాలనీలలో స్థిరముగ నొకఇంగ్లీషు సైన్యముంచుట యావశ్యకమాయెను. అప్పుడు ఇంగ్లీషుపార్లమెంటువారు సైన్యమునకగు వ్యయములో కొంతభాగమును పన్నులమూలమున కాలనీలనుండి వసూలు చేయనమకట్టి 1765 లో "స్టాంపు" పన్ను నొకదానిని విధించిరి. తత్క్షణమే కాలనీలవారు క్రోధావేశపరులై ప్రజలపైపన్నులవిధింప వారిప్రతినిధులుతప్ప తక్కినవారర్హులుకారనియు, ప్రథమమునుండి కాలనీలలో నిదియేఆచారమైయున్నదనియు ఇంగ్లీషు పార్లమెంటులో కాలనీలతరపున ప్రతినిధులెవ్వరు లేనికారణమున పార్లమెంటునకిట్టి హక్కు లేదనియు వాదించుచు వారి యనంగీకారమును తెలిపిరి. ప్రజలయందాందోళన వృద్ధిగాంచఁదొడఁగెను: స్టాంపులనుకొనకయే వారివ్యవహారముల నిర్వర్తించుకొనుట కనేకులుతీర్మానించుకొనిరి. దీనినంతనుచూచి 1766 లో పార్లమెంటువారీపన్నును తీసివేసిరిగాని కాలనీలపై పన్నులవిధించుటకు తమకు పరిపూర్ణాధికారమున్నదని యొకతీర్మానమును చేసిరి. ఇంతటితో తృప్తిపొంది యుండినయెడల కాలనీలవారు కలహించియుండ నేయుండరు; కాని 1767లో పార్లమెంటువారు పూర్వమునలెనే కాలనీలలోనికి తీసికొనిపోఁ



బడు గాజుసామానులు సీసము రంగులు కాకితములు తేయాకు లోనగువానిపై సుంకములవిధించిరి. పూర్వముకంటె నిప్పుడు కాలనీలలోని ప్రజలలో సంక్షోభమధికమాయెను. వర్తకులెల్లరుకలిసి ఇంగ్లీషుసామానుల నెంతమాత్రము కొనఁగూడదని తీర్మానించుకొనిరి. ఉద్యోగస్థులు సహితమీపన్నులు వసూలుచేయ భయపడసాగిరి; వారికిసహాయముగా పంపబడిన యుద్ధభటులనుగూడ ప్రజలులక్ష్యపెట్టరైరి. ఇట్టిసందర్భమున పార్లమెంటువారు పునర్విచారణముగావించి తేయాకుపైతప్ప తక్కినసుంకములను తీసివేసిరి; కాని పన్నులవిధించుటకే పార్లమెంటున కధికారములేదని వాదించుచున్న అమెరికన్లకిది యెంతమాత్రము తృప్తికలిగింపకపోయెను. 1773లో బోస్టన్‌పట్టణపు రేవునకు తేయాకుతో కొన్ని యోడలురాఁగా ఆపురవాసులు దానినికొనఁగూడదని తీర్మానించుకొనుటయేగాక వారిలోకొందఱీయోడలలోనికివెళ్ళి తేయాకుబుట్టలనన్నిటిని సముద్రములో త్రోసివేసిరి. ఈవార్త వినఁగనే ఇంగ్లీషు మంత్రులుగ్రులై బోస్టన్‌పట్టణవాసుల శిక్షింప తీర్మానించి వారదివఱకనుభవించుచుండిన రాజకీయములగు హక్కులనన్నిటిని తీసివేసిరి. ఇందుపై బోస్టనుకుపట్టిన దురవస్థ తమకుఁగూడ పట్టునని యెంచి పదుమూఁడుకాలనీలలోని వారందఱుకలిసి తమహక్కులకపాయము గలుగకుండ చేసికొనుటకు సిద్ధపడి కార్యక్రమము నాలోచించుటకై కాలనీలన్నిటిలోని ప్రతినిధులు 1774 లో "కాంగ్రెస్" అనుపేరుతో నొకచోట సమావేశమై [illegible]

[illegible]

తెలిపిరి. కాని ఆకాలమున ఇంగ్లండును పరిపాలించుచుండిన మూఁడవజార్జి ప్రభువును వానిమంత్రులును పిడివాదము చేయు స్వభావము గలవారై ఉచితానుచితముల నెఱింగినవారు కాకపోవుటచే కాలనీలలోని ప్రజలకు మనశ్శాంతి గలిగింప ప్రయత్నింపక సైన్యములమూలమున వారిని శిక్షించుటకై పూనుకొనిరి. ఈకారణముచే "కాంగ్రెసు" వారు సైన్యమొకదానిని గూర్చి వాషింగ్టన్ అను మహనీయుని సేనాధిపతిగ నియమించి ఇంగ్లండునకు గర్భశత్రువులుగనుండిన ఫ్రాన్సు స్పెయిన్ లోనగు దేశములవారికి సహాయార్థమై రాయబారులనంపి ఇంగ్లీషు వారితో యుద్ధమునకుఁ గడంగిరి. యుద్ధమారంభమైనప్పుడు ఆంగ్లేయసామ్రాజ్యమునుండి వేరై ప్రత్యేకముగ స్వతంత్రరాష్ట్రమును నిర్మించుకొనవలయునని కాంగ్రెసువారభిప్రాయపడలేదు. కాని ఆంగ్లేయులు తమవాదమును గెలిపించుకొనుటకు పట్టిన పట్టును, యుద్ధమందు వారికిలభించిన విజయమును వారిని స్వాతంత్ర్యరాష్ట్రనిర్మాణమునకు పురికొల్పెను.

ఈవిధముగ ప్రారంభమైన యీయుద్ధము 1776 మొదలు 1783 వఱకు జరిగెను. సైన్యబలమందును నౌకాబలమందును ధనవిషయమునను ఆంగ్లేయులు అమెరికన్లకంటె నధికులైయుండిరి; యుద్ధములందు వారికున్నంత యనుభవము అమెరికన్లకు లేకుండెను. అయినప్పటికిని తుదకు ఇంగ్లీషువారు పరాజయమొందవలసివచ్చెను. రేవుపట్టణములన్నియును ఇంగ్లీషువారికి సులభముగ స్వాధీనమైనను దేశములోపలికి వెళ్లుటకు వీలగుబాటలు లేనికారణమునను, కాలనీలలోని ప్రజలందఱు



ఇంగ్లీషువారితో కలహించుటచేతను, ఇంగ్లీషుసైన్యములకధిపతులైన వారందఱు నేర్పరులు కాకపోవుటచేతను ఇంగ్లీషువారు జయము గాంచలేకపోయిరి. 1777 లో వారిసైన్యమొకటి సారటోగా యనుప్రదేశమున పూర్తిగ నపజయమొంది శత్రువశమాయెను. దీనిని వినఁగనే ఇంగ్లండుతో యుద్ధముచేయ సమయము వెదకుచుండిన ఫ్రెంచివారు అమెరికన్లతో కలిసిరి. తర్వాతకొంతకాలమునకు స్పెయిన్ వారును డచ్చివారునుగూడ ఇంగ్లీషువారితో యుద్ధము చేయఁబూనిరి. కావున కాలనీలతో మాత్రమేగాక ఇతరశత్రువులనేకులతో ఇంగ్లీషువారికి యుద్ధము సంప్రాప్తించెను. ఐరోపాఖండములోని తక్కిన దేశముల వారుగూడ యుద్ధమునకు పూనకపోయినను ఆంగ్లేయులయెడ ద్వేషభావము గలవారై వారికనేకములగు నాటంకములను కలుగఁజేయఁజొచ్చిరి. ఇట్లీకాలమందు మిత్రసహాయమును నదిలేక ఇంగ్లీషువారందరితో యుద్ధము చేయవలసివచ్చెను. నౌకాయుద్ధములలోఁగూడ కొన్నిటియందు వారికపజయము కలిగెను. ఇంతటియపకీర్తి వారికదివఱకెన్నఁడును సంప్రాప్తించి నదిలేదు. కావున 1783 లో వారు శత్రువులతో యొడంబడికను గావించుకొని యుద్ధమును ముగించిరి. ఈయొడంబడికలో మిసిసిపీనదికిని అట్లాంటిక్ మహాసముద్రమునకును మధ్యనుండిన దేశము పదుమూఁడుకాలనీలవారికి లభించెను. అది మొదలు వీరు యునైటెడ్ స్టేట్సు అను పేరుతో ప్రపంచమందంతట ప్రఖ్యాతిగాంచఁగలిగిరి.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము.

## పదునొకొండవ ప్రకరణము.

ప్లాసీయుద్ధము జరిగినతర్వాత పదునైదు సంవత్సరములవఱకు తూర్పిండియా సంఘమువారు బంగాళమును పరిపాలించు భారమును వహింపలేదు. వర్తకమూలమున ధనలాభమును సంపాదింపనుద్దేశించియే వారు మనదేశమునకు వచ్చినందున అనుకూలుఁడగు మీర్జాఫరును నాధారముగ చేసికొని వారియిష్టానుసారముగ నెన్నియో దుర్ణయములనుకావించి ద్రవ్యమునుసంపాదింపఁదొడఁగిరి. మీర్జాఫరుపై జమీన్‌దారులుకొందఱుకలహించినపుడును, బంగాళాపై మొగలాయి సైన్యములు దండెత్తివచ్చినపుడును ఇంగ్లీషుసైన్యముల సహాయముచేతనే నవాబు వానిశత్రువుల నోడింపఁగలిగినందున నతఁడు వారికనుచరుఁడై వారియిష్టములననుసరించి వెళ్ళవలసిన స్థితియందుండెనుగాని వారన్యాయముగ ప్రవర్తించినపుడు సహితము వారినిశిక్షింపసమర్థుఁడు గాకపోయెను. ప్లాసీయుద్ధమునకు పూర్వము ఆంగ్లేయవర్తకులు బంగాళనవాబు ఆజ్ఞల ప్రకారము నడుచుకొనుచుండిరి; ఆయుద్ధము జరిగినతర్వాత వారియాజ్ఞలప్రకారము నవాబు నడుచుకొనవలసివచ్చెను. కాని ఈమార్పును మీర్జాఫరెంతమాత్రము సహింపఁజాలక, వారిని పూర్వపుస్థితికి తెచ్చుటకు ప్రయత్నించుచు వారిశత్రువులతో కలిసి రహస్యముగ వారిపై కుట్రలనుపన్నుట కారంభించెను. 1760 లో క్లైవు బంగాళమునువదలి ఇంగ్లండునకు వెళ్లినపిమ్మట నితని కుట్రలధికమయ్యెను. అందుచే కలకత్తాలోని ఇంగ్లీషువారు వానిని తొలఁగించి వానిస్థానమున మీర్కాసీం అనువానిని నవాబుగచేసిరి.

తన్ను నవాబుగచేసినందుకై మీర్కాసీం తూర్పిండియాసంఘమువారికిబర్ద్వాన్ మిడ్నాపూరు చిట్టగాంగ్ అనుమూడుజిల్లాలను బహుమానముగనిచ్చి వారినౌకర్లకు లక్షలకొలఁదిరూపాయలనొసంగెను. కాని మీర్జాఫరువలె నతఁడుగూడ బంగాళమందు ఇంగ్లీషువారికుండిన యాధిక్యమునుగాని వ్యాపారవిషయమై వారు గావించుచున్న దౌర్జన్యమును గాని సహింపఁడాయెను. తమసైన్యసహాయములేక మీర్కాసీంగాని మరియెవరుగాని బంగాళమునకు నవాబుగ నుండుట సంభవింపదను ధైర్యముచే తూర్పిండియాసంఘపు నౌకరులందఱు న్యాయాన్యాయవిచక్షణతలేక చట్టములకు విరుద్ధముగ ప్రవర్తించుచు న్యాయములగు పన్నులనుగూడ చెల్లింపక నవాబునకును వానిప్రజలకును అపరిమితమగు నష్టమును కలిగించుచుండిరి. మీర్కాసీం కోపభరితుఁడై ఇంగ్లీషువారియాధిక్యమును పోఁగొట్టతీర్మానించి సైన్యములనుగూర్చుటకును యుద్ధసామగ్రిలను చేర్చుటకును పూనెను. ఇట్టిస్థితిలో నూరకుండుటయనుచితమని ఇంగ్లీషువారుగూడ యుద్ధసన్నద్ధులై వాని

నెదుర్కొని సింహాసనమునుండి వానిని తొలఁగించి వృద్ధుఁడగు మీర్జాఫరును మరియొకమారు నవాబుగనొనర్చిరి. మీర్కాసింపరాజితుఁడై సమీపమందున్న అయోధ్యరాష్ట్రపు నవాబు సహాయమును వేఁడెను. ఆతఁడందులకంగీకరించి అతనివశమందప్పుడుండిన ఢిల్లీపాదుషాయగు షాఆలంతోకలిసి బక్సారుపట్టణమువద్ద 1764 లో ఇంగ్లీషుసైన్యములనుతాఁకి వారివలననోడింపఁబడి పారిపోయెను. ఈయుద్ధమందు కలిగిన జయమువలన బంగాళముమాత్రమేగాక ఆయోధ్యరాష్ట్రముగూడ ఇంగ్లీషువారివశమగునట్లుండెను. అప్పుడే ఢిల్లీ చక్రవర్తియు వారిశరణుచొచ్చెను.

ఇప్పటికి మూడుమార్లు నవాబులను తొలఁగించుటయు మూడుమార్లు క్రొత్తనవాబుల నేర్పాటు చేయుటయు జరిగెను బంగాళాప్రభుత్వమును స్వకీయముగ నడుపుటకు తూర్పిండియాసంఘమువారంగీకరింపరైరి. పరిపాలనవిధానములో కొన్ని సవరణలను చేసిన యెడల నదివఱకు వారికిఁగలిగిన కష్టములదృశ్యమగుననియెంచి అవశ్యములగు మార్పులు గావించుటకు 1765 లో వారు క్లైవునుగవర్నరుగ నియోగించి బంగాళమునకంపిరి. ధనేచ్ఛయేగాని రాజ్యేచ్ఛ వారికి లేనికారణముచే ఏటేటధనలాభమధికముగ చేకూరుటకు తగిన యేర్పాటులను మాత్రమతఁడు గావించెను.

1757 మొదలు నవాబునురక్షించుటకొరకై బంగాళమందు తూర్పిండియాసంఘమువారొక సైన్యము నుంచియుండిరి. అందులకగు ఖర్చులనన్నిటిని తామభరించెదమని నవాబులొ



డంబడినను వారుక్రమముగ పైకమునుచెల్లింపకపోవుటచే సంఘమువారికి నష్టముసంభవించుచుండెను. ఇదిగాక ఇంగ్లండునకెగుమతి చేయతలఁచిన వర్తకపుసరకుల కొనుటకుఁగూడ వారికిద్రవ్యమావశ్యకమై యుండెను. ఇదివఱకు పన్నులనునవాబు వసూలుచేసి, సంఘమువారికి కావలసినద్రవ్యము నిచ్చునట్లేర్పాటు జరిగియుండెను. కాని నవాబులెవ్వరు విశ్వసనీయులుగాకపోవుటచేత నీపద్ధతినిమాని వసూలయిన పన్నులన్నియు సంఘమువారికే చెందవలయునని క్లైవు క్రొత్తయేర్పాటు నొకదానిని చేసెను. దీనికే దివానీఅధికారమనిపేరు. దీనినిసంఘమువారువహించుటచట్టమునకువిరుద్ధమని ఇతరులాక్షేపింపకుండుటకై వారినిశరణుచొచ్చిన ఢిల్లీచక్రవర్తినుండి సన్నదునొకదానినిందునిమిత్తమై క్లైవుపొంది దానికిబదులుగ అయోధ్యరాష్ట్రములోని రెండుజిల్లాలను ఏటేట నిరువది యాఱులక్షల రూపాయలకప్పమును చక్రవర్తికిచ్చుట కొప్పుకొనెను. ఇది మొదలు బంగాళమునందుపన్నులను వసూలు చేయు నధికారము తూర్పిండియాసంఘమువారిదయ్యెను. ఈసమయముననే ఉత్తరసర్కారులను సంఘమువారనుభవింపవచ్చునని మరియొకసన్నదునుగూడ చక్రవర్తి ఇచ్చెను. బంగాళమందీవిధముగ ఇంగ్లీషువారియధికారమును స్థిరముగస్థాపించి దానిని శత్రువులెవ్వరు దండెత్తనీయకుండుటకై అయోధ్యనవాబుతో 1765 న క్లైవు మరియొకయొడంబడిక చేసికొనెను. దానిననుసరించి చక్రవర్తికిచెందిన రెండుజిల్లాలుతప్ప తక్కిన అయోధ్యరాష్ట్ర

ముంతయుపూర్వపునవాబునకియ్యఁబడెను. అతఁడుఇంగ్లీషువారి మొదల కృతజ్ఞుఁడై వారికి ఏఁబదిలక్షలరూపాయలొసంగుటయే గాక ఎల్లప్పుడువారికి మిత్రుఁడై శత్రువులు బంగాళముపైరా కుండునట్లు వారికిసహాయము చేయనొప్పకొనెను.

కాని క్లైవుగావించిన పైయేర్పాటులవలన పరిపాలనా విధానమునందు ప్రధానములగు మార్పులేవియుకలుగలేదు. ఇదివరకు వసూలయినపన్నులనన్నిటిని నవాబుపుచ్చుకొని సైన్యమునకగు వ్యయమును సంఘమువారికిచ్చుచుండెను; ఇప్పుడా సొమ్ము సంఘమువారుపుచ్చుకొని నవాబుఖర్చులకై కావలసినసొమ్మును వానికియ్యసాగిరి. కాని చట్టముల నమలులోనుంచుట వివాదములను పరిష్కరించుట లోనగురాజ్యకార్యములన్నియు నవాబునకు లోఁబడినయుద్యోగస్థులే చేయుచుండిరి. పన్నులనుగూడ పూర్వపు టుద్యోగస్థులే వసూలుచేయుచుండిరి. ఈపద్ధతివలన దేశమందంతట నరాజకముప్రబలి ప్రజలను కష్టములపాలుగావించెను. న్యాయవిరుద్ధముగ ప్రవర్తించువారిని శిక్షించుట నవాబుచేయవలసినకార్యమైనను దానికి వలయుసైన్యమును ద్రవ్యమును వానియధీనమందు లేనందున నతఁడు దీనినిచేయుటకు సమర్థుఁడుకాకపోయెను. తూర్పిండియాసంఘమువారికీసామర్థ్యముండినను వారుపరిపాలనయందు జోక్యముకలిగించుకొనక వ్యాపారమందే వారికాలమును గడుపుచుండిరి. ఇట్టిసందర్భమున నవాబుతరపువారొకవైపునను సంఘపునౌకర్లు మరియొకవైపునను బాధించుచుండ దాని



నుండితప్పించుకొనుటకుమార్గముగానక ప్రజలు పరితపించుచుండిరి. ఇట్లుండఁగా గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు 1770 లో బంగాళమున విపరీతమగుక్షామము సంభవించెను. లక్షలకొలదిప్రజలు మృత్యువువాతఁబడిరి. అనేకులు వారిభూములనువదలి అడవులకుపారిపోయిరి. పెక్కండ్రుదారిదోపిడి గాండ్రైరి. సంఘపునౌకర్లు మాత్రమేదోవిధముగ ధనమార్జించి కోటీశ్వరులై ఇంగ్లండునకువెళ్ళుచుండిరి. కాని పన్నులు క్రమముగవసూలుకాకపోవుటచే సంఘమువారనుకొనినంతటి యాదాయము రాకపోయెను. కోట్లకొలఁది ప్రజలీవిధముగ బాధపడుచుండుటవిని పార్లమెంటువారు బంగాళప్రభుత్వమును సవరణచేయఁబూనుకొనిరి. అప్పుడు సంఘమువారు వారన్ హేస్టింగ్సును బంగాళమునకు గవర్నరుగనంపిరి.

ఇతఁడదివఱకిరువది సంవత్సరములపర్యంతము మనదేశమున తూర్పిండియా సంఘమువారి యుద్యోగమందుండినందున బంగాళరాష్ట్రపరిపాలనములోని మంచిచెడ్డల బాగుగనెఱిఁగియుండెను. ప్రజలు పడుచుండినకష్టములకును సంఘమువారికి కలుగుచుండిన నష్టమునకును సంఘమువారు ప్రభుత్వభారమును వహింపకుండుటయే కారణమని తీర్మానించి 1772లో నతఁడుప్రభుత్వమునంతను వారియధీనము గావించెను. ప్రథమమున వారు మనదేశమునకు వచ్చుటలో వారియుద్దేశము వ్యాపారము చేయుటమాత్రమేయైనను, ఇంగ్లండులోని సంఘాధికారులయుద్దేశ మిప్పుడుకూడ నట్లేయుండినను హేస్టింగ్సు అట్లు భావింపక బంగాళరాష్ట్రమును వారుతప్ప మరియెవ్వరు పరిపా

లించుటకు వీలులేదని నిశ్చయించి ప్రజలకష్టములు తొలఁగుటకై మార్పులెన్నియో గావించెను. పన్నులువసూలుచేయుపద్ధతులందు సవరణలనేకములు చేసెను; అన్ని జిల్లాలయందును నేరముచేసినవారిని శిక్షించుటకొక న్యాయస్థానమును, వివాదములను పరిష్కరించుటకు మరియొకదానిని స్థాపించి పునర్విచారణముచేయుటకై కలకత్తాలో నిట్టిన్యాయస్థానములరెంటి నేర్పరచెను. వ్యాపారవిషయమున సంఘపునౌకర్లు గావించుచుండిన దుర్న్యాయములను పోఁగొట్టెను. ఇందువలన క్రమముగ రాష్ట్రమందంతట న్యాయమగు పరిపాలనాపద్ధతి వ్యాపించెను. ప్రజలిదివఱకు పడుచుండిన కష్టములనుమరచి సుఖముగ కాలము గడుపఁగలిగిరి. ఇట్లు వర్తకులుగ నుండినవారిని పరిపాలకులుగచేయుటచేత ఆంగ్లేయసామ్రాజ్య స్థాపనకర్తలలో నొక్కనిగ హేస్టింగ్సును పరిగణించుచున్నారు.

1773 లో పార్లమెంటువారొక చట్టమునుచేసి వారన్ హేస్టింగ్సును గవర్నరు జనరలుగ నియమించి చెన్నపట్టణము బొంబాయి దొరతనమువారిపై నతనికధికారమొసఁగి రాజకీయకార్యములందతనికి సలహానిచ్చుటకు నలుగురుసభ్యులు గలసభ నొకదానినిస్థాపించిరి. అదిమొదలు 1785 వఱకతఁడు గవర్నరుజనరలుగనుండి ఆంగ్లేయరాష్ట్రములను చక్కగపరిపాలించి వాని నాకాలమందు సంభవించిన శత్రుబాధలనుండికడు నేర్పుతో సంరక్షింపఁగలిగెను.

ఆకాలమున ఇంగ్లీషువారికి మనదేశమందు శత్రువులుగ నుండి వారిసామ్రాజ్యవ్యాపనమునకు ఆటంకము గలుగఁజేయు



చుండినవారిలో మైసూరుసుల్తానులును మహారాష్ట్రులును ప్రధానులైయుండిరి. 1760 వఱకు మైసూరుసంస్థానము హిందూరాజుల పరిపాలనయందుండెను. అటుతర్వాత వారిసైన్యాధిపతులలో నొక్కఁడగు హైదరాలీ వారినితొలఁగించి రాజ్యమునంతను వానివశము చేసికొని నలుదిక్కుల వానియధికారమును వ్యాపింపసమకట్టి చుట్టుప్రక్కలనున్న తక్కినరాజులతో యుద్ధమునకుపూనెను. అతఁడు కడుధైర్యసాహసములు గలవాఁడు. అతనివద్ద నధికములగు సైన్యములుండెను. అతనిరాజ్యము కొండలమధ్యనున్నందున దానిపైదండెత్తివెళ్లుట సులభసాధ్యముగాకుండెను. ఆకాలమందు చెన్నపట్టణమును పరిపాలించుటకు తూర్పిండియా సంఘమువారంపిన గవర్నరులందఱసమర్థులగుటచే హైదరాలీ పలుమారు కర్ణాటముపై దాడివచ్చి ఇంగ్లీషుసైన్యములనుగూడపలుమారులోడింపఁగలిగియుండెను.

మహారాష్ట్రులప్పటికి హైదరాలీకంటెబలవంతులుగనుండిరి. మొగలాయీ సామ్రాజ్య వినాశకర్తలలో నొకరగు వీరు ఔరంగజీబు మరణానంతరము వారియధికారమును దేశమందంతట వ్యాపింపచేయఁబూని హేస్టింగ్సు గవర్నరుజనరలగునప్పటికి ఇప్పటిబొంబాయిరాజధాని మధ్యపరగణాలు బిరారు ఒరిస్సా మధ్యఇండియాలకు పరిపాలకులై ఢిల్లీచక్రవర్తిని సహితము వారిస్వాధీనము గావించుకొనఁగలిగియుండిరి. రాజ్యవిస్తారమందును సైన్యబాహుళ్యమందును వారితో తులతూఁగఁగలవారాకాలమందు మన దేశమున నెవరునులేకుండిరి. ఇదిగాక ఆంగ్లేయులతో సమానముగ యుద్ధము చేయఁగలిగినవారు

వారొక్కరే. కాని వారియందైకమత్యముమాత్రము చాలతక్కువగనుండెను. పేరునకు పూనాపట్టణమందున్న పీష్వావారందఱికి నధిపతియైనను వానియధికారమొక బొంబాయిరాజధానిలోమాత్రము చెల్లుచుండెను. మధ్యపరగణాలను "భోంస్లే" వంశజులును గుజరాతమును "గైకవాడు" ప్రభువును మధ్యయిండియాలో నొకభాగమును "హోల్కారు"ను మరియొకభాగమును "సింధియా"యును పరిపాలించుచుండిరి. వీరిలోవీరికి పరస్పర కలహములప్పుడప్పుడు సంభవించుచుండుటయుఁగూడకలదు. కాని లోపములెన్నియుండినను మొత్తముమీఁద ఇంగ్లీషువారితో యుద్ధముచేయుటకు వీరుసమర్థులై యుండిరి.

వారన్ హేస్టింగ్సు వీరెవరితోఁగూడ యుద్ధముచేయుటకిష్టపడినవాఁడుకాఁడు. కాని బొంబాయిదొరతనమువారి దురాశలమూలమున 1778 లో మహారాష్ట్రులతో యుద్ధముసంఘటిల్లెను. ప్రథమమున బొంబాయియందలి ఇంగ్లీషు సైన్యములోడిపోయెను. మహారాష్ట్రులువిజృంభించి ఆంగ్లేయులపైఁబడసాగిరి. ఎంతయొకష్టముమీఁద హేస్టింగ్సు సైన్యములనుకూర్చి బొంబాయిరాజధానికంపెను. వీనిమూలమున నచటనచటకొన్నిజయములు సమకూరుచుండఁగా చెన్నపట్టణపుదొరతనమువారు తెలివిలేనివారలై హైదరాలీని యుద్ధమునకు పురికొల్పిరి. 1780 లో నీవిధముగ నేకకాలమందిందఱితో హేస్టింగ్సు యుద్ధముచేయవలసివచ్చెను. ఇట్టిసమయమున అమెరికా కాలనీలసహాయార్థమై ఫ్రెంచివారుగూడ ఇంగ్లీషువారితో



యుద్ధమున కుపక్రమించి నౌకాబలమొకదానిని హైదరాలీకి తోడ్పడుటకు మనదేశమునకంపిరి. హైదరాలీసైన్యములు కర్ణాటమును ప్రవేశించి ప్రజలనెల్లదోచి గ్రామముల నగ్నిహోత్రునిపాలుగావించుచు ఆంగ్లేయసైన్యములను తునుమాడఁదొడఁగెను. ఫ్రెంచివారిసహాయమున హైదరాలీ ఇంగ్లీషువారిని కర్ణాటమందుండి తొలఁగింపఁగలుగునేమోయను అనుమానముగూడ కలుగసాగెను. ఇట్టిసందర్భమున హేస్టింగ్సుధైర్యమునువిడువక కార్యదీక్షవహించి ఎట్టులో యొకరీతిగా సైన్యములనుచేర్చి వివిధములగు నుపాయములమూలమున ధనమునుసంపాదించి మహారాష్ట్రుల కోటలకొన్నిటిని పట్టుకొని వారిలోకొందఱిని తక్కినవారినుండి వేరుపరచి 1782లో వారితో సమాధానముచేసికొనెను. అదిమొదలతఁడు మైసూరుసుల్తానుతోమాత్రము యుద్ధముచేయవలసినవాఁడాయెను. ఇంగ్లీషువారిఅదృష్టవశమున 1782 లో హైదరు మృతిచెందెను. 1783 లో ఫ్రెంచివారు యుద్ధమునుమాని సమాధానము చేసికొనిరి. తుదకు 1784 లో హైదరుకుమారుఁడగు టిప్పుసుల్తానుతో హేస్టింగ్సు సంధిచేసికొనఁగలిగెను.

ఈయుద్ధములవలన ఇంగ్లీషుసామ్రాజ్యము వృద్ధిగాంచకపోయినను వారిరాష్ట్రములు శత్రువశమగుటతప్పెను. 1776 మొదలు 1783వఱకు జరిగినయుద్ధములలో అమెరికాయందును ఐరోపాయందును ఇంగ్లీషువారపజయమొంది వారిసామ్రాజ్యములో చాలభాగమునుకోల్పోయిరి. కాని మనదేశమందుఁగూడ వారికతితీవ్రములగు కష్టములప్పుడుకలిగినను హేస్టింగ్సు

యొక్క కార్యసాధన సామర్థ్యముచేత వారికి రాజ్యనష్టమేమియు సంభవింపలేదు. ఆంగ్లేయసామ్రాజ్య స్థాపకులలో నగ్రగణ్యుఁడని వారన్ హేస్టింగ్సును పేర్కొనుట కిదియే కారణము.

1785 లో వారన్ హేస్టింగ్సు ఇంగ్లండునకు వెళ్లిపోయెను. అతనితర్వాత 1786 మొదలు 1793 వఱకు కార్న్ వాలీసు గవర్నరుజనరలుగనుండెను. ఇతనికాలమున మైసూరురాజగు టిప్పుసుల్తానుతో యుద్ధమవసరమాయెను. అదివఱకతని తండ్రి కాలమునజరిగినయుద్ధము ముగిసినప్పటినుండి అతఁడుమరియొక యుద్ధమునకు వలయుసన్నాహముచేయుచు 1787 లో ఫ్రెంచివారిసహాయము సంపాదించుటకై పారిస్‌పట్టణమునకు రాయబారినంపెను. ఇదిగాక 1789 లో ఆంగ్లేయులసంరక్షణమందుండిన తిరువాన్కూరురాజుపై నతఁడుదండెత్తివెళ్ళెను. దీనినంతనుచూచి కార్న్‌వాలీసు మహారాష్ట్రులతోడను నిజాం తోడనుకలిసి టిప్పుసుల్తానుతో 1790 లో యుద్ధమారంభించెను. యుద్ధము రెండుసంవత్సరములు జరిగెను. టిప్పూపరాజయమొంది ఇంగ్లీషువారికి మలబారు దిండిగల్ బరమహాల్ అను ప్రదేశముల నిచ్చివేసెను.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## పండ్రెండవ ప్రకరణము.

సామ్రాజ్యముకొఱకై ఇంగ్లీషువారికిని ఫ్రెంచివారికిని జరిగినయుద్ధములలో కడపటియుద్ధము 1793 లో ప్రారంభమై 1815 లో ముగిసెను.

1789 లో ఫ్రాన్సుదేశమందు మహత్తరమగు రాజకీయ విప్లవముకలిగెను. అప్పుడు విప్లవకారులలో అతివాదులందఱు నుకలిసి ప్రాచీనసాంప్రదాయ సిద్ధములగు నాచారవ్యవహారములనెల్లమార్చి, రాజును సింహాసనభ్రష్టునిగావించి, నిరంకుశప్రభుత్వమునకు బదులుగ ప్రజాప్రభుత్వమును స్థాపించిరి. రెండుమూడుసంవత్సరముల కాలమున నింతటిమార్పులాదేశమునకలుగుట తక్కిన దేశములందలి రాజులకురుచింపని కారణముచే వారిలో ముఖ్యులగు ప్రష్యియా ఆస్ట్రియా దేశపు రాజులు ఫ్రాన్సుపైదండెత్తివచ్చి నిరంకుశప్రభుత్వమును పునరుద్ధారణ చేయసమకట్టిరి. ఇందుచే ఫ్రెంచివారందఱు కోపావేశభరితులై వారిదేశమున వారికిష్టమగు మార్పులను గావించుకొనుచుండ నొరులు పరులనవసరముగ జోక్యముకలుగఁజేసికొనుటకంటె ననుచితము వేరులేదనినిశ్చయించి వారిలో వారికిఁగల భిన్నాభిప్రాయములనెల్లమఱచి అందఱునొక్కరై శత్రుసైన్యముల

పైఁబడిరి. అప్పుడు శత్రురాజులు ఫ్రెంచివారిధాటికోర్వఁజాలక నలువైపులకుపారిపోయిరి. సులభముగ నింతటివిజయము సమకూరెనందున ఫ్రెంచివారు మున్నుమిన్నుగానక ఉన్మాదపరవశులై ప్రపంచమందు రాజత్వమనునదిలేకుండునట్లు రాజులనెల్ల రూపుమాపి ప్రతిదేశమందును ప్రజాప్రభుత్వమును స్థాపింపసంసిద్ధులై, సింహాసనమందుండి అదివఱకు తొలఁగించిన రాజును శిరచ్ఛేదముచేసి సైన్యములనుచేర్చుకొని బెల్జియం దేశమునుజయించి, అదివఱకు అమలులోనుండిన యొడంబడికలకొన్నిటిని రద్దుచేసి హాలెండు దేశపు స్వాతంత్ర్యమునుభంగపఱుచఁబూనిరి.

ఇతరదేశములవారివలె ఇంగ్లీషువారు ప్రథమమున ఫ్రెంచివారిపై విరోధమునువహింపలేదు. ప్రజానుకూలులుగానిరాజులను తొలఁగించి ప్రజాప్రభుత్వమును స్థాపించుకొనుటలోఁగల కష్టనిష్ఠురములను స్వానుభమువలన బాగుగగుర్తెఱిఁగినవారగుటచే ఇంగ్లీషువారికి ఫ్రెంచివారు చేసికొనుచుండిన మార్పులవిషయమై ఆగ్రహముజనింపలేదు. కాని రానురాను వారిచర్యలు ఇంగ్లీషువారికి నష్టము కలుగఁజేయునవియై పరిణమించెను. బలవంతులగు ఫ్రెంచివారు హాలెండు బెల్జియం దేశములనుస్వాధీనపరచుకొనినయెడల ఇంగ్లండుపైదండెత్తివచ్చుట వారికి కడుసులభమగును. అంతకుముందు నూరుసంవత్సరములనుండి ఈదేశములస్వాతంత్ర్యమును సంరక్షించుటకై ఇంగ్లీషువారు ఫ్రెంచివారితో యుద్ధములుగావించియే యుండిరి. ఇప్పుడుగూడ నట్టియుద్ధమత్యావశ్యక మాయెను. ఇదిగాక



ఇంగ్లీషువారీవిధముగ నాలోచించుకాలముననే ఫ్రెంచివారు వారిపై యుద్ధమునకుపూనిరి. ఇట్టిసందర్భమున ఆస్ట్రియా ప్రషియా స్పెయిన్ లోనగు దేశములవారితో కలిసి ఇంగ్లీషువారుగూడ యుద్ధమునకుపక్రమించిరి.

యుద్ధమారంభమైన రెండుసంవత్సరములకు నెపోలియన్ ఫ్రెంచిసైన్యములలో నొకదానికధిపతియయ్యెను. ఇతనిజీవితము మిక్కిలియద్భుతమైనది. ఇతఁడు ప్రపంచమందలి యోధాగ్రేసరులలో నొక్కఁడనిప్రఖ్యాతిగాంచినవాఁడు. ఇతఁడు సేనాధిపతియగు నప్పటికి వయస్సునందు పిన్నవాఁడయ్యును బుద్ధిబలమందును కార్యనిపుణతయందును నిరుపమానుఁడని చెప్పనొప్పియుండెను. ఇతనిని ఫ్రెంచిప్రభుత్వమువారు 1796 లో ఇటలీదేశమును జయించుటకై పంపిరి. అతివేగముగ నితఁడాదేశమును ప్రవేశించి, దానికాకాలమున పరిపాలకులుగనుండిన ఆస్ట్రియావారి సైన్యములలోని లోపములనన్నిటినిగ్రహించి, ఫ్రెంచిసైనికులయుత్సాహమును ప్రబలపరచి, కడుశీఘ్రముగ శత్రుసైన్యములను ఖండఖండములుగచేసి ప్రత్యేకముగ వానిననేకయుద్ధములందోడించి ఇటలీని ఫ్రెంచివారిస్వాధీనము చేయుటయేగాక ఆస్ట్రియావారిని యుద్ధమును మానునట్లొనరించెను. అదిమొదలునెపోలియన్ యెడల ఫ్రెంచివారుచూపఁజొచ్చిన భక్తినమ్రతలకుమితి మేరలేకుండెను. క్రమక్రమముగ నతఁడుగూడ స్వాధికారమును వృద్ధిపరచుకొని ఫ్రాన్సునకు చక్రవర్తి కాఁదలఁచెను.

ఇట్టిసమయమున నతనికిని ఇంగ్లీషువారికిని వైరమధికము

కాఁజొచ్చెను. 1793 లో ఐరోపాలోని ప్రధానదేశములన్నియు ఫ్రెంచివారిపై యుద్ధమునకుపూనినను 1797 నాటికి వారు తక్కిన దేశములవారందఱినోడించి కొందఱిని మిత్రులుగఁగూడ చేసికొనఁగలిగిరిగాని ఇంగ్లీషువారినిమాత్రము మెనుకొనఁజాలరైరి. వీరు నౌకాబలసహాయమున ఫ్రాన్సుదేశపు తీరమందున్న రేవులనెల్ల నరికట్టి సముద్రములకావల ఫ్రెంచివారి స్వాధీనమందుండిన ద్వీపములను వశపరచుకొని వారికిసహాయభూతులైన హాలెండు స్పెయిన్ దేశములవారి పరిపాలనలలో ఖండాంతరములందున్న ప్రదేశములను కొన్నిటినిగూడ జయింపఁగలిగిరి. ఫ్రెంచివారికి నౌకాబలములేనందున ఇంగ్లీషువారినెదిరించుటకు వారికిసామర్థ్యముచాలదాయెను. ఇదిగాక బాల్యమందుండి నెపోలియన్‌కు ప్రాగ్దేశములనుజయించి అలెగ్జాండరువలె వానికన్నిటికి చక్రవర్తికావలయుననెడి యుద్దేశముండెను. దీనిని నెరవేర్చుకొనుటలోఁగూడ వానికి ఇంగ్లీషువారలే శత్రువులైరి. ఇంగ్లీషువారి నోడించినచో ఐరోపాఖండమందు ఫ్రెంచివారికి విరోధులు లేకపోవుటయేగాక ప్రాగ్దేశములన్నియు తనస్వాధీనముకాఁగలవని నిశ్చయించి జీవితమంతయును ఇంగ్లీషువారినోడించుటయే ప్రధానకార్యముగ నెపోలియన్ నిశ్చయించుకొనెను.

ఈవిధముగ ప్రాగ్దేశములను జయింపనమకట్టి నెపోలియన్ 1798 లో నౌకాసైన్యమునుతీసికొని మెడిటరేనియన్ సముద్రమును కాచియుండిన ఇంగ్లీషునౌకల దృష్టిపథమునంబడక కడురహస్యముగ సముద్రయానము చేసి మార్గమందు మాల్టా



ద్వీపమును వశపరచుకొని తుదకు ఈజిప్టుదేశమును చేరెను. భూమిమీఁద సైన్యములతో యుద్ధము చేయుటయందు నిరుపమాన శక్తిసామర్థ్యములుగల యితఁడుకొద్దిదినములలో నా దేశమును స్వాధీనపరచుకొని, ఆకాలమున ఇంగ్లీషువారిసామ్రాజ్యమునకంతకు నాధారముగనుండిన మన దేశమును జయింప నుద్దేశించి మహారాష్ట్రులతోడను టిప్పూసుల్తానుతోడను ఉత్తరప్రత్యుత్తరములు జరుపుకొనుచుండెను. కాని ఇతఁడు ఈజిప్టుచేరినకొన్నిదినములకు ఇంగ్లీషునౌకాబలమునకధిపతియగు నెల్సన్ దానినెఱిఁగి, ఇతని వెనువెంటఁదగిలి, నైలునదిముఖద్వారమందుండిన వీని యోడలతో యుద్ధము చేసి వానిలోచాలభాగమును సముద్రనిపాలుగావించెను. నౌకాబలము నీవిధముగ కోల్పోవుటచే మన దేశముపై దండెత్తివచ్చుట దుస్సాధ్యమగుటయేగాక ఫ్రాన్సునకు మరలివచ్చుటకుఁగూడ మార్గముగానక విచారపడవలసిన స్థితియందు నెపోలియన్ ఉండెను. కాని ధైర్యమునుమాత్ర మతఁడువిడువక ఏదోవిధమున అదృష్టవశముచే 1799 లో స్వదేశమును చేరఁగలిగెను.

నెపోలియన్ ఈజిప్టులోనున్నప్పుడు ఆస్ట్రియా మొదలగు దేశములవారు ఫ్రెంచివారిపై తిరుగఁబడి వారిసైన్యములనోడించి అదివఱకుకోల్పోయిన ఇటలీలోనగు దేశములను వశముచేసికొనఁగలిగిరి. కావున వీనినితిరిగి జయింపనమకట్టి తాను ఫ్రాన్సుదేశమును చేరినమాట అందఱికి తెలియకపూర్వమే యుద్ధసన్నద్ధుఁడై అమానుషప్రజ్ఞతో ఆల్పస్‌కొండలనుదాటి ఇటలీలోని ఆస్ట్రియన్ సైన్యముల నత్యద్భుతముగ నోడించి

తనకుఁ గావలసిన ప్రదేశములనన్నిటిని శత్రువులనుండి తీసికొనెను. ఫ్రెంచివారందఱు నతిసంతుష్టచిత్తులై దేశాధికారమునంతను వానికొసంగి యతఁడు ఫ్రాన్సునకు చక్రవర్తి యగుటకుఁ గూడ నంగీకరించిరి. పదిసంవత్సరములకు పూర్వము రాజత్వమును రూపుమాపఁబూని యుద్ధములకుకడఁగిన ఫ్రెంచివారు ఇంద్రజాలమహిమకు లోఁబడినవారివలె నెపోలియన్ చక్రవర్తికి దాసానుదాసులైరి!

కాని, ఇంగ్లీషువారినిమాత్ర మతఁడేమియును చేయ లేకుండెను. వారినౌకాబలము నెదిరింపసమర్థుఁడుగాక రషియా స్వీడన్ డెన్మార్కు దేశములను వారిపై యుద్ధముచేయ పురికొల్పఁదొడఁగెను. డెన్మార్కువారికి కొంచెము నౌకాబలముండినందున ఇంగ్లీషువారా దేశముపైదండెత్తి 1801 లో జరిగినయుద్ధమందాబలమును వినాశముగావించిరి. నెపోలియనుకు విసుగెత్తి నౌకాబలమును వృద్ధిపరచుకొనినఁగాని ఇంగ్లీషువారితో యుద్ధమునకుపూనుట లాభములేదనియెంచి అట్టిబలము తయారగుటకు కొన్నిసంవత్సరములుపట్టునని 1802 లో ఇంగ్లీషువారితో సమాధానముచేసికొనెను. కాని ఐరోపాలోని మరికొన్ని దేశముల నతఁడు వశపరచుకొని, తూర్పుదేశములందును ఆస్ట్రేలియాఖండమందునుగూడ ఫ్రెంచివారి యధికారమును నెలకొల్పుటకు వలయునేర్పాటుల గావించుచుండుటచే ఇంగ్లీషువారికి తనియందనుమానమధికమై 1803 లో యుద్ధము తిరిగి యారంభమగుటకు కారణమాయెను.

ఈమారు నెపోలియన్ ఇంగ్లండుపై దాడివెడలుటకు నిశ్చ



యించెను. ఇంగ్లండునకు ఫ్రాన్సుకును మధ్యభాగమున ఇంగ్లీషుఛానల్ సముద్రమున్నది. ఫ్రెంచిసైన్యము నిరపాయముగ దీనినిదాటి ఇంగ్లండునుప్రవేశింపఁగలిగినయెడల ఇంగ్లీషువారి నోడించుట సులభసాధ్యమగును. కావున నతఁడు సైన్యమును సముద్రముదాటించుటకు వలయుసదుపాయముల సమకూర్చుకొనుటయందు రెండుసంవత్సరములుగడపి తనకుకొన్నిసామాన్యపుటోడలను కొన్ని యుద్ధనౌకలనుతయారుచేయఁగలిగెను. కాని యెంత వేగముగ పని చేసినను ఇంగ్లీషువారి యోడలతో తులతూఁగఁగలిగి నన్నియోడలుతయారుచేయుట దుస్సాధ్యమాయెను. ఇదిగాక ఫ్రెంచివారి నౌకాబలమంతయు నొకరేవునందుండలేదు. కొన్ని హాలెండుదేశపుతీరమునందును, కొన్ని ఫ్రాన్సుదేశపు ఉత్తర పశ్చిమ దక్షిణతీరములందును, మరికొన్ని స్పెయిన్ దేశపుతీరమునందును వెదజల్లినట్లుండెను. వీనినన్నిటిని ఇంగ్లీషుఛానలలో నొకచోట చేర్పఁగలిగినయెడల కొంతవఱకు నతఁడు తలపెట్టినకార్యము సులభమైయుండును. ఇందుకుఁగాను 1805 లో నతఁడు వానినౌకాధిపతులందఱికి వారివారి స్థానములనువిడిచి ఇంగ్లీషువారి చేతిలో చిక్కక యేదోవిధముగ వారినిమోసపుచ్చి ఇంగ్లీషుఛానలలో ప్రవేశింపవలయునని ఉత్తరువు చేసెను. దీనిననుసరించి కొందఱు నౌకాధిపతులు వారినౌకలనుతీసికొని ఇంగ్లీషుఛానలనుచేర నెన్నియోప్రయత్నములు గావించిరికాని ఆంగ్లేయనౌకాధిపతియగు "నెల్సన్" ఎల్లప్పుడు వారివెంటనంటుచు వారియుద్యమములు కొనసాగకుండునట్లు ప్రవర్తించుచుండెను. తుదకు నెపోలియన్

విసుగుచెంది ఏలాగుననైన ఇంగ్లీషునౌకల నోడింపవలయునని వానినౌకాధిపతుల కాజ్ఞాపించెను. అప్పుడు వారుచేయునదేమియులేక స్పెయిన్ దేశపుతీరమందున్న నౌకాబలమునంతను తీసికొని జిబ్రాల్టరుదిక్కుగ ప్రయాణము చేయుచుండఁగా నెల్సన్ వెంటఁదరిమి ట్రఫల్గారువద్ద యుద్ధమునకు పూనెను. ఇంగ్లీషువారొనరించిన సముద్రయుద్ధములలో నింతటిప్రఖ్యాతి గాంచినది మరియొకటి లేదు. నెల్సన్ వానిబుద్ధిచాతుర్యమునంతను చూపి ఇంగ్లీషునౌకలభేద్యముగనుండునట్లు వ్యూహమును పన్ని శత్రునౌకలను వేరుచేసి వానిపైఁబడి వానిరూపుమాపెను. యుద్ధాంతమున గుండుదెబ్బతగిలి నెల్సన్ ప్రాణములు విడువవలసివచ్చెనుగాని అప్పటికే యుద్ధమందు తనబలమునకు విజయము గలిగెనను సువార్తనతఁడు వినెను. ఇంతటితో ఇంగ్లండుపై దాడివెడలుట దుస్సాధ్యమని నెపోలియన్ నిశ్చయించి ఇంగ్లీషువారి నోడించుట కుపాయాంతరమును వెదకసాగెను.

పందొమ్మిదవ శతాబ్ద ప్రారంభమగునప్పటికి ఇంగ్లీషువారు యంత్రములనేకములుగని పెట్టి వాని సహాయమున బట్టలు ఇనుపసామానులు లోనగువానిని చౌకగతయారుచేసి విదేశములకు వానినిపంపి వానికిబదులుగ వారికికావలసిన ఆహారాదిపదార్థములను తెచ్చుకొనుచుండిరి; ఈకారణముచే వారిజీవనాధారమునకంతకు విదేశవ్యాపారమే మూలమైయుండెను. దీనికి భంగముగలిగించినయెడల వారుతయారుచేసినవస్తువులు కొనువారులేక వారికపరిమితమగు నష్టముకలుగుటయేగాక ఇతర దే



శములనుండి వారుమామూలుగ తెచ్చుకొనుచున్న పదార్థములు లభింపకపోవుటవలన జీవనోపాయములన్నియు నశించి యుద్ధముచేయుటకు వలయుబలము సంపూర్ణముగ క్షీణించుననుటసత్యము. నెపోలియన్ దీనినెఱింగినవాఁడై ఐరోపాఖండమందలి దేశములలోనికి ఇంగ్లీషుసామానులు రానీకుండుటకు సమకట్టివానిసామ్రాజ్యములోనున్నట్టియు వానిమిత్రవర్గములోచేరినట్టియు దేశములవారెవ్వరు ఇంగ్లీషుసామానులను ఇంగ్లీషుయోడలలో తేఁబడినవస్తువులను కొనఁగూడదనియు, ఈదేశములకు సరుకులను తేదలఁచుకొనిన ఉదాసీనులుసహితము ఇంగ్లీషువారి రేవులలో నడుగిడఁగూడదనియు చట్టములను గావించెను. ఈకారణముచే ఇంగ్లీషువస్తువులను ఐరోపాలోని దేశములలోనమ్ముటయు, ఇంగ్లీషువారికికావలసినవానిని ఆదేశములనుండికొనుటయు దుస్తరమాయెను. కాని మొత్తముమీద నీచట్టములవలన ఇంగ్లీషువారికంటె నెపోలియన్కే అధికమగునష్టముకలిగి తుదకు వానివినాశమునకు హేతువయ్యెను.

ఈచట్టములనతఁడు గావించినప్పటికి ఫ్రాన్సు బెల్జియం హాలెండు ఇటలీ దేశములు వానిసామ్రాజ్యములో చేరియుండెను; స్పెయిన్ ఆస్ట్రియా జర్మనీలోనిచాలభాగమును వానిమిత్రవర్గములో చేరియుండెను. కాని చట్టములుపూర్తిగనమలులోనికివచ్చుటకు ఐరోపాఖండపు సముద్రతీరమంతయు నతఁడు స్వాధీనముచేసికొనవలసివచ్చెను. సముద్రతీరములో నేభాగముగాని వానికివశముగాకుండినచో నచటినుండి ఇంగ్లీషువారు వారిసరుకులను ఐరోపాఖండములోనికి ప్రవేశపెట్టుచుం

డిరి. అట్టియనకాశము కొంచెముగూడ వారికి లేకుండుటకై దేశములన్నిటిని స్వవశముచేసికొననెంచి 1806 లో ప్రషియా సైన్యములను 1807 లో రషియా సైన్యములనోడించి, ఆదేశపురాజులనుసహితము ఇంగ్లీషువ్యాపారసంబంధమగు వానిచట్టముల కంగీకరింపచేసెను. ఇంతటితోఁ దృప్తినొందక స్పెయిన్ పోర్చుగల్ దేశములవారు వానికి మిత్రులుగనుండినను వారిని మోసపరచి ఆ దేశములను స్వవశము చేసికొనెను. ఇంగ్లీషువ్యాపారమును భంగపరచుటకై ఇన్ని దేశముల నొక్కుమాఱు జయింపవలసివచ్చెను. కాని మోసపుచ్చి తమ్ము నువశము చేసికొనుటకును స్పెయిన్ పోర్చుగల్ దేశముల వారెంతమాత్రమిష్టపడక వారందఱొక్కటై నెపోలియన్‌పై తిరుఁగబడి వాని సైన్యములనుగూడ నోడింపఁగలిగిరి. ఇందువలన ఇంగ్లీషువారికి రెండువిధములుగ లాభముసమకూరెను. స్పెయిన్ పోర్చుగల్ వారు ఇంగ్లీషువారికి మిత్రులై వారిసరుకులను కొనుటకును, ఇంగ్లీషువారు దక్షిణఅమెరికాలోని స్పెయిన్ వారికాలనీలతో వ్యాపారము చేయవచ్చుననియు నంగీకరించిరి. క్రమక్రమముగ ఇంగ్లీషువారివ్యాపారము దక్షిణఅమెరికా ఖండమందంతట వ్యాపించి ఐరోపాలో వారికికలిగిన నష్టమును పోఁగొట్టి పూర్వముకంటె నధికముగ లాభముదొరుకునట్లుచేసెను. ఇదిగాక ఇంగ్లీషువారు వారిసైన్యములను స్పెయిన్ వారి సహాయార్థమంపి దానిమూలమునఁగూడ నెపోలియన్‌కు చిక్కులను కలిగింపసాగిరి. ఇంగ్లీషువారితో నేవిధమగు వ్యాపారము చేయఁగూడదని నెపోలియన్ శాసించుటచే ఐరోపా ఖండవాసులం



దఱు ఇంగ్లీషువారిమూలమున నదివఱకు తెప్పించుకొనుచుండిన సామానులను కొనుటకు వీలులేక విశేషముగు శ్రమకు పాత్రులైరి. మామూలుగ వారుధరించుకొనుచుండిన వస్త్రములఖరీదులుగూడ పదిపదునైదురెట్లధికమై వారినిదురవస్థల పాలుచేసెను. దీనికంతకు నెపోలియన్ కారణముఁగనాయని వారందఱు వానినిదూషించుచు వానియాధిపత్యమునకు వినాశముగలుగఁజేయ సంసిద్ధులైరి. ప్రజలుపడుచున్న యిట్టికష్టములనుచూడలేక నదివఱకు మిత్రుఁడుగనుండిన రషియా చక్రవర్తిగూడ నెపోలియన్‌తో విరోధము పూనెను. 18'2 నాఁటికి ఐరోపాఖండవాసులందఱు వానికిద్వేషులై వానినధికారభ్రష్టునిఁగావింప సమయమువెదకసాగిరి. కావున ఇంగ్లీషువారివ్యాపారమునకు నష్టముకలిగింపనెంచి అతఁడు గావించిన చట్టములవల్లన అతనికష్టములేమెండయ్యెను. అన్ని దేశములవారు నొక్కటై అతనితోఁ గలహింప, యుద్ధమునందతఁడతిసమర్థుఁడయ్యును తుదకు 1815 లో సంపూర్ణముగ పరాజయమొందెను. విసుగుచెందక, కష్టనష్టములెన్నిగలిగినను ఓర్పువిడువక, తదేకదీక్షతో నిరువదిరెండు సంవత్సరము లీవిధముగ ఇంగ్లీషువారు ఫ్రెంచివారితోయుద్ధముచేసి వారిసామ్రాజ్యమును నిలుపుకొనుటయేగాక దానిని నలువైపుల విస్తరింపచేసికొనఁగలిగిరి.

యుద్ధకాలమందుఇంగ్లీషువారువారి నౌకాబలముచే ఫ్రెంచి డచ్చి స్పెయిన్ వారి స్వాధీనమందుండిన ప్రదేశములలో ననేకములను వశపరచుకొనఁగలిగిరి. యుద్ధాంతమున వీనిలో కొ

న్నిటినితప్ప తక్కినవానిని వారుంచుకొనిరి. ఈవిధముగ, నాంగ్లేయ సామ్రాజ్యములో చేర్పఁబడిన ప్రదేశములలో ముఖ్యములైనవి సెంటులూసియా, టొబాగో, ట్రినిడాడ్ గయానా, హాండురాస్, గుడుహోపు కాలని, మొరిషస్, సింహళము. ఐరోపాఖండమందు ఇంగ్లీషువారికి చెందినప్రదేశములలో మాల్టాద్వీపము ప్రధానమైనది.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము.

## పదుమూఁడవ ప్రకరణము.

1798 లో వెలస్లీ మన దేశమునకు గవర్నరు జనరలుగ వచ్చెను. ఆంగ్లేయులయధికారమును దేశమందంతట వ్యాపింపఁజేసి సాధ్యమైనంతవఱకు తక్కినసంస్థానాధీశులను వారికిలోఁబడినసామంతరాజులుగ చేయుటయే యితని ప్రధానోద్దేశము. ఇతనియభిప్రాయములతో ఇంగ్లండులోని తూర్పిండియాసంఘపువారేకీభవింపక పోయినను వారినిలక్ష్యపెట్టక తనయిష్టానుసారముగ యుద్ధములనుకావించి 1805 నాటికి ననేకరాష్ట్రములను ఇంగ్లీషువారిపరిపాలనలోనికితఁడు తేఁగలిగెను. ఇతఁడీవిధముగ చేయనిశ్చయించుటకు కారణములేకపోలేదు. ఆకాలమందు మన దేశమును పరిపాలించుచుండినవారిలో మైసూరు రాజ్యమునకుప్రభువైనటిప్పూ, హైదరాబాదు నేలుచుండిననిజాము, పశ్చిమమధ్యభాగములను వశమందుంచుకొనియుండిన మహారాష్ట్రులును ప్రధానులైయుండిరి. వీరిలోవైకమత్యము లేక ఎల్లప్పుడు యుద్ధాసక్తులై ఒకరిరాష్ట్రమును మరియొకరాక్రమింపఁజూచుచు దేశమునంతను నల్లకల్లోలము గావించుచుండిరి. అప్పటికి ఇంగ్లీషువారుగూడ బంగాళములోనగు రాష్ట్రములకు స్వతంత్రప్రభువులుగ నుండినందున స్వదేశరాజులలో

నొకరొకరికి జరుగుచుండిన యుద్ధములం దుదాసీనులై యుండుటకు వీలుపడకపోయెను. వీరియౌదాసీన్యమువలన తక్కినవారిలో నెకరు ఇతరులరాష్ట్రములజయించి కాలక్రమమున దేశమంతను స్వాధీనముచేసికొని తుదకుఇంగ్లీషువారినిగూడ నెదిరించి వీరివశమందున్న రాష్ట్రములనుగూడ నపహరింపఁబూనెదరేమో యనుభయము వెలస్లీకికలిగెను. కావుననిట్టియుపద్రవముజనించుటకు పూర్వమే స్వదేశరాజులనందఱిని స్వవశముచేసికొనుటయుక్తమని ఇతఁడునిశ్చయించెను.

ఇదిగాక 1798 నాఁటికి ఇంగ్లీషువారికిని నెపోలియనుకును యుద్ధమతితీవ్రముగ జరుగుచుండెను. అతఁడు ఈజిప్టుదేశముపైదండెత్తివచ్చి ఇండియానుండి ఇంగ్లీషువారిని తరిమివేయునుద్దేశముతో టిప్పూమొదలగువారికిసహాయమొనర్ప సిద్ధపడియుండెను. హైదరాబాదు నిజాం అదివఱకు ఇంగ్లీషువారియెడల చూపుచుండిన స్నేహభావమునువిడనాడి ఫ్రెంచియుద్ధభటులసహాయమున నొకసైన్యమును తయారుచేసికొని దానికి ఫ్రెంచివానినొకని నధిపతిగనియమించియుండెను. ఇదేవిధముగ మహారాష్ట్రులలో నెల్ల బలాఢ్యుఁడగు సింధియా, ఫ్రెంచివారియుద్ధపద్ధతుల ననుసరించి సైన్యమునొకదానిని సిద్ధపరచుకొని హిందూస్థానమందంతట వానియాధిపత్యమును స్థాపింపసమయమువెదకుచుండెను. ఫ్రెంచిసేనానియొకఁడు కొంతసైన్యమునుగూర్చుకొని యమునానదీప్రాంతమున చిన్నరాజ్యమును స్థాపించుకొని పరిపాలించుచుండెను. ఈవిధముగ మనదేశమందెచట చూచినను ఫ్రెంచివారు ఇంగ్లీషువారిపై కుట్రల



నుపన్ని వారియధికారమునకు లోపముగలిగింప జూచుచుండిరి.

'నెపోలియన్' అనిన నపరిమితమగు భీతినిపొందుచున్న ఇంగ్లీషువారు స్వదేశసంస్థానములందు ఫ్రెంచివారికప్పుడుండిన పలుకుబడినిచూచి మరింతభయపడసాగిరి. నెపోలియన్ ఈజిప్టునుండి మనదేశమునకువచ్చినయెడల స్వదేశరాజులందఱు వానితోకలిసి ఇంగ్లీషువారి నెదుర్కొనుటతప్పదని వెలస్లీనిశ్చయించి ఇట్టిసమావేశముజరుగుటకు పూర్వమే వారిబలమునణఁచి వారిలో కొందఱినైన స్వాధీనముచేసికొనఁబూనెను.

ఫ్రెంచివారిసహాయమును కోరుచున్నవారిలో నెల్ల టిప్పూసుల్తాను ప్రధానుఁడగుటచేత నతనిసైన్యమందుండిన ఫ్రెంచివారినితొలఁగించి ఇంగ్లీషు వారితో నతఁడుతక్షణమేసంధిగావించుకొనవలసినదని వెలస్లీ కోరెను; అందుల, కతఁడంగీకరింపకపోవుటచే 1799 లో నతనిపైయుద్ధమునకుపూని వాని ప్రధానపట్టణమగు శ్రీరంగపట్టణమును ఇంగ్లీషువారు పట్టుకొనిరి. ఆసమయమున టిప్పూ కాలధర్మమొందినందున యుద్ధము త్వరలోముగిసెను. అప్పుడు వెలస్లీ మైసూరురాష్ట్రమును మూడుభాగములుగచేసి యొకభాగమును తానుతీసికొని మరియొకభాగమును యుద్ధమందు తనకుసహాయముచేసిన నిజామునకిచ్చి తక్కినదానికి హైదరాలీకి పూర్వము మైసూరును పరిపాలించుచుండిన హిందూరాజకుటుంబములో నొకనిని ప్రభువుగనొనర్చెను.

మైసూరుయుద్ధము ముగిసినతర్వాత కర్ణాట రాజ్యమును తంజావూరును అయోధ్యారాష్ట్రములోని జిల్లాలలో కొన్నిటిని

వెలస్లీ ఇంగ్లీషు పరిపాలనలోనికి తెచ్చెను. రెండుతరములనుండి కర్ణాటకనవాబులు ఆదాయమునకు మించినవ్యయము చేయుచు అప్పులపాలై ప్రజలను బాధించుచుండినందున వారినిరాజ్యాధికారమునుండి తొలఁగింపవలసివచ్చెను. అయోధ్యనవాబులు సుమారు నలువదిసంవత్సరములనుండి ఇంగ్లీషువారికిమిత్రులై యుండినను పరిపాలనవిషయమున వారికిఁగల సమర్థతతగ్గుచుండుటచేతను వారిపొరుగుననే బలవంతులగు మహారాష్ట్రులుండుట చేతను వారిస్వాధీనమందధిక విస్తీర్ణతగల రాజ్యముండుట క్షేమకరముకాదని దానిలోని జిల్లాలనుకొన్నిటిని వెలస్లీవశపరచుకొనెను. హైదరాబాదు నిజాం ఇంగ్లీషువారికిమిత్రుఁడై మైసూరుయుద్ధమున నతనికిలభించిన జిల్లాలనన్నిటిని 1801 లో వారికిచ్చివేసెను. ఈవిధముగ యుద్ధములనుచేయనవసరములేకయే వెలస్లీ ఆంగ్లేయ సామ్రాజ్యమును విస్తరింప చేయఁగలిగెను.

వెలస్లీ మిక్కిలిదూరదృష్టిగల రాజకార్యధురంధరుఁడు. కావున ఆంగ్లేయసామ్రాజ్యమును విస్తరింపఁజేయుటకంటె స్వదేశసంస్థానాధీశులు పరస్పర కలహములుమాని ఆంగ్లేయులకు విధేయులై ప్రవర్తించుట లాభకరముగ నుండఁగలదని నిశ్చయించి వారివలన నుత్తరకాలమందెన్నఁడు నుపద్రవముగలుగకుండుటకై క్రొత్తషరతులుకొన్నిటికివారినిలోఁబడునట్లుప్రోత్సహించెను. మైసూరురాజునకు ఇంగ్లీషు వారిమూలమున రాజ్యములభించినందునను, మహారాష్ట్రులవలని బాధలుతొలఁ



గించుకొనుటలో నిజామునకు ఇంగ్లీషువారిసహాయ మత్యావశ్యకమైయున్నందునను, అయోధ్యనవాబులు మొదటినుండి ఇంగ్లీషువారికి నమ్రులైయున్నందునను వీరు వెలస్లీవిధించిన షరతులకన్నిటికంగీకరించిరి. ఇదిమొదలు వీరు ఇంగ్లీషువారిని తప్ప తక్కినయూరోపియన్లనెవ్వరిని వారియుద్యోగమందుంచుకొనుటమానిరి. ఈకారణముచే వారిసైన్యములందదివఱకుండిన ఫ్రెంచివారందఱును ఉద్యోగములనువదలుకొని వారిదేశమునకువెళ్లిపోయిరి. ఇదిగాక ఈరాజులందఱును, ఇంగ్లీషుసైన్యమొకదానిని వారిరాజ్యమందుంచుకొని దానికగుఖర్చులనిమిత్తమై కొన్నిజిల్లాలను ఇంగ్లీషువారికిచ్చి వారిస్వసైన్యముల సంఖ్యను తగ్గించుకొనిరి. ఇతరరాజులతో సంబంధమునంతను వదలుకొని వారితోవివాదములేవైన సంభవించినపుడు వానిని ఇంగ్లీషువారి సలహాలననుసరించి పరిష్కరించుకొనుటకు వారొప్పుకొనిరి. ఇందుమూలమున నిదిమొదలు వీరిలోవీరికి పరస్పరయుద్ధములుమానుటయేగాక వీరికిని ఇంగ్లీషువారికిని యుద్ధములుసంభవించుట కవకాశములేకపోయెను. వెలస్లీవిధించిన షరతులకులోఁబడిన రాజులనందఱిని సర్వకాలములందును శత్రుబాధనుండి రక్షించుటకతఁడొడంబడెను.

1801 నాటికి మహారాష్ట్రులొక్కరుమాత్రమే ఇంగ్లీషువారితో సమానముగయుద్ధము చేయ శక్తిగలిగియుండిరి. వారికి పూనా పట్టణమందున్న పీష్వా అధిపతియైయుండెను. పేరునకతని యధికారమునకులోఁబడి భోన్స్లే సింధియా హోల్కారులు వారి వారి రాజ్యములను పరిపాలించుకొనుచుండిరి.

మైసూరుయుద్ధము ముగిసినతర్వాత పీష్వానుగూడ వైషరతుల నంగీకరింపఁజేయవలయునని వెలస్లీ యెన్నియోప్రయత్నములుగావించెనుగాని ఇతరసంస్థానాధీశులవలె నితనికి ఇంగ్లీషు వారిసహాయ మావశ్యకమై యుండనందున నీప్రయత్నములన్నియు విఫలములయ్యెను. కాలక్రమమున పీష్వాస్థితిమారెను. 1802 లో నతనికిని నతనిసామంతులలో నొక్కఁడగు హోల్కారునకును పూనాపట్టణమందు యుద్ధముసంభవించి అందులో నతఁడు పరాజయమొందెను. అప్పుడు పూనాపట్టణము శత్రువశముకాఁగా నిలువనీడలేక పీష్వా ఇంగ్లీషువారిశరణుచొచ్చెను. తానునిరీక్షించుచుండిన సమయము తుదకులభించెనుగదాయని వెలస్లీ పరమానందభరితుఁడై అతఁడువిధించుషరతులకన్నిటికి పీష్వాయొడంబడినయెడల నతనికి ఇంగ్లీషువారు సహాయము చేయసిద్ధపడెదరని చెప్పెను. ఇంగ్లీషువారికి నితర స్వదేశరాజులవలె విధేయుఁడై ప్రవర్తించుట గౌరవహానియని యెఱిఁగియు మార్గాంతరములేనందున నాషరతులన్నిటికిపీష్వా ఇయ్యకొనెను. తత్క్షణమే 1803 లో ఇంగ్లీషుసైన్యములతనిని పూనాకుపిలుచుకొనిపోయి యథాస్థానమందు వానినుంచిరి.

కాని నూరుసంవత్సరములనుండి సర్వస్వాతంత్ర్యము ననుభవించుచు మొగలాయీచక్రవర్తులను సహితమోడించి దేశములో నర్ధభాగమునకు ప్రభువుగనుండు పీష్వా దీనుఁడై యీ విధముగ ఇంగ్లీషు వారియధీనమగుట సింధియా భాన్ స్లేమొదలగు తక్కినమహారాష్ట్ర పరిపాలకులకు లజ్జాకరమైయుండెను. అందు చేవారు పీష్వాకును ఇంగ్లీషు వారికిని జరిగినసంధికి సమ్మ



తింపక ఇంగ్లీషువారితో యుద్ధముచేసి పీష్వాను స్వతంత్రుని గావింపసమకట్టి వారిసైన్యముల నెల్ల నొక్కచోటచేర్పసాగిరి. వెలస్లీ వారియభిప్రాయములనుగ్రహించి వారిపైయుద్ధమునకు బయలువెడలెను. సంఖ్యాబాహుళ్యమందు మహారాష్ట్రసైన్యములు ఇంగ్లీషుసైన్యములకంటె నాలుగైదురెట్లధికముగ నుండినను ఇంగ్లీషు సేనాధిపతులు వారిసైన్యములను నాలుగుదిక్కులనుండి అతివేగముగతీసికొనిపోయి మహారాష్ట్రుల ప్రధానదుర్గములనన్నిటినిపట్టుకొని సింధియాను అస్సేయియను గ్రామము దగ్గరను భాన్ స్లేని అర్గాంనుప్రదేశసమీపమునను పూర్తిగనోడించిరి. ఇట్లే ఇంగ్లీషుసైన్యములు మరికొన్నిఉత్తరఇండియాలోని డిల్లీ ఆగ్రాలోనగు ముఖ్యపట్టణములనుపట్టుకొని అదివఱకు మహారాష్ట్రులయధీనమైనమొగలాయిచక్రవర్తిని బంధనవిముక్తునిగచేసి సమీపమందున్న సింధియాసైన్యముల నన్నిటిని నోడింపఁగలిగెను. యుద్ధమారంభమైనతర్వాత నారునెలలకే మహారాష్ట్రులు పరాజితులైరి. కావున వారు వెలస్లీతో సంధి చేసికొనుటకు సిద్ధపడవలసివచ్చెను.

ఈసంధివలన సింధియా భాన్ స్లేలు వారియుద్యోగమందుండిన ఫ్రెంచివారినెల్ల తొలఁగించుటకును ఇంగ్లీషువారదివఱకు పీష్వాతో కావించుకొనిన యొడంబడికకు సమ్మతించుటకును వారిరాజ్యములలో కొంతభాగమును ఇంగ్లీషు వారికిచ్చివేయుటకును ఇంగ్లీషురాయబారులను స్థిరముగ వారిస్థానమందుంచుకొనుటకును, ఇంగ్లీషువారికిమిత్రులైన నిజామునుగాని రాజపుత్రస్థానములోని రాజులనుగాని బాధింపకుండుటకును, ఆంగ్లే

కరించిరి. ఇట్లు ఇంగ్లీషువారికి లభించినప్రదేశములలో కటకము గంగాయమునానదులమధ్యనుండినప్రదేశము ఢిల్లీ ఆగ్రా పట్టణములు ప్రధానములు. కటకము లభించుటవలన మనదేశపుతూర్పుతీరమంతయు ఇంగ్లీషువారిస్వాధీనమై బంగాళము నుండి చెన్నపట్టణమునకు నిరాటంకముగ రాకపోకలు జరుగుటకవకాశముగలిగెను. ఢిల్లీప్రాంతపుదేశములు లభించినందున యమునానది ఆంగ్లేయరాష్ట్రమునకు సరిహద్దగుటయేగాక వ్యాపారసదుపాయములుగూడ నధికమయ్యెను. ఏయుద్దేశముతో వెలస్లీ మనదేశమునకు గవర్నరుజనరలుగవచ్చెనో అది 1804 ప్రారంభమగునప్పటికి పూర్తిగ నెరవేరెను.

1803 లో జరిగిన మహారాష్ట్రయుద్ధమందు హోల్కారుదాసీనుఁడైయుండెనుగాని ఆంగ్లేయసామ్రాజ్య మతివేగముగ విస్తృతిచెందుటగాంచి తక్కినమహారాష్ట్రులను లోఁబరచుకొనినవారు తన్నుఁగూడవశముచేసికొనఁగలరనిసంశయించుచు 1804 లో ఇంగ్లీషువారితో యుద్ధమునకుపూనెను. ప్రథమమున ఇంగ్లీషుసైన్యము లపజయమొందినను తుదకుహోల్కారుగూడ తక్కినమహారాష్ట్రులవలె ఇంగ్లీషువారి యాధిక్యము నొప్పుకొనవలసినవాఁడయ్యెను.

హోల్కారుతో జరుగుచుండిన యుద్ధముముగియుటకు పూర్వమే తూర్పిండియాసంఘపుటధికారులు వెలస్లీని గవర్నరుజనరలుద్యోగమునుండి తొలఁగించిరి. వీరు వర్తకమువలనలాభముసంపాదింపఁ గోరినవారేగాని సామ్రాజ్యమును విస్తరింపఁజేయుట వీరికెంతమాత్రమిష్టము లేకుండెను. ఒకయుద్ధము



వెంబడి మరియొకయుద్ధము సంభవించుటయు వచ్చినయాదాయమంతయు వీనికైఖర్చగుచుండుటయు సంఘమువారి ఋణములధికమగుచుండుటయు వీరికి వెలస్లీయెడల నసంతుష్టినికలిగించెను. అదిమొదలు వీరు యుద్ధములలోప్రవేశింపక స్వదేశసంస్థాన వ్యవహారములలో జోక్యము కలుగఁజేసికొనక ఆదాయమును వృద్ధిచేయఁగలవారిని మనదేశమునకు గవర్నరుజనరలుగ పంపసాగిరి. ఈకారణముచే కొన్నిసంవత్సరములవఱకు ఇంగ్లీషురాష్ట్రము వృద్ధిగాంచలేదు.

1813 లో మార్క్విస్ ఆఫ్ హేస్టింగ్సును మనదేశమునకు వీరు గవర్నరుజనరలుగనంపిరి. ఇతనికిఁగూడ యుద్ధములందిష్టములేకపోయినను దేశములోని ఇతరపరిపాలకులమూలమున యుద్ధములుకొన్నిసంభవించెను. ఆంగ్లేయరాష్ట్రముల ఉత్తరముగ హిమాలయప్రాంతమందుండిన నేపాళదేశపు రాజులు పలుమాఱు ఇంగ్లీషురాష్ట్రములలోని గ్రామములనుదోచుకొనుచు సరిహద్దులలోనున్న కొన్నిజిల్లాలను స్వాధీనముచేసికొనుటకై వారిసైన్యములనంపిరి. ఈకారణముచే 1814 మొదలు 1816 వఱకు నేపాళయుద్ధముజరిగెను. ఇందులో ప్రథమమున కొండదారులమూలమున నేపాళమునప్రవేశింపనెంచిన ఇంగ్లీషుసైన్యముల కపజయముకలిగెనుగాని తుదకువీరు నేపాళసైన్యముల నోడింపఁగలిగిరి. అప్పుడు నేపాళులు సంధిచేసికొని ఇప్పటిసంయుక్తరాష్ట్రములలోని జిల్లాలలోకొన్నిటిని ఇంగ్లీషువారికిచ్చిరి.

ఈయుద్ధము ముగిసినపిమ్మట పిండారీగుంపులతోడను మ

హారాష్ట్రులతోడను యుద్ధమావశ్యకమాయెను. మొగలాయిసామ్రాజ్యము క్షీణించినపిమ్మట బలాఢ్యులచ్చటచ్చట బయలుదేరి రాజ్యముసుస్థాపించుకొను కాలమందనేకులు వారివద్ద యుద్ధభటులుగప్రవేశించి యుద్ధమే జీవనోపాయముగ కలిగియుండిరి. క్రమక్రమముగ నీరాజ్యములలో కొన్ని ఆంగ్లేయసామ్రాజ్యమందు కలిసిపోవుటచేతను తక్కినసంస్థానముల పరిపాలకులు యుద్ధములమాని ఇంగ్లీషువారికి వశులగుటచేతను నదివఱకు యుద్ధభటులుగనుండిన వారిలోననేకులు జీవనోపాయములులేక గుంపులు గుంపులుగాకూడి చిత్తము వచ్చినట్లు గ్రామములపైఁబడి ప్రజల ననేకవిధములుగ హింసించుచుండిరి. వీరికి పిండారీలని పేరు. ఇట్టివారు సుమారు ముప్పది వేలమందియుండిరి. వీరికి హోల్కారు సింధియా రాజ్యముల సమీపభూములునికిపట్టై యుండెను. అచటనుండి వీరు ఇంగ్లీషుపరిపాలనయందుండిన రాష్ట్రములందుప్రవేశించి ప్రజలను దోచుకొనుచుండిరి. ఒక్కొకప్పుడీమహారాష్ట్ర ప్రభువులుగూడ వారిని ప్రోత్సాహపరచి వారికితగిన సహాయమొసంగుటగూడకలదు. వీరియుపద్రవ మధికమగుచుండుటచే వీరినిశిక్షింపసమకట్టి 1817 లో హేస్టింగ్సు వీరిపైకియుద్ధము చేయనుపక్రమించెను.

ఇదేసమయమున మహారాష్ట్రాధిపతులగు పీష్వా భాన్స్లే సింధియా హోల్కారులుగూడ ఇంగ్లీషువారితో కలహింపఁబూనియుండిరి. ఇంగ్లీషువారియాజ్ఞల ననుసరించి వారికివిధే



యులై ప్రవర్తించుట మిక్కిలియవమానకరమనియెంచి యేదియో ఒకమార్గమున స్వాతంత్ర్యమును సంపాదించుటకు పీష్వా ప్రయత్నించుచుండెను. నాగపూరులోని భాన్స్లేగూడ నిదేవిధముగ నాలోచింపఁదొడఁగెను. తక్కినమహారాష్ట్ర ప్రభువులు సహితమిట్లే యాంగ్లేయులతోడి సంబంధమునువదల్చుకొనుటకు సంకల్పించియుండిరి. హేస్టింగ్సు పిండారీదండుతో యుద్ధము చేయ ప్రయత్నములు గావించుచున్నప్పుడు తమయుద్దేశముల నెరవేర్చుకొనుటకు తగినతరుణము దొరకినదని పీష్వా పూనాలోని ఇంగ్లీషుసైన్యములపైని, భాన్స్లే నాగపూరులోని సైన్యములపైని తిరుగఁబడిరి. హేస్టింగ్సు సుమారు నూటయిరువది వేలసైన్యమును సమకూర్చి శత్రువులందఱిని పూర్తిగనోడించెను. 1818 ప్రారంభమగునప్పటికి పిండారీలలో ననేకులు హతులైరి. కొందఱడవులకు పారిపోయిరి. తక్కినవారు వారిపూర్వపుదుష్టచర్యలనుమానిరి. ఇందుచే వారివలన కలుగుచుండిన బాధలన్నియు నదృశ్యములయ్యెను. పీష్వావశమందుండిన రాజ్యమంతయు ఇంగ్లీషువారిస్వాధీనమగుటచే నిప్పటిబొంబాయిరాజధానియేర్పడెను. భాన్స్లే వానిరాజ్యములోని పశ్చిమభాగములను కోల్పోవుటయేగాక స్వదేశాధీశులపై ఇంగ్లీషువారు మామూలుగ విధించుచుండిన షరతులన్నిటికి నొప్పుకొనవలసినవాఁడయ్యెను. సింధియా హోల్కారులుగూడ వారికోటలలోకొన్నిటిని ఇంగ్లీషువారికిచ్చి వారియెడల విధేయులై ప్రవర్తించుట కంగీకరించిరి.

ఇట్లు పదిసంవత్సరములు పరిపాలించి 1823 లో హేస్టిం

గ్స ఇంగ్లండునకు వెళ్లిపోవునప్పటికి పంజాబు సింధురాష్ట్రములుతప్ప మన దేశములోని తక్కినభాగమంతయు ఇంగ్లీషు వారిస్వాధీనమైయుండెను. కాని దీనినంతను వారుస్వయముగ పరిపాలింపలేదు. కొంతభాగమును వారిపరిపాలనలో నుంచుకొని తక్కినదానిని వారికిలోఁబడిన స్వదేశ సంస్థానాధీశుల యధీనముగావించియుండిరి. పరిపాలనక్రమమునకూడ రాను రాను ఈరెండుభాగములకుఁగల భేదములధికమయ్యెను. ఇంగ్లీషువారు స్వయముగనేలుచుండిన ప్రదేశములలోని ప్రజలు క్రమక్రమముగ నన్నివిషయములందు నభివృద్ధిగాంచఁదొడఁగిరి. దేశమును జయించినంతమాత్రమున లాభమేమియు లేదనియు ప్రజలను సుఖపడఁజేయుటయే సామ్రాజ్యస్థాపనకు తగినఫలమనియు ఇంగ్లీషువారునిశ్చయించి నిర్బంధసహగమనను శిశుహత్య నరబలులు లోనగు దురాచారములనుమాన్పి ప్రజలప్రాణములకును విత్తమునకును నపాయముగలిగించుచుండిన చోరులగుంపులను దునుమాడి వ్యవసాయోపయుక్తములగు జలాధారములనిర్మించి వ్యాపారమున కనుకూలించు రాజమార్గములను వేయించి విద్యావ్యాపనమునకై పాఠశాలలను కట్టించి పాశ్చాత్యనాగరికతలోని సద్ధర్మములనెల్ల దేశమందు వ్యాపింపఁజేయుచు ప్రజలకనేకవిధములుగ నుపచరించుచుండిరి. స్వదేశసంస్థానములోని ప్రజలిట్టిలాభములను పొందకపోవుటయేగాక అదివఱకు లేనికష్టములకుఁగూడఁ బాల్పడవలసివచ్చిరి. వారిదుస్థితికి కొంతవఱకు ఇంగ్లీషువారలే కారణభూతులు. వెలస్లీవిధించిన షరతులకులోఁబడి. స్వదేశరాజులు ప్ర



వర్తించుచుండువఱకు వారిరాజ్యములను శత్రుబాధలనుండి రక్షించుటకు ఇంగ్లీషువారొడంబడియుండిరి. ఈకారణముచే వారిలోననేకులు దిగులువిచారములులేక విధికృత్యములుగూడ మరచి ప్రజలనుండి పన్నులమూలమున వసూలుచేసిన యాదాయమునంతను స్వసుఖములకై వినియోగించుకొనుచు ఇంద్రియలోలురై కాలమునంతను వ్యర్థపుచ్చుచుండిరి. వారిని రక్షించుటకై ఇంగ్లీషువారు కంకణము గట్టికొనియున్నారనుభీతిచే వారుపెట్టుచుండినబాధల నోర్వలేకుండినప్రజలు వారిపై తిరుగఁబడుటకుజంకుచుండిరి. ఇట్టిసందర్భమున ఇంగ్లీషువారువీరియందుదయదలఁచినగాని వీరికష్టములు తొలఁగునట్లుండలేదు.

ఇంగ్లండులోని తూర్పిండియాసంఘమువారికి వ్యాపారకాంక్షయేగాని రాజ్యకాంక్ష లేనందున తమపైవిరోధమునుపూనక తామువిధించిన నియమములకు విధేయులైయుండు సంస్థానాధీశుల వ్యవహారములలో జోక్యముకలుగ చేసికొనుట యసంగతమని వారుభావించి వారు మన దేశమునకంపిన గవర్నరుజనరలులందఱిని, అనవసరముగ నట్టిజోక్యము గలిగించుకొనఁగూడదని యాజ్ఞాపించుచువచ్చిరి. కాని గవర్నరుజనరలులందఱు వీరితోనేకీభవింపలేదు. తమయెడల శత్రుత్వమువహింపలేదన్నమాత్రముచే ప్రజలనుహింసించుచుండు సామంతరాజులయెడ నుదాసీనులైయుండుట తగదనియు ప్రజలుపడుచుండుకష్టములనుచూచి సహించియూరకుండుట ఇంగ్లీషువారి ప్రతిష్ఠకుభంగకరమనియు పరిపాలనా సమర్థతలేని రాజులను తొలఁగించి వారిరాజ్యములను ఇంగ్లీషుసామ్రాజ్యములో చేర్చుట ధర్మ

విరుద్ధముకాదనియు వీరుతీర్మానించిరి. ఈకారణముచే 1823
తర్వాత స్వదేశరాజుల యధీనమైయుండిన రాష్ట్రములనేకము
లు ఇంగ్లీషువారికిచెందెను.

పైవిధముగ నాంగ్లేయపరిపాలనవలని లాభములను దేశము
లోని ప్రజలందఱనుభవింపవలయునని యుద్దేశించి స్వదేశసం
స్థానాధీశుల రాష్ట్రములను స్వపరిపాలనలోనికి తేఁబూనిన గవ
ర్నరుజనరలులలో నెల్ల 1848 మొదలు 1856 వఱకు మన దేశము
నుపాలించిన డల్‌హౌసీ ప్రధానుఁడు. ఇతనియుద్దేశములు సుల
భముగ నెరవేరుటకు కొన్నియవకాశములుగూడ నాకాలమం
దుండెను. ఆంగ్లేయులకులోఁబడి ప్రవర్తించుచుండిన సంస్థా
ధీశులలో ననేకులు సంతానములేనివారైయుండిరి. వీరుగతిం
చినతర్వాతవీరిరాష్ట్రములనన్నిటిని డల్‌హౌసీ స్వాధీనముచేసి
కొనెను. ఔరసపుత్రులులేనపుడు దత్తస్వీకారము చేసికొనవ
చ్చునని వీరిలోకొందఱువాదించినను వారివాదము చట్టమునకు
ను ఆచారమునకుఁగూడ విరుద్ధమైనదని ఇతఁడుతీర్మానించెను.
ఈవిధముగ ఇంగ్లీషువారిని చెందినరాష్ట్రములలో ప్రధానము
లైనవి నాగపూరు సతారా ఝాన్సిరాజ్యములు. నాగపూరు
లభించుటచే బొంబాయినుండి కలకత్తాకు రాకపోకలు సుల
భమయ్యెను.

డల్‌హౌసీ వశముచేసికొనిన రాజ్యములలో మరియొకటి అ
యోధ్య. దీనిపరిపాలకులు తొంబదిసంవత్సరములనుండి ఇంగ్లీ
షువారికి మిత్రులుగనుండిరి. కానిరానురాను వీరిపరిపాలన



మిక్కిలియతృప్తికరమగుచువచ్చెను. పెక్కుమార్లు ఇంగ్లీషు
వారీవిషయమై వారినిమందలించుచు ప్రజలస్థితిగతులను బా
గుపరుపవలసినదని సలహానొసఁగియుండిరి. కాని యీమాట
నువారుగమనింపక వారిచిత్తానుసారముగ ప్రవర్తించుచు ప్ర
జలననేకవిధములుగ హింసించుచుండిరి. ఇందుచే మంచిమా
టలవలన ఫలములేదని 1856 లో అయోధ్యనంతను డల్
హౌసీ ఇంగ్లీషురాష్ట్రములో చేర్చెను.

1823 తర్వాత మరికొన్నిరాష్ట్రములు యుద్ధములమూల
మున ఇంగ్లీషువారినిచెందెను.

ఆకాలమందు బర్మాదేశమంతయు నొకప్రభువుయధీన
మైయుండెను. ఈప్రభువులలో కొందఱు మనదేశమును ప్ర
వేశించి ఆసాంరాష్ట్రమును, దానిసమీపమందలి మరికొన్నిప్ర
దేశములనుజయించి 1824 ప్రాంతమున బంగాళారాష్ట్రపు సరి
హద్దులలోనున్న ఇంగ్లీషువారిద్వీపము నొకదానిని వశముచేసి
కొని బంగాళమునుండి వారిని తరిమివేయుటకుఁగూడ ప్రయ
త్నింపసాగిరి. ఈకారణముచే 1824 మొదలు 1826 వరకు
మొదటి బర్మాయుద్ధముజరిగెను. అందులో బర్మావారపజయ
మొంది ఆసాం అరకాన్ టెనాసరీం రాష్ట్రములను ఇంగ్లీషువా
రికిచ్చిరి. మరికొన్నిసంవత్సరముల తర్వాత వారిరాజ్యమందు
వ్యాపారముచేయుచున్న ఇంగ్లీషువర్తకులకు వారునష్టముగలి
గించుటచే 1852 లో రెండవబర్మాయుద్ధము జరిగెను. ఇందు
లోఁగూడ ఇంగ్లీషువారికి జయము లభించినందున లోయర్
బర్మారాష్ట్రమంతయు వారియధీనమయ్యెను.

1842 లో సింధుదేశమును పరిపాలించుచుండిన నవాబులతో యుద్ధముచేసి దానినంతను ఇంగ్లీషువారు తీసికొనిరి.

కాని యీకాలమున జరిగిన యుద్ధములన్నిటిలో శిక్కులతో జరిగిన రెండుయుద్ధములు మిక్కిలిముఖ్యములైనవి. శిక్కులనఁగా శిష్యులనియర్థము. ప్రథమమున వీరునానక్ అను మతాచార్యునిశిష్యులై మతమందే యాసక్తిగలిగియుండినరు. పదునేడవశతాబ్దమున మొగలాయిచక్రవర్తులు కొందఱు వీరిగురువులనువధించి వీరిమతమును నిర్మూలముచేయనెంచినందున స్వమతసంరక్షణార్థమై వీరందఱు యుద్ధవృత్తినవలంబించి పదునెనిమిదవశతాబ్దాంతమున నిరుపమానయోధులను ప్రఖ్యాతిగాంచిరి. వీరునిరంతరము తురకలతోఁ బోరి తుదకు పంజాబురాష్ట్రములో స్వతంత్రరాజ్యములు కొన్నిటిని స్థాపించుకొనిరి. 1799 లో వీరాగ్రేసరుఁడగు రంజితసింగు లాహోరునకు రాజై క్రమక్రమముగ శిక్కురాజ్యములన్నిటినిజయించి పంజాబుపై నిరంకుశాధికారమువహించి మరికొంతకాలమునకు తురకలవశమందుండిన కాశ్మీరరాజ్యమును పెషావరుదుర్గమును గూడ సంపాదింపఁగలిగెను. ఇతఁడితర సంస్థానాధీశులవలెఁగాక ఇంగ్లీషువారియెడల గౌరవముగలవాఁడై వారితో సంధిగావించుకొని స్నేహభావముతో ప్రవర్తింపుచుండెను. తనరాజ్యమును శక్తిసామర్థ్యములతో పాలించుటయేగాక శిక్కుసైన్యములను వృద్ధిచేసి యూరోపియన్ యుద్ధపద్ధతులను వారికి నేర్పి సమయమువచ్చినపుడు ఇంగ్లీషువారితోఁగూడ సమానముగ యుద్ధము చేయశక్తిగలవారినిగ తర్ఫీదుచేసియుంచెను.



ఇతఁడు 1839లో కాలధర్మమొందెను. అదిమొదలుశిక్కురాజ్యమందల్లరులధికమగుటచే సైన్యములను స్వాధీనమందుంచుకొనుటకుఁగూడ రాజులకు శక్తిలేకపోయెను. ఇట్టిసందర్భమున సైనికులు స్వాతంత్ర్యమును పూని చిత్తానుసారముగ రాజులనుచంపుచు క్రొత్తవారికి పట్టముగట్టుచు ఇంగ్లీషువారియెడల రంజితసింగుచూపిన స్నేహభావమునుమరచి 1845లో పంజాబునకు తూర్పుభాగమందుండిన ఇంగ్లీషు రాష్ట్రముపై దండెత్తివచ్చిరి. ఈకారణముచే మొదటిశిక్కుయుద్ధము ప్రారంభమయ్యెను. సహజముగ పరాక్రమవంతులైన శిక్కులు మిక్కిలినేర్పుతో యుద్ధముచేసినను సైన్యాధిపతులతో నైకమత్యము లేనందున తుదకువారు పరాజయమొంది కాశ్మీరములోనగు కొన్నిపరగణాలను ఇంగ్లీషువారికిచ్చి ఇంగ్లీషురాయబారి సలహానుసరించి రాజ్యమును పరిపాలించుకొనుట కొప్పుకొనిరి. కాని ఇంగ్లీషువారియెడల విరోధమనుమాత్రము వారువిడువలేదు, సులభముగ జయమును సంపాదింపవచ్చుననిగూడ వారునమ్మియుండిరి. ఈకారణముచే వారు మొదటియుద్ధము ముగిసిన రెండుసంవత్సరముల లోపుగనే రెండవ యుద్ధమునకు 1848లో పూనిరి. దీనియందు ప్రథమమున ఇంగ్లీషువారికపజయమును నష్టమునుసంభవించెను. కాని వారుపట్టువదలమానక శిక్కుసైన్యములను తాఁకుటచే తుదకుజయమును సంపాదించిరి. అప్పుడు మన దేశమునకు డల్‌హౌసీ గవర్నరు జనరలుగనుండెను. స్వదేశసంస్థానములనిన నేమియునిష్టపడని ఇతఁడుపంజాబునంతను ఇంగ్లీషుపరిపాలనలోనికి తెచ్చెను. ఈయుద్ధముతో మన

దేశమంతయు ఇంగ్లీషువారి స్వాధీనమయ్యెను.

ఇంగ్లీషువారు మన దేశమునకు వర్తకులుగవచ్చిరి. అట్లువచ్చినతర్వాత నూటయేఁబది సంవత్సరములవఱకు వర్తకులుగనే యుండిరి. ఫ్రెంచివారు వీరివర్తకమును భంగపరుపసమకట్టి స్వదేశరాజులను వశపఱచుకొనయత్నించినందున ఇంగ్లీషువారుగూడ నట్లే చేయవలసివచ్చెను. 1763నాటికి వీరు ఫ్రెంచివారిని పూర్తిగ నోడించి కర్ణాటమందును బంగాళమందును స్వాధికారమును స్థాపించుకొనిరి. తర్వాత మైసూరు నిజాం మహారాష్ట్రులు శిక్కులులోనగు స్వదేశరాజుల నొకరితర్వాత నొకరినోడించి ప్లాసీయుద్ధముజరిగితర్వాత నూరుసంవత్సరములలో దేశమునకంతకు సార్వభౌములైరి. ఈవిధముగ క్లైవుప్రతిష్ఠించినపునాది నాధారముచేసికొని వారన్ హేస్టింగ్సు వెలస్లీ హేస్టింగ్సు డల్హౌసీప్రభువులు కడునేర్పుతో ఆంగ్లేయసామ్రాజ్య భవనమును సుస్థిరముగ నిర్మాణముచేయఁగలిగిరి. స్వల్పసైన్యములతో నింతస్వల్పకాలమున మన దేశమంతటి విస్తీర్ణాధిక్యమును జనబాహుళ్యమునుగల దేశమును జయించినవారు మరియొకరు లేరు. కావుననే అద్భుతకార్యములలో నొకదానిగ దీనినెల్లరు పరిగణించుచున్నారు.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము.

## పదునాలుగవ ప్రకరణము.

1763 లో ముగిసిన సప్తసంవత్సరయుద్ధమువలన కనడా ఇంగ్లీషువారిస్వాధీనమయ్యెను. అప్పటికిరాష్ట్రమున ఫ్రెంచివారు మాత్రమే కాపురముచేయుచుండిరి. మతమందును భాషయందును ఆచారవ్యవహారములందును వీరికిని పరిపాలకులైన ఇంగ్లీషువారికిని సంబంధమేమియు లేనందున వీరు ప్రభుత్వమువారిపై తిరుగఁబడి కలహింతురేమోయనుభయము మొదటకొంతవఱకుండెనుగాని 1774 లో పార్లమెంటువారొక చట్టముచేసి ఫ్రెంచివారి సాంప్రదాయసిద్ధములగు మతాచారములకు లోపము కలుగకుండునట్లు పరిపాలించుట కొడంబడుటచేత ఫ్రెంచిప్రజలందఱు సంతృప్తినొంది విధేయులై ప్రవర్తింపసాగిరి. 1776లో అమెరికన్ కాలనీలవారు స్వాతంత్ర్యమునకై మాతృదేశమగు ఇంగ్లండుతో యుద్ధమునకుపక్రమించి కనడానుగూడ ఇంగ్లీషుప్రభుత్వమునుండి వేరుచేసి తమలోచేర్చుకొనను ద్దేశించి దానిపై ననేకపర్యాయములు దాడివెళ్లిరిగాని ఫ్రెంచివారుమాత్రము వారితోనేకీభవింపక వారినిపారదోలుటయందు కొంతదూరము ఇంగ్లీషు ప్రభుత్వమువారికి తోడ్పడిరి. కావున నీయుద్ధము ముగియునప్పటికి అమెరికాలోని ఆంగ్లేయ

సామ్రాజ్యమునకు విస్తారమగునష్టము సంభవించినను కనడా యందుమాత్రము ఇంగ్లీషుపరిపాలనము సుస్థిరముగ స్థాపింపఁ బడినదని చెప్పుట కవకాశము కలిగెను.

ఈయుద్ధమువలన కనడాకు నష్టము కలుగకపోవుటయేగాక ఒకవిధముగ నపరిమితమగు లాభముకూడ చేకూరెను. ఇది యధర్మయుద్ధమనియు మాతృదేశముతోడిసంబంధముఁ దుత్రెంచుకొనుట యుక్తము కాదనియు పదుమూడు కాలనీలవారిలోఁ కొందఱూహించి ఆంగ్లేయసామ్రాజ్యమునుండి విడిపోవుటకిష్టపడక యుద్ధమందు ఇంగ్లీషువారిపక్షమవలంబించి శక్తికొలఁది పోరిరి. కాని తుదకు విజయము అమెరికన్లకు సమకూరుటవలన వారు ఇంగ్లీషుపక్షమువారినందఱిని దేశద్రోహులుగభావించి వారిభూములనుధనధాన్యములనపహరించి వారిని దేశమందుండనీకతరిమివేసిరి. అప్పుడుఇంగ్లీషువారు వారివిషయమున మిక్కిలిజాలిగొని తమకై సర్వస్వము దారపోసినవారిని కష్టములపాలుగాకుండ రక్షించుటవిధియనియెంచి తమరాష్ట్రములలో మరియొకప్రదేశమున వారలకుభూములొసంగి తగువిధముగ ద్రవ్యసహాయముచేయుటకుఁగూడ నంగీకరించిరి. ఈకారణముచే యునైటెడ్‌స్టేట్సునుండి తొలఁగింపఁబడినవారు "సంయుక్తసామ్రాజ్యభక్తు"లను పేరుతో (సామ్రాజ్యములోని రాష్ట్రములన్నియు విచ్ఛేదముగాక కలసియుండుటకై పాటుపడినవారనియర్థము) ఇంగ్లీషురాష్ట్రములందుప్రవేశించి కొందఱునావస్కోషియాయందును కొందఱుదానికి పశ్చిమముగ న్యూబ్రన్స్వికునందును తక్కినవారు ఫ్రెంచి కనడాకు పశ్చిమభాగ



పొందునుకాపురము లేర్పరచుకొనిరి. వీరిలో నలువదివేలజనము కనడాలో చేరుటవలన నదివఱకు ఫ్రెంచివారికిమాత్రమే నివాసభూమియైయుండిన యీరాష్ట్రమిదిమొదలు ఇంగ్లీషువారికిఁ గూడ కాపురపుస్థలమయ్యెను. ఇట్లుకొంతకాలము గడచినతర్వాత కనడాలోనిభూమి మిగులసారవంతమైనదని తెలియుటచే యునైటెడ్‌స్టేట్సులోనుండి యనేకులు స్వదేశమునువదలి దీనియందు నివసింపసాగిరి. కాలక్రమమున ఇంగ్లీషువారి సంఖ్య వృద్ధికాఁజొచ్చెను. పార్లమెంటువారు దీనినిగ్రహించి 1791లో నొకచట్టముచేసి కనడాను అప్పరు (ఇంగ్లీషు) కనడాయనియు లోయరు (ఫ్రెంచి) కనడాయనియు విభజించి ఒక్కొకరాష్ట్రమునకును ప్రత్యేకముగ నొకగవర్నరును నొకశాసన నిర్మాణసభను నేర్పరచిరి. ఈసభకు రెండుశాఖలుండెను. ఒకదానిలోనిసభ్యులను ప్రజలెన్నుకొనుచుండిరి. మరియొకదానిలోని వారిని గవర్నరు నియోగించుచుండెను. ఈవిధముగ నదివఱకు ఇంగ్లీషుకాలనీలలోని యాచారముననుసరించి కనడాలోఁగూడ ప్రజాప్రతినిధి పరిపాలనపద్ధతి స్థాపింపఁబడెను.

ఇట్లు కొంతకాలము గడచినపిమ్మట నెపోలియనుతో ఇంగ్లీషువారొనరించుచుండిన మహాసంగ్రామములో నంతర్గతమైన యుద్ధమొకటి యునైటెడ్‌స్టేట్సువారికిని ఇంగ్లీషువారికిని 1812లో సంప్రాప్తమయ్యెను. కనడానుజయించి తమదేశములో కలుపుకొననెంచి యునైటెడ్‌స్టేట్సువారు సైన్యముల ననేకపర్యాయములు దానిపైకంపిరి. కాని కనడాలోని ప్రజలందఱు పరస్పరవైషమ్యములనెల్లవిడిచి శత్రుసైన్యములనుపట్టుదలతో

నెదుర్కొని యుద్ధరంగమున నపరిమితమగు శౌర్యపరాక్రమములుచూపి శత్రువులను తరిమివేసి స్వాతంత్ర్యమును కాపాడుకొనుటయేగాక శత్రుదేశమును ప్రవేశించి కొన్నిగ్రామములనుగూడ వశపరచుకొనిరి. ఈయుద్ధముముగిసి నూరుసంవత్సరములకంటె నధికమైనను కనడాలోని ప్రజలిప్పటికిఁగూడ దానిలోకడుసాహసమునుచూపి శత్రులతోఁ బోరి ప్రాణత్యాగము చేసిన వారిపూర్వులను స్తుతిపూర్వముగ పేర్కొని వారిపరాక్రమమును సంస్మరించుకొనుచున్నారు.

నెపోలియనుతో ఇంగ్లీషువారుగావించిన యుద్ధము సాంతమైనపిమ్మట ఇంగ్లండులోనుండి యనేకులు కనడాకురాసాగిరి. యుద్ధకాలమున సైన్యమందును నౌకాబలమందును చేరినవారిలోననేకులు యుద్ధాంతమున జీవనోపాయములులేక ఇంగ్లండునువదలిపెట్టిరి. ఇదిగాక 1815 తర్వాత ఇంగ్లండుదేశములోని వ్యవసాయము శిల్పములులోనగు వానియందనేకములగు మార్పులుకలుగుటచే కూలివాండ్రకు పనిదొరుకుట దుస్సాధ్యమగుచుండెను. జనసంఖ్య వృద్ధియగుచుండుటవలనఁగూడ ననేకులు పేదవారై కష్టములపాలగుచుండిరి. ఇట్టిసందర్భమున 'కాలనీలలోనికి వెళ్లినయెడల తమజన్మము కృతార్థత చెందునని యనేకులభిప్రాయపడి వేనవేలుగ 'కనడా'లోనగు కాలనీలలో ప్రవేశింపమొదలిడిరి. ఈకారణములచే 'కనడా'లోని ఇంగ్లీషువారిసంఖ్య రానురాను వృద్ధియగుచువచ్చెను.

కాని దీనివలన ప్రథమమున కనడాలోని ప్రజలలోపరస్పరవైషమ్య మధికమయ్యెను. లోయర్ కనడాలోనివారిలో



నాల్గువంతులు ఫ్రెంచివారుగను ఒకవంతు ఇంగ్లీషువారుగను నుండిరి. కాని ఉద్యోగములన్నియు ఇంగ్లీషువారి స్వాధీనమందుండెను. శాసననిర్మాణసభలో ఫ్రెంచిసభ్యులసంఖ్య అధికముగనుండినను పన్నులవిధించుట లోనగువిషయములలో వారికివిస్తారమగు నధికారములేనందున పరిపాలనపద్ధతులలో సవరణలను చేయవలసినదని ఫ్రెంచివారు కోరుచుండిరి. మొత్తముమీద ఫ్రెంచివారికిని ఇంగ్లీషువారికిని మామూలువ్యవహారములందుఁగూడ పొసఁగక పరస్పరవిరోధము దినదినాభివృద్ధి గాంచఁదొడఁగెను. తుదకు వారిలోకొందఱు ఆంగ్లేయప్రభుత్వమును తొలఁగించి యునైటెడ్ స్టేట్సు వారివలె ప్రజాపరిపాలనమును స్థాపించుకొననుద్దేశించి 1837 లో ఇంగ్లీషువారిపై తిరుగఁబడిరి. కాని దీనివలన వారికేమియులాభములేకపోయెను. ఇట్లే అప్పరుకనడాలోఁగూడ ప్రజలలో రెండుకక్షలేర్పడి కలహములకు కారణమాయెను. సంయుక్తసామ్రాజ్యభక్తుల కుటుంబములలోచేరిన వారందఱు తామగ్ర జాతులవారమనిభావించి తర్వాతవచ్చిన ఇంగ్లీషువారినధములుగ గణించుచుండిరి. ఉద్యోగములన్నియు వారివశమందుండెను. ప్రశస్తములగు భూములకన్నిటికి వారధికారులైయుండిరి. కావున తక్కినఇంగ్లీషువారలీయాధిక్యము నిష్టపడక 1837లో వారిలో కొందఱుకలహించిరి. ఒకేసమయమున రెండుకలహములుజరుగుటచే పార్లమెంటువారు దీనికేవియో తగినకారణములుండవలయునని యూహించి 1839 లో విశాలహృదయుఁడగు డర్హాం అనువానిని వీనివిషయమై విచారించుట కంపిరి.

కమునిపుణతతోడను శక్తిసామర్థ్యములతోడను నతఁడు కార్యమునునిర్వహించి రెండుకనడాలును నొకరాష్ట్రముగకలిపి అందఱకు తృప్తికరముగ శాసననిర్మాణసభనుస్థాపించి దానికిసంపూర్ణస్వాతంత్ర్య మియ్యవలసినదని పార్లమెంటువారికి సలహానిచ్చెను. దీనిననుసరించి 1840లో పార్లమెంటువారు చట్టము చేసి డర్హాంయుద్దేశములనన్నిటిని నెరవేర్చిరి. అది మొదలు కనడాలోనివారందఱు పరిపాలన స్వాతంత్ర్యముగలవారై పరస్పరవైషమ్యములుమాని సోదరులవలె ప్రవర్తింపసాగిరి.

1840 తర్వాత కనడా నోవస్కోషియా న్యూబ్రన్స్విక్ కాలనీలతివేగముగ నన్నివిషయములందు నభివృద్ధి గాంచఁజొచ్చెను. ఇంగ్లండునుండియు తక్కిన దేశములనుండియు ప్రజలధికముగ వచ్చిచేరుటవలన నిరువదిసంవత్సరములలో జనసంఖ్య మూఁడురెట్లు హెచ్చెను. పశ్చిమభాగమందు అడవులనుబాగుచేసి ప్రజలలో ననేకులచట కాపురము లేర్పరచుకొనసాగిరి. ప్రభుత్వమువారు విస్తారముగ ద్రవ్యమునుఖర్చిడి బాటలు కాలువలు ఇనుపదారులులోనగు ప్రయాణ సౌకర్యములను వృద్ధిచేసిరి. వాయవ్యభాగమందలి ప్రదేశములు గోధుమలపంటలకు మిక్కిలియనుకూలించినవగుటచే కర్షకులనేకులా ప్రాంతములకువెళ్లి వ్యవసాయమువలన నధికలాభము సంపాదింపఁదొడఁగిరి. పసిఫిక్ మహాసముద్రపు తీరమందున్న పరగణాలలో బంగారులోనగు లోహపుగనులు దొరుకుటవలన కొందఱాప్రదేశములయందునివాసముల నేర్పరచుకొనిరి. ఈవిధముగ కాలక్రమమున పసిఫిక్ అట్లాంటిక్ మహా



సముద్రములమధ్యనుండు భూభాగమందంతటజనులువ్యాపింపదొడఁగిరి.

కావున నీప్రదేశములోని కాలనీలలో ప్రత్యేకముగ నొక్కొకదానికి నొక్కొకప్రభుత్వముండుటకు మాఱుగ వీనినన్నిటి నొకటేప్రభుత్వమునకు లోఁబడునట్లుచేయుట లాభకరమని యనేకులభిప్రాయపడిరి. దీనివలన యునైటెడ్ స్టేట్సువారిమూలమున సంభవించు నపాయములనుండి తప్పించుకొనుటగూడ సులభమగునని వారూహించిరి. పార్లమెంటువారుగూడ దీనికంగీకరించి 1867 లో నొకచట్టమును చేసి కనడారాష్ట్రములో అప్పర్ కనడా లోయర్ కనడా న్యూబ్రన్స్విక్ నోవస్కోషియా కాలనీలచేర్చిరి. ఇట్టిసంయోగమువలన వ్యాపారమభివృద్ధియై ప్రజలైశ్వర్యవంతులగుటలో మిక్కిలితోడ్పడెను. ప్రజలు నలువైపుల వ్యాపించుటవలన క్రొత్తకాలనీల నేర్పరచి వానినిగూడ కనడారాష్ట్రములోచేర్చుట యవసరమయ్యెను. రాకీపర్వతములకావల బ్రిటిష్ కొలంబియా కాలనీయేర్పడి 1871 లో కనడాలోచేరెను. అప్పర్ కనడాకును రాకీపర్వతములకును మధ్యనుండుప్రదేశము పశువులమందలు వృద్ధియగుట కెంతయో యనుకూలించుటచే నచటఁగూడ రెండుకాలనీలు ప్రత్యేకముగనేర్పడెను. ప్రస్తుతము కనడాలో న్యూఫౌండులాండుకాలనీతప్ప ఉత్తరఅమెరికాయందలి ఇంగ్లీషు కాలనీలన్నియు చేరియున్నవి. ప్రజలయందు సంఘీభావము సంపూర్ణముగ నెలకొనియున్నది. తమదేశమగు కనడాను ప్రపంచమందు ప్రఖ్యాతిగాంచిన దేశములలో నొకదానినిగ చేయ

వలయునను కుతూహలమువారియందు మెండుగనున్నది. ధనము సంపాదించుటకును కళలను వృద్ధిచేసికొనుటకును వారికిసదుపాయము లెన్నియోయున్నవి. ఆంగ్లేయసామ్రాజ్య పరిపాలకులయెడ భక్తిగలిగి అవశ్యకమైనపుడెల్ల వారికుత్సాహ పూర్వముగ శక్తికొలఁది సహాయమొనర్చుచు సామ్రాజ్యగౌరవమును కాపాడసంసిద్ధులైయున్నారు. సామ్రాజ్యములో తెల్లవారునివసించురాష్ట్రములలోనెల్ల నిప్పటికిది యగ్రస్థాన మలంకరించియున్నది. ఎటుచూచినను భావికాలమందు కనడా రాష్ట్రమునిరుపమానమగుశోభను సంపాదించిసామ్రాజ్యమునకు స్థిరమగుకీర్తిని తేఁగలదని చెప్పనొప్పియున్నది.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## పదునైదవ ప్రకరణము.

నెపోలియనుతో నొనర్చిన దీర్ఘయుద్ధమువలన నదివఱకు డచ్చివారియధీనమైయుండిన కేప్ కాలనీ ఇంగ్లీషువారివశమై ఇండియాతో వ్యాపారము చేయువారి కెంతయోయనుకూలించియుండెను. అప్పటికి దానియందు సుమారిరువదియైదు వేల డచ్చివారు కాపురముచేయుచుండిరి. వ్యవసాయమే వీరికి ప్రధానమగు జీవనోపాయమగుటచే బోయర్ లను పేరు (బోయర్ అనగా వ్యవసాయము చేయువాఁడని యర్థము) వీరికికలిగెను. వీరికి స్వాతంత్ర్యమం దపరిమితమగు ప్రేమ. సాంప్రదాయ సిద్ధములగు నాచారములను విడిచిపెట్టుటగాని యెంత శ్రేష్ఠములయినను క్రొత్తవానిని స్వీకరించుటగాని వీరికిఁబొత్తిగనిష్టములేదు. జాత్యంతరులందఱు తమకంటె తక్కువవారనియు వారినిసమానులవలె నాదరించుట యాత్మగౌరవమునకు లోపముకలిగించుననియు వీరెల్లప్పుడూహించుచుండువారు. ఇట్టిస్వభావలక్షణములు గలవారికి 1815 లో ఇంగ్లీషువారు పరిపాలకులైరి. యూరోపియన్లు స్థిరముగ నివసించుటకు కేప్ కాలనీ మిక్కిలితగియున్నందున కాలక్రమమున ఇంగ్లీషువారలనేకులచటికివెళ్ళి కాపురముచేయఁదొడఁగిరి. ఈకారణముచే కనడాయందువలెనే యీకాలనీయందుగూడ ఇంగ్లీషు

వారు మరియొకయూరోపియన్జాతివారిపొరుగున నుండవలసివచ్చెను.

కాని మొదటినుండియు ఇంగ్లీషువారికిని బోయర్లకును పొత్తుకుదురలేదు. దీనికనేకకారణములుకలవు. ఇంగ్లీషువారు వారిప్రభుత్వమును స్థాపించినతర్వాత కొంతకాలమునకు డచ్చివారలవాటుపడియుండిన పరిపాలనపద్ధతులలో కొన్నికొత్తసవరణలను చేయుటయేగాక వ్యవహారములందందఱు ఇంగ్లీషుభాషను వాడవలసినదనిశాసించిరి. ఈమార్పులలో కొన్ని ప్రజలందఱికి లాభకరములైయుండినను బోయర్లుమాత్రము వానినంగీకరింపరైరి. ఇదిగాక మఱికొన్ని విషయములందుఁగూడ వారికిని పరిపాలకులకును నభిప్రాయభేదములుకలిగెను. కేప్ కాలనీలో ననాగరికులగు నల్లజాతివారనేకులుండిరి. బోయర్లు వీరందఱిని మృగప్రాయులుగభావించి మోటువారగు వీరిని మోసపెట్టుటయు వీరితోనబద్ధములాడుటయు వీరికిమానభంగము గావించుటయు తప్పుకాదనితలఁచి ఇంగ్లీషువారు రాకపూర్వమువీరియెడల నధికమగుక్రౌర్యమును చూపుచుండిరి. ఇంగ్లీషువారిదియన్యాయమని యూహించి బోయర్లను నల్లవారిని నొకేవిధముగ నాదరించుచు రాజకీయవిషయములందందఱికి సమానములగుహక్కులనొసంగిరి. ఇట్లుండఁగా 1833 లో పార్లమెంటువారు ఆంగ్లేయసామ్రాజ్యమందు బానిసలుండఁగూడదను చట్టమొకదానిని చేసిరి. అప్పటికి బోయర్లస్వాధీనమందు ముప్పదివేలబానిసలుండిరి. వీరినిడబ్బిచ్చి కొనిన కారణముచేతను వ్యవసాయములోనగు పనులను నిర్వర్తించుటకు



వీరిసహాయమావశ్యకమై యున్నందునను వీరిని విడిచిపెట్టుటకు బోయర్లు యిష్టపడరైరి. నష్టపూరణముగ కొంత ద్రవ్యము నిచ్చుటకు ప్రభుత్వమువారంగీకరించి బానిసలనందఱిని విడుదలచేసిరికాని కోరినంతద్రవ్యము ముట్టకపోవుటచేత బోయర్లు క్రోధపూరితులై ప్రవర్తింపసాగిరి. ఇదియేసమయమున కేప్ కాలనీకి తూర్పుదిక్కుగనుండునట్టియు భయంకరులును పౌరుషవంతులునునగు "కాఫర్" జాతివారు స్వాధికారమును వ్యాపింపచేసికొననెంచి ఇంగ్లీషురాష్ట్రముపై దండెత్తివచ్చిరి. అప్పుడు ఇంగ్లీషువారు వారినోడించిరిగాని వారినితమవశమందుంచుకొనుటకు బదులుగ వారికిస్వాతంత్ర్యమిచ్చి వదలిపెట్టిరి. ఇందువలన బోయరులు మరింతకోపావేశము గలవారైరి. కేప్ కాలనీలలోని నల్లవారికి తమతోసమానముగ హక్కులనిచ్చుటయు దానికావలనుండి తమ్మునుబాధించుచున్న నల్లవారపజయమొందినను వారికి స్వాతంత్ర్యమొసఁగుటయు వారికెంతయో చిన్నఁదనముగనుండెను. ఇట్టియన్యాయమును మానభంగమును భరించుటకంటె ఇంగ్లీషువారి పరిపాలనను వదలి ప్రదేశాంతరములకు వెళ్లుట యుచితమని 1836 మొదలు వారావిధముగ చేయఁబూనిరి.

ఈవిధముగ కేప్ కాలనీని విడిచిపెట్టిన బోయర్లలో కొందఱీశాన్యముగ ప్రయాణముచేసి ఆరెంజినదినిదాటి దానికిని వాల్ నదికిని మధ్యనున్న ఆరెంజిరాష్ట్రమును చేరిరి. మరికొందఱు వాల్ నదినిగూడ దాటి దానికుత్తరముగ ట్రాన్స్వాలును ప్రవేశించిరి. కొందఱు నెటాలును వశపరచుకొననెంచి యచ

టికివచ్చిరి. కాని నెటాలు సముద్రతీరమందుండు రాష్ట్రమగుటచేతను వ్యాపారమునకు మిక్కిలి యోగ్యమైయున్నందునను నదివఱకే కొందఱు ఇంగ్లీషువారచట నివసించియుండిరి. బోయర్లరాకను వారుసమ్మతింపక వారిపై యుద్ధమునకు కడఁగి 1842లో వారినోడించిరి. 1843 మొదలు నెటాలుకాలనీ ఇంగ్లీషువారిస్వాధీనమయ్యెను. ఈవిధముగ నాశాభంగముచెందిన బోయర్లు వచ్చినదారిపట్టి వెనకకువెళ్లి తుదకు ఆరెంజిరాష్ట్రమున కొందఱును ట్రాన్స్వాలులో తక్కినవారునుచేరిరి. ఈ రెండుబోయర్ రాష్ట్రములనుగూడజయింప ఇంగ్లీషువారు సమర్థులైయుండినను ఇంగ్లండులోని ప్రభుత్వమువారట్లు చేయుటకు సమ్మతింపక వానినిస్వతంత్రరాష్ట్రములుగ నెంచుట కంగీకరించిరి.

కాని కాలక్రమమున ఆరెంజినదికావలగూడ ఇంగ్లీషువారిసామ్రాజ్యము వ్యాపింపవలసివచ్చెను. దక్షిణఆఫ్రికాయందచ్చటచట శూరులగు నల్లజాతివారలనేకులుండిరి. 1867 ప్రాంతమున వారిలోనొకరగు బసూటావారికిని ఆరెంజిరాష్ట్రములోని బోయర్లకును యుద్ధముసంప్రాప్తింపఁగా వారు ఇంగ్లీషువారి సహాయమునుకోరిరి. ఆంగ్లేయులు దీనికంగీకరించి "బసూటా"రాష్ట్రము బోయర్ల స్వాధీనముగాకుండ స్వవశమునుచేసికొనిరి. 1869లో ఆరెంజిరాష్ట్రమునకు పశ్చిమముగ కింబర్లేజిల్లాయందు ప్రశస్తములగు వజ్రపుగనులుదొరకెను. వానిలోపనిచేసి విస్తారముగులాభమును సంపాదింపనెంచి ఇంగ్లీషువారనేకులచటికివెళ్లి నివసింపఁదొడఁగిరి. అందుచే నాజిల్లా



సంతను ఇంగ్లీషుప్రభుత్వమువారు స్వాధీనపరచుకొని ఆరెంజిరాష్ట్రపుబోయర్లది తమరాష్ట్రములోనిదని వాదింపఁగా వారికి కొంతద్రవ్యమిచ్చి తృప్తిపరచిరి. కావున సందర్భములుమారుటచేత కేప్ కాలనీ నెటాలులేగాక మరికొన్ని జిల్లాలుకూడ నాంగ్లేయుల పరిపాలనలోనికివచ్చెను.

ఇట్లుండఁగా స్వాతంత్ర్యమనుభవింప నుద్దేశించి ఇంగ్లీషువారిసంబంధమునువదలుకొని ట్రాన్స్వాలులో చేరిన బోయర్లస్థితి దినదినమునకు క్షీణింపఁదొడఁగెను. వారిలోవారికైకమత్యమతిస్వల్పముగనుండుటయేగాక స్వయముగ వారు స్థాపించుకొనిన ప్రభుత్వమునకులోఁబడి ప్రవర్తించుటకుఁగూడ వారిలోననేకులు సమ్మతింపకుండిరి. ఖర్చులకు కావలసినంత సొమ్ము పన్నులమూలమున వసూలగుట దుస్తరమైనందున ప్రభుత్వమువారు అప్పులపాలగుచుండిరి. ఈకారణములచే రాష్ట్రమందంతట నరాజకము ప్రబలఁదొడఁగెను. ఇట్టిస్థితిలో వీరికిని వీరిపొరుగునందుండిన "జూలూ"జాతివారికిని యుద్ధముసంప్రాప్తమగునట్లుండెను. జూలూలు మిక్కిలి పరాక్రమవంతులు; వారిసంఖ్యగూడ నధికముగనుండెను. కావున వారికిని బోయర్లకును యుద్ధమారంభమైనయెడల నందులో బోయర్లపజయమొందుటలో సందేహమేమియు కన్పడలేదు. జూలూలు ట్రాన్స్వాలును స్వాధీనపరచుకొనినయెడల ఇంగ్లీషురాష్ట్రములలోని నల్లవారుగూడ వారిపైతిరుగఁబడి లేనిపోనికష్టములు గలిగింతురని ఇంగ్లీషువారూహించి 1877లో జూలూవారిస్వాధీనముకానున్న ట్రాన్స్వాలును ఆంగ్లేయసామ్రాజ్య

ములో చేర్చిరి. అందు పైనదివఱకు మిత్రులుగనుండిన జూలూలు యుద్ధమునకుపక్రమింపఁగా కొంచెము కష్టముపైని 1879 లో ఇంగ్లీషువారు వారినిగూడ జయించిరి. కాని బోయర్లకు మాత్రము ఇంగ్లీషువారియెడల కృతజ్ఞత లేశముగూడ లేకుండెను. వారు జోక్యము కలుగఁజేసికొనకుండినయెడల తాము జూలూలస్వాధీనమైపోవుట తప్పియుండదనుమాట వారుపూర్తిగ మఱచి స్వాతంత్ర్యమును సంపాదించుకొనుటకై ప్రయత్నములనుచేయుచు తుదకు 1881 లో యుద్ధమారంభించి మజూబా కొండవద్ద నొకఇంగ్లీషుసైన్యము నోడించిరి. అప్పుడు మహానీయుఁడగు గ్లాడ్స్టన్ ఇంగ్లండునకు ప్రధానమంత్రియై యుండెను. బోయర్లను జయించుటకష్టముకాదని యెఱిఁగియు నతఁడు మెత్తనిహృదయముగలవాఁడగుటచే వారికోరికల నెరవేర్ప నిశ్చయించి ట్రాన్స్వాలు స్వతంత్రరాష్ట్రమగుట కంగీకరించెను. ఇందువలన బోయర్లు ఇంగ్లీషువారియెడ మైత్రితో ప్రవర్తింతురను నమ్మకము వీనికుండెనుగాని వారట్లుచేయక వారిపరాక్రమమునకు బెదరి గ్లాడ్స్టన్ వారికి 'లొంగిపోయెననిభావించి ఆంగ్లేయులయెడ మరింతక్రోధమునుచూపసాగిరి. ఇంతటితో నిలువక వారుదక్షిణాఫ్రికాయందుండిఇంగ్లీషువారినిపూర్తిగ తొలఁగించి బోయర్సామ్రాజ్యమును స్థాపింపసమకట్టి చుట్టుప్రక్కలనున్న నల్లజాతివారలను వశపరచుకొన ప్రయత్నములు గావింపఁదొడఁగిరి.

అప్పుడు దక్షిణాఫ్రికాయందు రోడ్సను ఇంగ్లీషుప్రముఖుఁడు నివసించుచుండెను. ఇతఁడు బోయర్ల యుద్యమములన్నిటికి



విఘాతముగలిగింప దీక్షవహించినవాఁడై కడు మెలఁకువతో పనిచేయసాగెను. ఇతనిసలహాలననుసరించి 1885లో, ట్రాన్స్వాలునకు పశ్చిమముగనున్న "బెకూనా" రాష్ట్రమును 1887 లో తూర్పుగనున్న జూలూరాష్ట్రమును ఇంగ్లీషుప్రభుత్వము వారు వశపరచుకొనిరి. ఇతనిప్రోత్సాహమువలన కొందఱు ఇంగ్లీషువర్తకులు దక్షిణాఫ్రికా సంఘమను పేరుతో నొకసంఘముగ నేర్పడి ట్రాన్స్వాలునకుత్తరమందుండు ప్రదేశములో వ్యాపారముచేయనిశ్చయించి 1889 మొదలు 1894 లోపుగ నచటనివసించుచుండిన స్వదేశప్రభువులనందఱిని జయించి రొడేషియాయను రాష్ట్రమును నిర్మించిరి. ఇందువలన బోయర్ రాష్ట్రమునకు మూడువైపుల ఇంగ్లీషురాష్ట్రములు ప్రబలి వారిప్రయత్నములన్నిటిని విఫలములుగావించెను. ఎక్కడికివెళ్లిన నక్కడికి ఇంగ్లీషువారు వచ్చుచుండుటను వారు సహింపక రోషావిష్టులై యుద్ధమునకుఁదగిన సమయమును నిరీక్షించుచుండిరి.

ఇట్టిసందర్భమున మరియొక హేతువువలనఁగూడ నీపరస్పర విరోధమభివృద్ధిగాంచెను. 1886లో ట్రాన్స్వాలునందు బంగారుగనులుదొరకెను. వానినుండి బంగారమునుతీయుటకు వలయుమూలధనముగాని శక్తిసామర్థ్యములుగాని బోయర్లకులేనందున ఇంగ్లీషువారనేకులా రాష్ట్రమును ప్రవేశించి గనులలో పనిచేయఁదొడఁగిరి. కొంతకాలమునకు ట్రాన్స్వాలురాష్ట్రములో బోయర్లసంఖ్యకంటె ఇంగ్లీషువారిసంఖ్యయే అధికమయ్యెను. రాష్ట్రములోనియైశ్వర్యమునకంతకు వారేకారకులై

యుండిరి. కాని ప్రభుత్వమంతయు బోయర్లస్వాధీనమై
యుండుటచే వీరికిచిక్కులనేకములు కలుగుచుండెను. వీరిపైన
ధికముగ పన్నులవిధించి వీరిలాభములో చాలభాగమును వార
పహరించుచుండిరి. ఈపద్ధతి నెంతమాత్రమిష్టపడక పన్నులను
చెల్లించుచుండు తమకుఁగూడ రాజకీయములగు హక్కులుండ
వలయునని ఇంగ్లీషువారు వాదింపసాగిరి. వారివాదమును పెడ
చెవినిపెట్టి బోయర్లువారిపై నిరంకుశాధికారమును వహించు
చుండిరి. ఈకారణముచే దక్షిణాఫ్రికాలోని ఇంగ్లీషుప్రభు
త్వమువారు వీరిస్థితిని బాగుచేయనెంచి రాయబారముజరిపిరిగా
ని అందువలన ఫలమేమియు లేకపోవుటచేత రహస్యముగ నొ
క సైన్యమునంపి బోయర్ల యధికారమును తగ్గింపసమకట్టిరి. ఏ
ర్పాటులన్నియు పూర్తియగుటకు పూర్వమే 1895లో రొడేషి
యాగవర్నరగు జేమిసన్ అనునతఁడు కొద్దిగ సైన్యమునుతీసి
కొని ట్రాన్స్వాలును ప్రవేశించెను. తగినసహాయమతనికి ల
భింపనికారణముచే నతనిసైన్యమంతయు శత్రువులకుచిక్కి వా
రివశమయ్యెను. అకారణముగ తమరాష్ట్రముపై ఇంగ్లీషువా
రు దాడివచ్చిరని బోయర్లు మరింతక్రోధపరవశులై యుద్ధప్ర
యత్నములను చేయఁదొడఁగిరి. అప్పటికి రెండుమార్లు ఇంగ్లీ
షుసైన్యములనోడించియుండుటచే సులభముగ దక్షిణాఫ్రికా
నంతను వశముచేసికొనవచ్చునని వారభిప్రాయపడి యుండిరి.
బోయర్ పరిపాలనలోనుండిన ఇంగ్లీషువారిని చిక్కులనుండి ర
క్షించుటకు యుద్ధముతప్ప మార్గాంతరములేకపోవుటచేత ఇం
గ్లీషుప్రభుత్వమువారుగూడ యుద్ధసన్నాహము చేయఁదొడఁగిరి.



ఇందుచే 1899లో (బోయర్) యుద్ధమారంభమయ్యెను.

మొట్టమొదట యుద్ధరంగములన్నిటియందు బోయర్లకే వి
జయముకలిగెను. కాని 1900మొదలు క్రమక్రమముగ ఇంగ్లీ
షువారు వారినోడింపఁగలిగిరి. కేప్ కాలనీలోని బోయర్లుగూ
డ ఇంగ్లీషువారిపై తిరుగఁబడి తమకుతోడ్పడుదురని వారూ
హించియుండిరిగాని అదివారనుకొనినట్లు జరుగలేదు. ఐరోపా
లోని జర్మన్లుగాని ఫ్రెంచివారుగాని తమకుసహాయము చేయఁ
గలరను నమ్మకముగూడ వారికుండెనుగాని ఆంగ్లేయులనిరుప
మానమగు నౌకాబలము సముద్రమార్గములన్నిటిని కాచియు
న్నందున వారికిసహాయము చేయనెవ్వరికి వీలులేకపోయెను.
ఇదిగాక ఆంగ్లేయసామ్రాజ్యములోనిఇండియా,కనడా,లోనగు
రాష్ట్రములనుండి యుద్ధభటులు వేనవేలుగ ఇంగ్లీషుసైన్య
మందుచేరి బోయర్ల నెదుర్కొనిరి. కావున బోయర్లు శౌర్యప
రాక్రమములందు ఇంగ్లీషువారిని తీసిపోకయుండినను తుదకు
వారపజయమొంది స్వాతంత్ర్యమును కోలుపోవలసినవారైరి.
ఇట్లుయుద్ధము సుమారు మూడుసంవత్సరముల కాలముజరిగి
ట్రాన్స్వాలురాష్ట్రమును ఆరెంజిరాష్ట్రమును ఇంగ్లీషువారి
వశముగావించెను.

ఈయుద్ధమువలనబోయర్ల వ్యవసాయవ్యాపారములకపరిమి
తమగు నష్టముకలిగినను ఇంగ్లీషువారువారియెడలకరుణగలవా
రైలక్షలకొలఁది ద్రవ్యమునుఖర్చుపెట్టి వారిస్థితిని బాగుచేసిరి.
తర్వాత 1906 లో నీరాష్ట్రములందు ప్రజాప్రతినిధి సభలను
స్థాపించి వానిమూలమున పరిపాలనము జరుపసాగిరి. ఇట్లు

కొంతకాలము జరిగినతర్వాత దక్షిణఆఫ్రికాలోని రాష్ట్రములలో ప్రధానములగు కేప్ కాలనీ నెటాలు ఆరెంజిరాష్ట్రము ట్రాన్స్వాలులనొకటిగ చేర్చి "దక్షిణఆఫ్రికారాష్ట్ర"మను పేరుతో నూతనరాష్ట్రమును నిర్మించిరి. పరిపాలన విషయమున బోయర్లకును ఇంగ్లీషువారికిని సమానమగు హక్కులుండుట చేతను పరిపాలనవిధానమంతయు ప్రజలసమ్మతిని పొందినదగుటచేతను బోయర్లు పూర్వపుద్వేషభావమునుమాని స్నేహముతో ప్రవర్తింపుచున్నారు.

దక్షిణఆఫ్రికాగాక ఆఫ్రికాఖండమందలి మరికొన్నిప్రదేశములు ఇంగ్లీషువారిస్వాధీనమందున్నవి. వీనిలోకొన్నిటిని బానిసలనుసంపాదించుటకై వారు వశము చేసికొనిరి. అమెరికాఖండమును కనుఁగొనినతర్వాత స్పెయిన్ దేశమువారచటికి వెళ్లి కాలనీలనేకముల నేర్పరచుకొని వెండిగనులమూలమునను వ్యవసాయమువలనను లాభముసంపాదింపకోరియుండిరి. కాని కష్టపడి నమ్మకముతో పని చేయఁగలకూలివాండ్రు వారికిదొరకనందున బానిసలను విశేషధనమిచ్చికొనుట మిక్కిలి యావశ్యకమయ్యెను. ఆఫ్రికాఖండపు పశ్చిమభాగములో నివసించు నీగ్రోజాతివారిని సులభముగ వశముచేసికొని బానిసలుగ అమెరికాకు పంపనవకాశమున్నందున ఇంగ్లీషువర్తకులాభాగములోని ప్రదేశములకువచ్చి వర్తకశాలలనుదుర్గములను కట్టుకొని బలాత్కరించికొందఱునీగ్రోలను, క్రయమిచ్చి మరికొందఱిని పట్టుకొని ఆమెరికాకెగుమతిచేసి యధికమగులాభమును సంపాదింపఁదొడఁగిరి. కాలక్రమమున నిదుర్గముల నాధారముగ చేసి



కొనినిరాతంకముగ బానిసలనుసంబంధించిన నీవ్యాపారమును జరుపుకొనుటకై వారు చుట్టుప్రక్కలనున్న ప్రదేశముల వశపరచుకొనిరి. గాంబియాగోల్డుకోస్టుకాలనీలు ఇంగ్లీషువారి పరిపాలనలోనికి వచ్చుటకిదియే హేతువు.

ఇట్లుకొంతకాలము జరిగినతర్వాత మానవజన్మమెత్తినవారెంతటియనాగరికులైనను వారినిబానిసలుగ చేసిమృగములవలె క్రయవిక్రయముల నొనర్చుటకంటె పాపకార్యము మరియొకటి యుండజాలదని ఇంగ్లండులోనిప్రజలలో ననేకులభిప్రాయపడి ఈవ్యాపారమును మాన్పసమకట్టి ధర్మచింతగలవారు కొందఱొకసంఘముగ నేర్పడి అమెరికాలోని బానిసలను కొందఱిని బంధమునుండి విడుదలగావించి ప్రత్యేకముగ వారియభివృద్ధికై "సిరాలియోన్"అను ప్రదేశమును స్వాధీనపరచుకొని పరిపాలింపఁదొడఁగిరి. దీనిసమీపమందుండు "లాగాస్"రాష్ట్రమునుగూడ బంధవిముక్తులగు బానిసలయుపయోగార్థమై ఇంగ్లీషువారు దానినదివఱకు పరిపాలించుచుండిన స్వదేశరాజువద్దనుండి పుచ్చుకొనిరి. బానిసవ్యాపారమునకంతకు నీప్రదేశము మూలాధారముగనుండినందున నిదివీరివశమైనప్పటినుండి యీవర్తకము పూర్తిగ నాభాగమందంతట నడుగంటెను.

పందొమ్మిదవశతాబ్ద ప్రారంభమునుండి ఆఫ్రికాఖండపుసహజస్వరూపమును దానిలోని ప్రజలస్థితిగతులను సంపూర్ణముగ తెలియఁగోరిన యూరోపియన్ పరిశోధకులనేకులు అన్నివైపులనుండి బయలుదేరి కష్టముల గమనింపక సమస్తప్రదేశముల లక్షణములను వివరింపఁగలిగిరి. వీరిపరిశోధనల మూలమున

ఆఫ్రికాఖండములోని దేశములు రబ్బరు, కోకో, కాఫీ, ప్రత్తి కాయధాన్యములులోనగు వానిని పంట జేయుట కెంతయో యనుకూలించుననియు, వీనిని విదేశముల కెగుమతి చేయుటవలన విస్తారముగు లాభము దొరకఁగలదనియు, వానియందు నివసించు ప్రజ లనాగరికులై కాలమునంతను పరస్పరకలహములందు గడుపుచుందువారనియు, వారిని వశపరచుకొనుట మిక్కిలి సులభమనియు, స్పష్టమయ్యెను. అదిమొదలు ఇంగ్లండునందు వర్తకసంఘము లనేకము లేర్పడి వ్యాపారమునకై ఆఫ్రికాలో నచటనచట నధికవిస్తీర్ణతగల ప్రదేశములను ఆంగ్లేయసామ్రాజ్యములోనికి తేఁగలిగెను. వర్తకులకు క్రైస్తవమతబోధకులుగూడ నెంతయో తోడ్పడిరి. అంధకారమగ్నులైయున్న నల్లజాతులవారినందఱిని జ్ఞానవంతులుగ చేసి వృద్ధిదశలోనికి తీసికొని వచ్చుటయే వీరిముఖ్యోద్దేశము. వీరిమతబోధవలన ననేకులు వారికార్యమును అంతఃకలహములనుమాని ఇంగ్లీషువారి పరిపాలనము నందుండుట కంగీకరించిరి. అప్పుడప్పుడు ఇంగ్లీషువారికిని స్వదేశస్థులకును యుద్ధములు సంభవించుచుండినను వీనిలో బహుసులభముగ ఇంగ్లీషువారికి విజయము సమకూరఁగలిగెను.

ఏషియా అమెరికాఖండములలోని దేశముల జయించుటయందు ఇంగ్లీషువారు తక్కినయూరోపియన్లతో యుద్ధములు చేయవలసియుండిరి. ఆఫ్రికాఖండమందొక దక్షిణభాగముతప్ప మిగిలినరాష్ట్రములనన్నిటిని వారిట్టియుద్ధములు లేక స్వాధీనపరచుకొనఁగలిగిరి. దీనికిప్రధానమగు కారణమొక్కటి గలదు. 1870 వఱకు తక్కినయూరోపియన్లెవ్వరు ఆఫ్రికాలో సామ్రాజ్య



ములు సంపాదింపప్రయత్నింపలేదు. దానికివలయు నవకాశముగాని వసతులుగాని వారికి లేకుండెను. అటుతర్వాత జర్మనీవారు ఇంగ్లీషువారివలె కాలనీలసంపాదింపనెంచి ఆఫ్రికాకు రాసాగిరి. అనవసరముగ వీరితో యుద్ధములకుపూనుట నష్టకరమని యెఱింగి ఆఫ్రికాఖండములో రాష్ట్రముల సంపాదింపఁగోరు యూరోపియన్ ప్రభుత్వములవారందఱు సభకూడి విషయములనన్నిటిని తీర్మానించిన బాగుండునని ఇంగ్లీషువారుకోరఁగా తక్కినవారుగూడ నందుకంగీకరించిరి. ఇట్టిసభలు కొన్ని జరుగుటచే నాఖండమందలి దేశములలో నెవరెవ్వరు వేనినిస్వాధీనము చేసికొనవలెనో నిర్ణయింపఁబడెను. ఈనిర్ణయముల ననుసరించి ఇంగ్లీషువారు కొన్నిప్రదేశముల వశపరచుకొనిరి. తక్కినవారుగూడ నట్లే చేసిరి.

ఈవిధముగ వ్యాపారము వృద్ధిచేసికొననెంచియు అనాగరికుల నాగరికుల చేయనెంచియు క్రైస్తవమతమును వ్యాపింపఁజేయనెంచియు ఇంగ్లీషువారు ఆఫ్రికాలో చాలభాగమును వశపరచుకొనిరి. నైజర్ రాష్ట్రము, నయాసారాష్ట్రము, తూర్పుఆఫ్రికా, లోనగుప్రదేశములు ఆంగ్లేయసామ్రాజ్యములో చేరుటకివియే హేతువులు.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## పదునారవ ప్రకరణము.

ఆస్ట్రేలియాఖండము ప్రస్తుతకాలమున ఆంగ్లేయసామ్రాజ్యములో చేరిన ప్రధానరాష్ట్రములలో నొక్కటియైయున్నది. పదునేడవ శతాబ్దమందు దీనినికనుఁగొనిన డచ్చివారు వారియధికారమును నచటస్థాపించుటకు ప్రయత్నము చేయలేదు. తర్వాతకొంతకాలమునకు ప్రఖ్యాతిగాంచిన కుక్ అను ఇంగ్లీషునావికుఁడు 1768 మొదలు 1778 లోపుగ మూఁడుమారులా ఖండమునకు ప్రయాణముగావించి తూర్పుతీరమును చక్కఁగపరిశోధించి అచటఇంగ్లీషువారి ప్రభుత్వమునుస్థాపింపనుద్దేశించెను. ఇట్లుండఁగా 1783 లో అమెరికాలోని పదుమూఁడుకాలనీలు ఆంగ్లేయసామ్రాజ్యమునుండి విడిపోయి ఇంగ్లీషువారికి విస్తారమగు నష్టమునుకలిగించెను. అందుచే ప్రదేశాంతరములందు రాష్ట్రములను సంపాదించి సామ్రాజ్యమును విస్తరింపఁజేయనుద్దేశించినవారుకొందఱు ఆస్ట్రేలియాను వశపరచుకొనినయెడల మిగులలాభకరముగనుండునని యభిప్రాయపడిరి. కారణాంతరములచే ప్రభుత్వమువారుకూడ దీనికంగీకరింపవలసి వచ్చెను. ఆకాలమున నేరములుచేసిన వారిలోననేరులకు ద్వీపాంతరవాసశిక్షను విధించి



ఆశిక్షను పొందినవారిని ఇంగ్లండులోనుండనీక పంపివేయుట యాచారమైయుండెను. అమెరికన్ కాలనీలు సామ్రాజ్యమందుచేరియుండినంతవఱకు శిక్షితుల నచటికిపంపుచుండిరి. కాని 1788 మొదలిందునిమిత్తమై మరియొకప్రదేశమును వెదకుకొనుట యావశ్యకమయ్యెను. శీతోష్ణస్థితినిపట్టి ఇంగ్లీషువారునివసించుటకు ఆస్ట్రేలియా మిక్కిలియోగ్యమైయున్నందున శిక్షితులనెల్లర నచటికిపంపుటకు ప్రభుత్వమువారు తీర్మానించిరి.

ఈతీర్మానము ననుసరించి1787లో నేడువందలయేఁబదిశిక్షితుల నొకగవర్నరుఅధీనముగావించి ఆస్ట్రేలియాతూర్పుతీరమందున్న బొటనీబే అను ప్రదేశమునకు ప్రభుత్వమువారంపిరి. వీరు 1788లో నచటికిచేరి దానికికొంచెముత్తరమందు "సిడ్నీ" అనుపేరుతో నొకపట్టణము నిర్మించుకొని సమీపమందలి భూముల వ్యవసాయము చేయుచు స్థిరముగ నచటనే నివాసములేర్పరచుకొనిరి. ఆస్ట్రేలియాయందు ఆంగ్లేయసామ్రాజ్యము వ్యాపించుటకు వీరేకర్తలు. వీరితోఁగూడ వచ్చినగవర్నరు ఆస్ట్రేలియాలో సుమారు సగముభాగమునకు పరిపాలకుఁడయ్యెను. ఈభాగమునకే "న్యూసౌత్ వేల్సు" అనుపేరుకలిగెను.

కాలనీయభివృద్ధిగాంచుటకై మొదటినుండి ప్రభుత్వమువారు కొన్నియేర్పాటులు గావించిరి. శిక్షాకాలము పూర్తియైనపిమ్మట శిక్షితులందఱిని బంధవిముక్తులనుగావించి ఉచితముగ వారికిభూములనిచ్చి కాలనీయందే వారుస్థిరముగనుండుటకు వలయుసదుపాయములను దొరతనమువారు కల్పించుచుండిరి. ఇదిగాక నేరముచేయుని సన్మార్గప్రవర్తకులు కూడ నధికముగ

నీకాలనీకి వచ్చునట్లు ప్రోత్సహించుటకై వారికిఁగూడ కావలసినంత భూమినిచ్చి దానిని వ్యవసాయముచేయుటయందు తోడ్పడుటకై కర్షకుఁడొక్కొకనికి శిక్షితులనుకొందఱినొసంగుచుండిరి. ఈకారణముచే ఇంగ్లండులోని ప్రజలలో ననేకులు స్వదేశమునువిడిచి సుఖముగజీవింపవచ్చునని యుద్దేశముతో నీకాలనీకి రాఁదొడఁగిరి. కానిఇంగ్లీషువారు మొట్టమొదటచేరినప్రదేశములు భోజనపదార్థములనుత్పత్తిచేయుటకంతగ నుపయోగింపనందున నప్పుడప్పుడు క్షామబాధకు లోనగుచుండిరి. ఇట్లు కొంతకాలముజరిగినతర్వాత గొఱ్ఱెలకొన్నిటిని దేశాంతరములనుండి తీసికొనివచ్చి కొందఱుపెంపఁదొడఁగిరి. పచ్చికబయళ్లపరిమితముగనుండినందున వీనిసంఖ్య కడు వేగముగవృద్ధియై ప్రజలయైశ్వర్యమునకంతకు మూలకారణమయ్యెను. వీనిమూలమున కాలనీలోనివారికాహారము లభించుటయేగాక వారివ్యాపారముగూడ నధికమగుచువచ్చెను. వీనివలన మిక్కిలిప్రశస్తమగు "ఉన్ని"యుత్పత్తియగుచుండెను; దానిని విదేశములకెగుమతిచేసి ప్రజలు విశేషముగలాభము సంపాదింపఁదొడఁగిరి. ఇంగ్లండులోనివారు దీనినెఱిఁగి వేనవేలుగ నీకాలనీలోనికి రాసాగిరి; కావున కాలక్రమమున జనసంఖ్య హెచ్చయ్యెను.

ఈకాలనీ వృద్ధికాంచుటలో శత్రువులవలన నపాయమును నదిలేకుండెను. దక్షిణఆఫ్రికా ఉత్తరఅమెరికాలందువలె ఆస్ట్రేలియాలో పౌరుషవంతులును బలవంతులునగుస్వదేశస్థులెవ్వరులేకుండిరి. మృగతుల్యులగు ననాగరికులుకొందఱుండిరి.



గాని వీరిసంఖ్యమిక్కిలి స్వల్పమగుటచేతను తెల్లవారినిచూచినంతనే బెదరి దూరముగపరుగెత్తిపోవుట వీరికిస్వభావమగుటచేతను వీరివలన ఆంగ్లేయులకు కష్టములెవ్వియు కలుగలేదు. రానురాను వీరిసంఖ్య మరింతక్షీణింపఁదొడఁగెను. కావున నిరపాయముగ ఇంగ్లీషువారు వారియధికారమును స్థాపించుకొనఁగలిగిరి. ఇదిగాక ఇంగ్లీషువారు రాకపూర్వమీ ఖండమందు తక్కినయూరోపియనులెవ్వరు స్థిరనివాసముల నేర్పరచుకొనలేదు. కనడాలోని ఫ్రెంచివారిమూలమునను దక్షిణఆఫ్రికాలోని బోయర్లవలనను వారికికలిగినయంతరాయములిచట సంభవించుటకు వీలులేదయ్యెను. వీరిచటచేరినతర్వాత ఫ్రెంచివారువచ్చుటకు కొన్నిప్రయత్నములను చేసిరికాని అవిసఫలతగాంచలేదు. ఈకారణములచే యుద్ధములుచేయ నవసరములేకయే ఖండమునంతను వీరుస్వాధీనము చేసికొనఁగలిగిరి.

న్యూసౌత్ వేల్సునకు మొదటవచ్చినవారు సముద్రతీరప్రాంతములందుమాత్రమే నివసించుచుండిరి; ఖండములోపలిప్రదేశముల స్వభావమునుగురించి వారికేమియు తెలియకుండెను. కొంతకాలము గడచినపిమ్మట సమూలాగ్రముగ ఖండమునంతను పరిశోధింపఁగోరినవారనేకులు నలుదిక్కులనుండి ప్రయాణముచేసి కొన్నిసంవత్సరములలో నదులు పర్వతములు నివాసయోగ్యములగుప్రదేశములులోనగునంశములనుగురించి విషయపరిశోధనముగావించి పరిశోధనఫలములను సవిస్తరముగప్రచురణచేసిరి. ఇందుచేననేకులు సముద్రతీరమందేగాక ప్రదేశాంతరములందుఁగూడ నివసింపఁదొడఁగిరి. 1804 మొదలు

టాస్మేనియా ద్వీపమందు కొందఱు చేరుచుండిరి. కొందఱు సిడ్నీనుండి యుత్తరముగ వెళ్లి బ్రిస్బేన్ పట్టణమునుకట్టుకొని అచటవాసము చేయసాగిరి. మఱికొందఱు మెల్బోర్న్ పట్టణమునకువచ్చిరి. ఇట్లు క్రమక్రమముగ జనసంఖ్య హెచ్చుటయేగాక కాలనీలు నలువైపులవ్యాపింపఁజొచ్చెను. దేశస్వభావము పూర్తిగ తెలిసినకొద్ది మాత్ర దేశమందుండి ప్రజలనేకులురాఁదొడఁగిరి. ఇట్టివారుకొందఱు 1829 లో పశ్చిమఆస్ట్రేలియా కాలనీయందు చేరిరి. వ్యవసాయమునకును పశురక్షణమునకును నిందులోవసతులెక్కువగ నున్నందున కొంతకాలమునకిది వృద్ధిదశలోనికివచ్చెను. 1836లో దక్షిణఆస్ట్రేలియాకాలనీయేర్పడెను. ఇందుసారవంతములగు భూములేగాక రాగిగనులుగూడనున్నందున ఇంగ్లండునుండు ప్రజలనేకులిందులో చేరిరి. ఆ కాలమున ఇంగ్లండులో జనసంఖ్య అతివేగముగవృద్ధియగుచుండెను. కూలివాండ్రకు తగినజీవనోపాయములు లేకుండెను. ప్రజలలో చాలభాగము కష్టములకులోనై యుండిరి. వీరికష్టములను తొలఁగింపనెంచి ప్రముఖులుకొందఱు వీరికి కావలసినధనము నిచ్చి ఆస్ట్రేలియాకు పంపుచుండిరి. ఆస్ట్రేలియాలోని ప్రభుత్వమువారుకూడ ధనముమూలమున ననేకులనాకర్షింపుచుండిరి. ఇన్నికారణములు కలియుటవలన నీకాలనీలలోనికి వచ్చువారిసంఖ్య వృద్ధియయ్యెను.

జనసంఖ్యవృద్ధియగుటచే పరిపాలనపద్ధతులందుగూడ ముఖ్యములగు మార్పులు కొన్నికలిగెను. న్యూసౌత్ వేల్సునకు ప్రధానపట్టణమగు సిడ్నీకి కడుదూరమున మెల్బోర్న్ లోనగు



పట్టణప్రాంతములందు వీరిలోననేకులు నివసించుటవలన నొక్క గవర్నరీకాలనీనంతను పరిపాలించుటదుస్తరమయ్యెను. ఈకారణముచే దీనినుండికొంతప్రదేశమును విడఁదీసి ప్రత్యేకపుకాలనీల నేర్పరుపవలసివచ్చెను. 1812లో టాస్మేనియా, 1851లో విక్టోరియా, 1859లో క్వీన్సులాండు న్యూసౌత్ వేల్సునుండి వేరుచేయఁబడినవి. వీనిలో నొక్కొక్కదానికి ప్రత్యేకముగ నొక్కొకగవర్నరు నియమింపఁబడెను. ఇదిగాక 1840నాటికి ద్వీపాంతరశిక్షనుపొందక స్వతంత్రజీవనము చేయుచుండినవారి సంఖ్య మిక్కిలియధికమయ్యెను. నేరముచేసినవారిని నూర్లకొలఁది ప్రతిసంవత్సరమును నీకాలనీలలోకిపంపుట వీరికెంతమాత్రము యుక్తముగకనుపడలేదు. ఇంగ్లండులోని వారిలోఁగూడ ననేకులిట్టి యభిప్రాయమునే కలిగియుండుటచే శిక్షితులను ఆస్ట్రేలియాకు పంపుపద్ధతిని 1840 లో మాన్పిరి. ఈకాలనీలు వృద్ధియగుటకిదియుఁగూడ నొకహేతువయ్యెను. స్వతంత్రముగ జీవించుప్రజలసంఖ్య హెచ్చగుటవలన ప్రతికాలనీయందును ప్రజాప్రతినిధిసభలను స్థాపించి వానిమూలమును ప్రభుత్వముజరుపుటకు నిశ్చయింపఁబడెను.

1851 లో విక్టోరియాకాలనీయందు బంగారు గనులుదొరకెను. ఈవార్త ఇంగ్లండు దేశములోని వారికి తెలియఁగనే లక్షలకొలఁదిమనుష్యులు సులభముగ కోటీశ్వరులు కావచ్చునను ఉద్దేశముతో నీకాలనీకిరాసాగిరి. ఈకారణముచే 1850 లో డెబ్బదివేలుగ నుండిన జనసంఖ్య అయిదు సంవత్సరములలో మూఁడులక్షలయ్యెను. ఒక్కమారంత యధికముగ ప్రజలు

వచ్చుటవలన నచ్చటచటకొన్ని యిల్లగులు కలిగెనుగాని మొత్త
ముమీఁద కాలనీవారి యైశ్వర్య మభివృద్ధిగాంచఁ గలిగెను.
క్రమక్రమముగ నితరకాలనీలలోని ప్రజలుగూడ మంచిస్థితికి
రాఁజొచ్చిరి. ఇనుపదారులులోనగు ప్రయాణసౌకర్యము లధి
కమగుటవలన వ్యాపారము వృద్ధియగుచు వచ్చెను. ప్రభుత్వ
మువారు జలాధారముల నేకములునిర్మించి వ్యవసాయము లా
భకరముగ చేసిరి. ఒక్కలోపముమాత్రము దేశమందగపడు
చున్నది. విస్తీర్ణతకు తగినంత ప్రజాబాహుళ్యము లేకపోవు
టచేత నైశ్వర్యమభివృద్ధియగుటకు నదుపాయములెన్నియున్నను
దానివలన వేగముగ లాభముపొందుటకు వీలులేకున్నది. కాల
క్రమమున నీలోపముగూడ నదృశ్యముకాఁగలదు. ప్రజలువి
ద్యావంతులుగను ధనవంతులుగను నుండుటయేగాక స్వదేశ
మందు మిక్కిలి ప్రేమగలిగి దానియున్నత్యము వృద్ధియగు
టకై యావచ్ఛక్తితో పాటుపడుటకు సంసిద్ధులైయున్నారు.
కనడావలెనే ఆస్ట్రేలియాగూడ నుత్తరకాలమందు ఆంగ్లేయసా
మ్రాజ్యములో నున్నతగౌరవమొందఁగలదని నిస్సంశయముగ
చెప్పవచ్చును.

పందొమ్మిదవశతాబ్ద మంతమగునప్పటికి ప్రత్యేకముగ వేరు
వేరుగవర్నరులకు లోఁబడియుండిన కాలనీలన్నియు కొన్నివిష
యములలో నేకీభవించి కార్యక్రమమును జరుపుకొనినయెడల
లాభకరముగనుండునని ప్రజలు నిశ్చయించుకొనిరి. అంతకు
పూర్వమిరువదిసంవత్సరములనుండి జర్మనీవారును ఫ్రెంచివా
రును ఆస్ట్రేలియాకు సమీపమందున్న పసిఫిక్ సముద్రపుద్వీప



ములనుకొన్నిటిని వశపరచుకొని వారియధికారమునాప్రాంత
ములందంతట వ్యాపింపప్రయత్నించుచుండిరి. ఈకారణము
చే వారివలన తమస్వాతంత్ర్యమునకు భంగముకలుగునన్న
భయము ఆస్ట్రేలియనుల బాధింపఁదొడఁగెను. ఆస్ట్రేలియా
యంతటి విస్తీర్ణతగలిగిన ఖండమును శత్రుబాధనుండి రక్షిం
చుకొనుటకు ప్రజలందఱిలో సంపూర్ణమగు నైకమత్యముండు
ట యావశ్యకమయ్యెను. కావున ఆరుకాలనీలలోని ప్రముఖులీ
విషయమునుచక్కగనాలోచించి 1901లో పార్లమెంటువారినద్ద
నుండి చట్టమొకదానినిపొంది దానిననుసరించి రాజ్యాంగమం
దు ప్రధానములగు సవరణలనుకొన్నిటిని చేసికొనిరి. అది మొద
లుకాలనీలలో నొక్కొకదానిని పరిపాలించుటకుప్రత్యేకముగ
నొక్కొకగవర్నరు నొక్కొకప్రజాప్రతినిధిసభయు నుండుటయే
గాక ఆస్ట్రేలియానంతను పరిపాలించుటకొక గవర్నరుజనరలు
నొకప్రజాప్రతినిధులుగల శాసననిర్మాణసభయు నమలులోనికి తేఁ
బడెను. ఇందుచే దేశమునురక్షించుకొనుట సులభమగుటయే
గాక వ్యాపారముగూడ సుకరముగ వృద్ధిగాంచుచున్నది.

## న్యూజీలండు.

న్యూజీలండుద్వీపము ఆస్ట్రేలియాకుతూర్పుగ పసిఫిక్ మహా
సముద్రమందున్నది. కుక్ నావికుఁడు దీనినిగూడ ఆంగ్లేయుల
వశముచేయనుద్దేశించెనుగాని ప్రభుత్వమువారు చాలకాలమువ
ఱకందులకొప్పుకొనలేదు. ఇట్లుండఁగా ఇంగ్లీషువర్తకులుకొం
దఱును మతబోధకులుకొందఱును నచటికివచ్చి వారికార్య
ములనిర్వర్తించుకొనుచుండిరి. ఇంతటితోతృప్తిపొందక, దాని

నేలాఁగునన్నైన ఇంగ్లీషుకాలనీ చేయవలయునను ఉద్దేశము దూరదృష్టికలవారిలో కొందఱికుండినందున వారు 1837 లో నొక సంఘముగ నేర్పడి ప్రభుత్వమువారి యనుమతిని పొందకయే న్యూజీలండులో స్థిరముగనివసించుట కిష్టపడిన వారినచటికిపిలుచుకొనివచ్చి చేర్చిరి. అప్పుడే ఫ్రెంచివారుగూడ నాద్వీపమును వశపరచుకొనను ద్దేశించిప్రథమప్రయత్నములను కొన్నిటిని చేయసాగిరి. ఇట్టిసందర్భములో కాలవిలంబన మొనర్చిన యెడల కార్యముచెడునని 1839 లో ఇంగ్లీషుప్రభుత్వమువారు ద్వీపమునంతను లోఁబరచుకొని న్యూసౌత్ వేల్సుగవర్నరునే, దానికిఁగూడ గవర్నరుగనియమించిరి. 1841 మొదలు ప్రత్యేకపు గవర్నరు నియమితుఁడయ్యెను.

న్యూజీలెండుద్వీపములో బలవంతులును పౌరుషవంతులునునగు మేయరీలను స్వదేశస్థులుండిరి. 1840 లో వారితో ఇంగ్లీషువారుసంధిచేసికొని అనవసరముగ వారికినష్టము కలిగింపకుండుట కొప్పుకొనిరి. కాని సంధిషరతులనతిక్రమించి ఆంగ్లేయులలో కొందఱు ప్రవర్తించుటచేత మేయరీలు తిరుగఁబడి నాలుగుసంవత్సరములు శక్తిసామర్థ్యములతో యుద్ధముచేసి కొన్నిప్రదేశములందు పూర్తియగువిజయమునుగాంచిరి. అప్పుడు ఇంగ్లీషుగవర్నరు వారివాదము న్యాయమైనదని భావించి వారిహక్కులను రక్షించుట కంగీకరించెను. మేయరీలు సంతుష్టిచెందినవారై యుద్ధమునుమానుటచేత నదిమొదలు కాలనీ మిక్కిలి యభివృద్ధిపొందసాగెను. వ్యవసాయములాభకరముగ నుండినందున ఇంగ్లండులోనిప్రజల నేకులచటికివచ్చి కాపురము



లేర్పరచుకొనఁదొడఁగిరి. ఇట్లు కొంతకాలము జరిగినతర్వాత 1860 లో మేయరీలు మరియొకమారు కలహమునకుపూనిరి. ఈయుద్ధము సుమారు పదిసంవత్సరములు జరిగెను. 1871 నాటికి ఇంగ్లీషువారు వారిని పూర్తిగనోడించి వశపరచుకొనిరి; కాని రాజకీయములగు హక్కులనిచ్చినఁగాని వారుతృప్తిపొందునట్లు గన్పడని కారణముచే కొన్ని హక్కులను వారికొసంగి వారిస్నేహమును సంపాదించిరి.

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము

## పదునేడవ ప్రకరణము.

బలవంతులగు శత్రువులెల్లరు వినాశము గాంచుటచేతను తక్కినసంస్థానాధీశులు విధేయులై ప్రవర్తించుచుండుటచేతను దేశమంతయు ఇంగ్లీషువారి యధీనమైనదనియు నిర్భయముగ వారు ప్రభుత్వముజరుపవచ్చుననియు నూహించి 1856 లో డల్‌హౌసీ ఇంగ్లండునకు వెళ్లిపోయెను. కాని తర్వాతకొన్నినెలలకే నదివఱకెన్నఁడు సంభవింపనంతటి ఘోరవిపత్తు మనదేశమందలి ఇంగ్లీషువారికి సంభవించి వారియధికారమునంతను నడుగంటఁజేయునేమోయను భయమునుకలిగించెను. తూర్పిండియా సంఘమువారీదేశమును జయించుటకై యుపయోగించినసైన్యములో మొదటినుండి రెండుశాఖలుండెను. ఒకశాఖలో ఇంగ్లీషువారును రెండవదానిలో మనదేశస్థులును చేరియుండిరి. ఈరెండవశాఖకే సిపాయిసైన్యమని పేరు. వీరిసంఖ్య ఇంగ్లీషుసైనికులసంఖ్యకంటె నైదారురెట్లధికముగ నుండుటయేగాక యుద్ధవిషయములందు యూరోపియనులుపయోగించు పద్ధతులనన్నిటిని వీరుగూడ చక్కఁగనేర్చుకొని వారితోసమానముగ పోరాడఁదగియుండిరి. అదివఱకుజరిగిన యుద్ధములన్నిటిలోఁగూడ వీరిసహాయముచేతనే ఇంగ్లీషువారు శత్రుజాలములనుజయించి దేశమునకంతకు పరిపాలకులుకాఁగలిగిరి. కావున ఆంగ్లేయప్రభుత్వమునకంతకు తామే మూలాధారమనియు తామెట్లుచెప్పిన నట్లు నడుచుకొనుటకు వారుసిద్ధపడియుందురనియు తమతోడ్పాటులేక ఒకనిమిషముగూడ వారీదేశమున పరిపాలనభారము వహింపసమర్థులై యుండఁజాలరనియు వీరు గర్వపడసాగిరి. ఇదిగాక కొన్నిసంవత్సరములనుండి ప్రభుత్వమువారియెడ వీరికొకవిధమగు ద్వేషభావముగూడ వృద్ధియగుచుండెను. వీరిలో ననేకులగ్రవర్ణములలోఁ జేరిన బ్రహ్మక్షత్రియులగుటచే నాకాలమున పాశ్చాత్యనాగరికత ననుసరించి సైన్యమందును దేశపరిపాలనయందును ప్రభుత్వమువారు నూతనముగ కావించుచున్న యేర్పాటులవలన ప్రాచీనసాంప్రదాయములునశించి వర్ణసాంకర్యముకలిగిహిందూమతమదృశ్యమగునని వీరుభయపడుటయేగాక సిపాయీలనందఱిని క్రైస్తవులను కావింపనుద్దేశించియే ప్రభుత్వమువారిట్టి మార్పులనుచేయుచున్నారని వీరుదురభిప్రాయ మొందిరి. ఇందుచే 1857 నాటికి ప్రభుత్వమువారిపై కలహించుటకు వీరిలో ననేకులు సిద్ధపడియుండిరి.

ఆకాలమున సిపాయీలుగాక తక్కినజనులలోఁగూడ ఆంగ్లేయప్రభువులయెడవిరోధము సాధింపనెంచినవారు కొందఱుండిరి. ఆంగ్లేయసామ్రాజ్యస్థాపనవలన స్వరాజ్యములనుగోల్పోయినవారును, ఇంగ్లీషువారి న్యాయపరిపాలనవలన రైతులను బాధించి స్వలాభమును వృద్ధిచేసికొన నవకాశములను గోల్పోయిన జమీందారులు ఇనాందారులు లోనగువారును, ఆంగ్లే

యులవలె బలవంతులగు పరిపాలకులు లేనికాలమున నిరాధారులగు ప్రజలను దోఁచుకొనుచుండిన దుర్మార్గులును సంగ్రామసక్తులగు సిపాయీలను ప్రోత్సాహపరచి వారిమూలమున తమపూర్వాధికారమును సంపాదింపఁ జూచుచుండిరి. కొందఱు ఢిల్లీపట్టణమున మొగలాయిసామ్రాజ్యమును పునరుద్ధారణచేయుటకును మరికొందఱు మహారాష్ట్రుల యాధిపత్యమును నెలకొల్పుటకును తాము నిరీక్షించుచుండిన తరుణము ప్రాప్తించెనని పరమానందమొంది సిపాయీలపక్షము నవలంబించిరి. ఇట్లు వివిధోద్దేశములుఁగల స్వలాభపరులగు వారిప్రోద్బలముచే, సిపాయీలు తాము చేయఁబూనుకొనిన దుష్కార్యమువలన ప్లాసీయుద్ధముజరిగినదాదిగ నూఱుసంవత్సరముల నుండి స్వహస్తములచే తాము పెంచి పెద్దచేసిన ఆంగ్లేయసామ్రాజ్యమహావృక్షము మూలచ్ఛేదమగునను విచారమించుకయు లేనివారై 1857వ సంవత్సరపు మేనెలలో ప్రభుత్వమువారిపైయుద్ధమునకుఁగడంగిరి.

ఈకలహము మొట్టమొదట మీరట్ దుర్గమందుండిన సిపాయీలలో జనించెను. వారువారియధికారులనుచంపి వీరావేశముతో ఢిల్లీపట్టణమునకువెళ్ళి దానిని స్వాధీనముచేసికొని మొగలాయిచక్రవర్తికి పట్టముగట్టిరి. క్రమక్రమముగ గంగానదీప్రాంతప్రదేశములందంతట కలహమువ్యాపించెను. పీష్వాలలో నాఖరువాఁడగు బాజీరావుపుత్రుఁడైన నానాసాహేబు కాన్పూరునందలి సిపాయీలకునాయకుఁడై ఆపట్టణమందుండిన ఇంగ్లీషువారినందఱిని పురుషులు స్త్రీలు శిశువులుఅను వివక్షచే



యక నిర్దయుఁడై మృత్యువుపాలుగావించెను. 1856 వఱకును గణ్యములగు సంస్థానములలో నొక్కటిగనుండి, డల్‌హౌసీవలన ఆంగ్లేయరాష్ట్రములో చేర్పఁబడి, మహమ్మదీయసైనికులకును జమీందారులకును ప్రధాననిలయముగనుండిన అయోధ్యరాజ్యమునకు ముఖ్యపట్టణమగు లక్నోలోని సిపాయీలచటనుండిన ఇంగ్లీషుసైన్యమునుముట్టడించి పలువిధములుగ బాధింపసాగిరి. కాని ఇంగ్లీషువారియదృష్టవశమున పంజాబు మధ్యఇండియా దక్షిణఇండియాలలోని సిపాయీలు కలహింపరైరి. కలహించిన సిపాయీలలోఁగూడ నైకమత్యములేకుండుటయేగాక వారిని తగువిధముగ ప్రవర్తించునట్లు చేయఁగల నాయకుఁడెవ్వఁడు లేకపోయెను. ఇదిగాక యోధాగ్రేసరులగు శిక్కులును, హైదరాబాదు గ్వాలియర్ లోనగు గొప్పసంస్థానముల పరిపాలించుచున్న మహారాజులును, కలహించిన సిపాయీలతోఁ జేరకుండుటయేగాక విపద్దశలోనున్న ఇంగ్లీషువారికి నెన్నఁడును మఱువఁగూడనంతటి సహాయమును చేసిరి. ఢిల్లీ లక్నో లోనగు పట్టణములలో వేలకొలఁది సిపాయీలచే ముట్టడింపఁబడిన స్వల్పసంఖ్యాకులగు ఇంగ్లీషుసైనికులును వారినాయకులును నిరుపమానమగు మనస్థైర్యమును శౌర్యసాహసములనుచూపి ఆంగ్లేయసామ్రాజ్యమును కాపాడి అనశ్వరమగు కీర్తిని సంపాదించిరి. కాలక్రమమున నలుదిక్కులనుండియు ఇంగ్లండునుండియు సైన్యములురాసాగెను. తుదకు కలహమారంభమైనతర్వాత పదునెనిమిదిమాసములకు శత్రువిఘాతముగావించి ఇంగ్లీషువారు స్వాధికారమును దేశమందంతట పూర్వము

కంటె సుస్థిరముగ స్థాపించుకొనఁగలిగిరి.

ఇంగ్లీషువారు మన దేశమును జయించుటకు మొదలిడినప్పటినుండి తూర్పిండియాసంఘమువారివలన పరిపాలనముజరుగుచుండెను. ఈసంఘము వర్తకముకొఱకై స్థాపింపఁబడినదగుటచేతను, వ్యాపారము నభివృద్ధిచేసికొనను ద్దేశించియే వారు రాష్ట్రసంపాదనమునకు పూనుటచేతను, ప్రజలసౌఖ్యమునకంటె స్వలాభముకొఱకై వారు పాటుపడుచుందురని యభిప్రాయపడి పార్లమెంటువారప్పుడప్పుడు కొన్నిచట్టములను చేసి సంఘమువారియధికారమును తగ్గించుచుండిరి. కాని 1858వఱకు ఇంగ్లండునేలుచుండిన రాజులు మన దేశపుపరిపాలనభారమును వహింపరైరి. సిపాయీలకలహమంతయు సంఘమువారిప్రభుత్వమందలి లోపములవలన కలిగినదనినిశ్చయించి 1858 లో ఇంగ్లండును పరిపాలించుచుండిన విక్టోరియామహారాజ్ఞి మనకుఁగూడ పరిపాలకురాలయ్యెను. మన దేశపుపరిపాలనక్రమము నడుపుటకు ప్రత్యేకముగ నొకమంత్రినియమింపఁబడెను. 1877 లో విక్టోరియారాజ్ఞి ఇండియాదేశపు చక్రవర్తినియను బిరుదును వహించెను. ఇప్పుడు మన దేశమునేలుచుండు జార్జిమహామహుని ఇంగ్లండులోని ప్రజలు రాజనిమాత్రమే పిలుచుచుండినను మనము జార్జిచక్రవర్తియని పిలుచుటకిదియే కారణము.

ఈవిధముగ తూర్పిండియా సంఘపువారి పరిపాలనమును తొలఁగించి స్వయముగ ఇంగ్లండుప్రభువులు మనలనేలుట కారంభించినప్పటినుండి మన దేశ మనేక విషయములందభివృద్ధి



గాంచుటకవకాశముకలిగెను. వాయవ్యభాగమందున్నకనుముల గు కోటలుగట్టి లక్షలకొలఁది సైన్యమును వానియందునిలిపియుంచుటవలనను సముద్రమార్గములందంతట ఇంగ్లీషునౌకాబలము కాచియుండుటవలనను శత్రువులు మన దేశముపై దండెత్తిరాఁగలరనుభయ మదృశ్యమయ్యెను. దేశమంతయు నొక్కటేప్రభుత్వమునకు లోఁబడియుండుటచే ప్రజలు పరస్పరకలహములనుమాని సోదరులవలె మెలఁగుచు ఐకమత్యముగలిగి ప్రవర్తించుట కవకాశముకలిగెను. ధనికులు దరిద్రులనియు హిందువులు మహమ్మదీయులనియు బ్రాహ్మణులు బ్రాహ్మణేతరులనియు వివక్షచేయక న్యాయస్థానములందు నిష్పక్షపాతబుద్ధితో న్యాయపరిపాలనము జరుగుచుండుటవలన ప్రజలలోనిదివఱకుండిన తారతమ్యములడుగంటఁజొచ్చెను. పాశ్చాత్యవిద్య దేశమందెల్లెడల వ్యాపించుటచే స్త్రీపురుషుల తెలివితేటలు వికాసముగాంచి పూర్వులకన్న తాము గొప్పవారుకావలయునను వాంఛ వారిమనంబులందు స్థిరముగ నాటుకొనియున్నది. ఇనుపదారులు బాటలులోనగు ప్రయాణసౌకర్యములు వృద్ధిగాంచుటచే క్షామములవలనిబాధలుతగ్గి వ్యవసాయము వ్యాపారములోనగు ధనార్జనసదుపాయములు పూర్వముకంటె మెండగుచున్నవి. ప్రజలయందు నవశక్తియొకటియుదయించి వారిస్థితిగతులను బాగుచేసికొనునట్లు వారినిప్రోత్సహించుచున్నది. ప్రాక్పశ్చిమదేశముల నాగరికత సమ్మిళితమగుటచే ప్రజలలో నిదివఱకులేని యాదర్శములుజనించి వారికభ్యుదయము కలుగునట్లుచేయుచున్నవి. ఎటుచూచినను ఆంగ్లేయసా

ప్రాజ్యస్థాపనవలన మన దేశమున కసంఖ్యాకములగు లాభములు చేకూరినవని చెప్పనొప్పియున్నది.

శత్రుబాధలనుండి ఇండియాను సంరక్షించుకొనుటకై ఇంగ్లండునుండి మన దేశమునకువచ్చు మార్గములోనచ్చటచట ప్రధానములగు ప్రదేశములకొన్నిటిని ఇంగ్లీషువారు వశపరచుకొనవలసివచ్చెను. ఈకాలమున రెండుమార్గములద్వారా ఈ రెండు దేశములకు రాకపోకలుజరుగుచున్నవి. అట్లాంటిక్ మహాసముద్రముమీదుగ ఆఫ్రికాఖండమునుచుట్టి కొందఱు మన దేశమును చేరుచుందురు. కాని అనేకులుదీనికంటె సులభముగనుండు సూయజ్ కాలువ మార్గము నుపయోగించుచున్నారు. యుద్ధకాలమందీమార్గములను శత్రువులు స్వాధీనపరచుకొనఁగలిగినయెడల ఇంగ్లండునందుండుసైన్యములు ఇండియాకువచ్చుటగాని ఇండియాలోనిసైన్యములు ఇంగ్లీషువారిసహాయమై వెళ్ళుటగాని దుస్సాధ్యమగును. కావున నీమార్గముఖములందున్నట్టియు నౌకాశ్రయములుగ నుపయోగించుటకును యుద్ధసామగ్రిలను సైనికులను చేర్చియుంచుటకును వీలగునట్టియుప్రదేశములనుశత్రువశముగానీక స్వవశమందుంచుకొనుటఇంగ్లీషువారికెంతయో యావశ్యకమైయున్నది. దీనినిగుర్తెఱింగినవారగుటచేత మొదటినుండియు నట్టిప్రదేశములనేకములను వారుజయించుచువచ్చిరి. ఈయుద్దేశముతో వారువశపరుచుకొనినస్థలములలో సెంటుహెలీనా కేప్ కాలనీ మొరిషస్ ద్వీపము జిబ్రాల్టరు మాల్టా ఈజిప్టు ఏడన్ సోమాలి రాష్ట్రములు ప్రధానములు.



పైనచెప్పు ఈజిప్టుదేశము టర్కీసామ్రాజ్యములోచేరిన రాష్ట్రములలో నొక్కటియైయుండినను పందొమ్మిదవశతాబ్ద ప్రారంభమునుండి సర్వస్వాతంత్ర్యమనుభవించుచున్న గవర్నరులచే పరిపాలింపఁబడుచువచ్చెను. వీరియాస్థానమందనేక సంవత్సరములవఱకు ఫ్రెంచివారు విశేషముగ పలుకుబడిగలిగియుండిన కారణమున వారిసలహాలననుసరించి వారు చేసిన ద్రవ్యసహాయముచేత 1869 లో వీరు సూయజ్ కాలువనుత్రవ్వి మెడిటరేనియన్ సముద్రమునుండి ఎఱ్ఱసముద్రమునకు నౌకాప్రయాణమతి సులభముగావించిరి. అదిమొదలు సూయజ్ కాలువపై నధికారము సంపాదించుటకును ఈజిప్టు శత్రువులపాలుకాకుండఁ జేయుటకును ఇంగ్లీషువారు ప్రయత్నింపసాగిరి. ఇట్లుండఁగా నలువదిలక్షలపౌనుల ద్రవ్యము నిచ్చినయెడల సూయజ్ కాలువపై తనకుకలిగిన హక్కులనన్నిటిని వదలుకొనుటకు ఈజిప్టుసుల్తానంగీకరించెను. ఇంగ్లీషువారు తత్క్షణమే యాద్రవ్యమొసంగి వారియుద్దేశము నెఱవేర్చుకొనిరి. ఆకాలమున ఈజిప్టునుపాలించుచుండిన సుల్తాను ఫ్రెంచివర్తకులదగ్గరను ఇంగ్లీషువారిదగ్గరను విస్తారముగద్రవ్యము నప్పుతీసికొని ఖర్చుపెట్టి తుదకు తానాయప్పును చెల్లించుటలేదని వారికి తెలియఁబఱచెను. ఇదిచాలయన్యాయమని ఇంగ్లీషుప్రభుత్వమువారును ఫ్రెంచిప్రభుత్వమువారునుకలిసి అతనిని యధికారమునుండి తొలఁగించి వానిస్థానమున వారియెడల విధేయుఁడుగ ప్రవర్తింపనంగీకరించిన మరియొకనిని సుల్తానుగచేసి పన్నులు వసూలు చేయుటయందును ఖర్చుపెట్టుటయందును ఫ్రెంచి

ఇంగ్లీషు ఉద్యోగియులయేర్పాటులకు బద్ధుఁడై అతఁడురాజ్యమును పరిపాలింపవలయునని తీర్మానించిరి. ఇది 1879 లో జరిగెను. అదిమొదలు రెండుసంవత్సరములవఱకు ఫ్రెంచివారును ఇంగ్లీషువారునుకలిసి ప్రభుత్వమునుజరిపిరి. కాని విదేశస్థులట్టి యధికారమునుచెల్లించుట ఈజిప్టుప్రజలలో ననేకులిష్టపడలేదు. ఇదిగాక సైనికులకు క్రమముగజీతములు దొరకుచుండనికారణముచే వారుగూడ యూరోపియనులయెడ ద్వేషముతో మెలఁగసాగిరి. ఇట్టిస్థితిలో 1881 యందు సైనికులుకలహించి అలెగ్జాండ్రియా పట్టణమును స్వాధీనముచేసికొని కొందఱు యూరోపియనులనుచంపిరి. అప్పుడు ఇంగ్లీషుప్రభుత్వమువారొకనౌకాబలమును ఈజిప్టుదేశముపైకి పంపుటకు తీర్మానించి ఫ్రెంచివారి సహాయమునుకూడ కోరిరి. కాని ఫ్రెంచివారు తోడ్పడుట కిష్టపడనందున ఇంగ్లీషువారు మాత్రమచటికివెళ్లి ప్రజలకలహములనణఁచి దేశమునుస్వాధీనపరచుకొనిరి. అదిమొదలు పేరునకు సుల్తానొకఁడుండినను ప్రభుత్వమంతయు ఆంగ్లేయులచే జరుపఁబడుచువచ్చెను. పూర్వాచారము ననుసరించి టర్కీచక్రవర్తికి సుల్తాను కప్పముగట్టుచుండెను. కాని 1914లో టర్కీవారు జర్మనులతో కలిసి ఇంగ్లీషువారిపై యుద్ధమునకుపక్రమింపఁగా ఇంగ్లీషువారీకప్పమును చెల్లించుటయనవసరమని తీర్మానించి టర్కీసామ్రాజ్యమునుండి ఈజిప్టునుపూర్తిగవిడఁదీసి వారియధికారమును మరింతస్థిరముగ స్థాపించుకొనిరి.

---

# ఆంగ్లేయసామ్రాజ్యచరిత్రము.

## పదునెనిమిదవ ప్రకరణము.

కడచిన నాలుగువందల సంవత్సరములనుండి ఆంగ్లేయసామ్రాజ్యము నలుదిక్కుల నెట్లువ్యాపించెనో చదువరులకిప్పుడు తెలిసియున్నది. ఇది జరుగుచున్నకాలమందు శత్రువులతో ననేకయుద్ధములు సంభవించినను, అప్పుడప్పుడాంగ్లేయుల కపజయములు కొన్నికలిగినను మొత్తముమీద నదృష్టముమాత్రము వారినివదలినదికాదు. 1902 లో బోయరుయుద్ధము ముగియునప్పటికి వారిసామ్రాజ్యమద్వితీయమైనదని స్థిరపడెను. సామ్రాజ్యమందలి రాష్ట్రములు ఇంగ్లండునకతిదూరమందుండు అమెరికా ఆస్ట్రేలియా ఏషియా ఆఫ్రికాఖండములలో నచ్చటచట చెదరినట్లుండినను, వారినౌకాబల మద్వితీయమైనదగుటచే నిలిచి వారి నెదిరింపఁగలవారొక్కరును లేకుండిరి. 1860 తర్వాత సామ్రాజ్యసంరక్షణార్థమై ఐరోపాఖండవాసులతో వారుయుద్ధముచేయవలసిన యవసరముకూడకలుగలేదు. యుద్ధములవలన నష్టమేగాని లాభములేదనియు వివాదములేవైనసంభవించినపుడు మధ్యవర్తులమూలమున వానినిపరిష్కరించుకొనుట యుత్తమమనియు యూరోపియనులలో ననేకు

లభిప్రాయపడియుండిరి. ఇట్టిసందర్భములో ఆంగ్లేయులు వారి కాలమునంతను వారియధీనమందున్న రాష్ట్రములలోని పరిపాలనపద్ధతులను చక్కఁబెట్టుకొనుట యందును ప్రజలయైశ్వర్యము నభివృద్ధిచేయుటయందును, సామంతరాష్ట్రములకును సామ్రాజ్యమునకునుగల పరస్పరానుబంధమును బలపరచుటయందును గడపుచుండిరి. ఇట్లే సుమారు నలుబదిసంవత్సరముల కాలము యూరోపియనులలో పరస్పరయుద్ధములు లేకుండెను. దీనినంతనుచూచి, యూరోపియనులందఱును వైషమ్యముల నన్నిటినిమాని సోదరులవలెనెల్లప్పుడు మెలఁగుచుందురనియు ప్రపంచమందంతట శాంతినెలకొనుననియు ననేకులునమ్మిరి.

కాని శాంతినిభంగపరుపనెంచినవారు కొందఱు యూరప్పు ఖండమున లేకపోలేదు. వారిలోనెల్ల జర్మనీవారును ఫ్రెంచివారును ముఖ్యులు. వీరునివసించుచుండు దేశము లిరుగుపొరుగునందున్నను వీరెన్నఁడును మైత్రితో మెలఁగినవారుకారు. జర్మనీదేశ మొక్కచక్రవర్తి పరిపాలనకులోఁబడక స్వల్పాభిప్రాయులగు ననేకరాజులయధీనమందున్న కాలములో ఫ్రెంచివారు సమయముదొరికినపుడెల్ల నాదేశముపైదాడివెడలి దానిలోని రాష్ట్రములనుకొన్నిటిని వశపరచుకొనియుండిరి. ఇట్లెన్నియో శతాబ్దములుగడచినతర్వాత జర్మనులు స్వదౌర్బల్యమును గ్రహించి, దేశాభిమానపూరితులై శత్రువులనెల్లజయించి 1871 లో దేశమునంతనొక్కచక్రవర్తి స్వాధీనములోనికి తెచ్చుకొనఁగలిగిరి. ఈవిధముగ జర్మనులచే నోడింపఁబడినవారిలో ఫ్రెంచివారొక్కరు. అప్పుడు ఫ్రెంచివారికిసంభవించిన



నష్టమింతింతకాదు. చాలకాలమునుండి వారి వశమందున్న "ఆల్సేసు, లోరైను," అను రెండురాష్ట్రములను కోల్పోవుటయే గాక జర్మనులకు మూఁడువందలకోట్లరూపాయలనుగూడ నిచ్చుకొనవలసినవారైరి. ఇందుచే నిదిమొదలువారికి జర్మనులయెడఁగల విరోధమతిశయింపసాగెను. ఈరాష్ట్రములరెంటిని తిరిగివశపరచుకొనుటకు సమయమెప్పుడువచ్చునాయని వారు నిరీక్షించుచునేయుండిరి. ఈకారణముచే వారినిమించివీరును వీరినిమించివారును కోట్లకొలఁదిద్రవ్యమును ఖర్చుపెట్టుచు యుద్ధప్రయత్నములు గావింపసాగిరి. కాని విస్తీర్ణతయందు జర్మనీదేశము పెద్దదియగుటవలనను, అందులోనిజనసంఖ్యగూడ నత్యధికముగ వృద్ధిపొందుచుండినందునను, ఆస్ట్రియా-ఇటలీదేశములు జర్మనీవారి మిత్రవర్గమునచేరియుండినందునను ఫ్రెంచివారు జర్మనులతో తులతూఁగలేకుండిరి. జర్మనుల నోడింపవలయుననిన నితరదేశస్థుల సహాయమును సంపాదించుట ఫ్రెంచివారికత్యావశ్యకమయ్యెను.

కొన్నిసంవత్సరము లీవిధముగగడచినతర్వాత రషియావారును ఇంగ్లీషువారును ఫ్రెంచివారికి తోడ్పడుటకంగీకరించిరి. ఇంగ్లీషువారిట్లొడంబడుటకు కారణములేవియో మనము తెలిసికొనవలయును. ఖండాంతరములందలి దేశములను జయించి సామ్రాజ్యములనుసంపాదించుట బలవంతులగు యూరోపియనులందఱికాచారమైయుండెను. స్పెయిన్ పోర్చుగలు హాలెండు ఇంగ్లండు ఫ్రాన్సుదేశముల వారిదివఱకే ఇట్లుచేసియుండిరి. 1871 వఱకు జర్మనులు మిక్కిలి దుర్బలులుగ నుండినం

దున నిట్లుచేయలేకపోయిరి. 1871 తర్వాత వారిస్థితిమారెను. ఒకరితోనొకరు కలహించుచు కాలమును వ్యర్థపుచ్చుచుండిన వీరు సంఘీభావముగలవారై వ్యవసాయము వ్యాపారము మొదలగువాని నభివృద్ధిచేసికొని యైశ్వర్యవంతులైరి. ప్రకృతిశాస్త్రపరిశోధనమందును యంత్రనిర్మాణ చాతుర్యమందును నిరుపమానులుఅనుప్రఖ్యాతిగాంచిరి. వారిసైన్యము లసంఖ్యాకములై యుండెను. ఇన్నిసంపదలుండినను దేశాంతరములేవియు వారివశమందులేకుండుట వారకెంతయో చిన్నఁదనముగనుండెను. కావుననెల్లైన తక్కినవారివలె తాముకూడ నొకసామ్రాజ్యమును సంపాదింపవలయునని వారుపట్టుపట్టిరి. ఇందులకై నౌకాబలమత్యావశ్యకమని, ధనమును కొంచెముగూడలక్ష్యపెట్టక నేఁటేట కొన్నియుద్ధనౌకలనిర్మించుచు తుదకు గొప్పనౌకాబలమొకదానిని తయారుచేసిరి. కాని ప్రపంచమందెచ్చటను వారువశపరచుకొనఁదగిన ఖాళీప్రదేశములు లేకుండెను. ఇతరయూరోపియనుల స్వాధీనమందున్న రాష్ట్రములనుజయించుటతప్ప సామ్రాజ్యసంపాదనమునకు సాధనాంతర మగుపడలేదు. సుభిక్షములగు దేశములన్నియు నాంగ్లేయులవశమందుండెను. యుద్ధమందాంగ్లేయుల నోడించినఁగాని వీరిప్రయత్నములు సఫలములగునట్లుండలేదు. ఇట్టిస్థితిలో కాలక్రమమున జర్మనులకు ఆంగ్లేయులయెడ నసూయయధికమయ్యెను. ఆంగ్లేయులు బోయర్లతో యుద్ధముచేయుచుండినపుడు బోయర్లకే జయమురావలయునని జర్మనులుకోరి, అందులకై కొన్నిప్రయత్నములనుగూడఁగావించిరి. దీనినంతనుచూచి, ఆంగ్లేయులు



సహజక్రోధమునుపొందిరి. దురాశాపిష్టులగు జర్మనులతోనెప్పుడోయొకప్పుడు యుద్ధముసంభవించునని వారు నిశ్చయించుకొనిరి. ఈకారణముచేవారు ఫ్రెంచివారితోకలిసి, అవసరమైనపుడు జర్మనులతో యుద్ధముచేయసిద్ధపడిరి.

ఈయొడంబడికను ఇంగ్లీషువారు ఫ్రెంచివారితో 1904 న చేసికొనిరి. అదిమొదలు యూరపుఖండములోని ప్రధానదేశములవారిరుకక్షులగనేర్పడి యుద్ధమునకు తగినతరుణమునకై వేచియుండిరి. జర్మనీ ఆస్ట్రియా ఇటలీదేశములొకపక్షమునను, ఫ్రాన్సు ఇంగ్లండు రషియాదేశములు రెండవపక్షమునను చేరియుండెను. విసుగువేసడలేక జర్మనులు కోట్లకొలఁదిద్రవ్యమును ఖర్చుపెట్టి సైన్యములను యుద్ధనౌకలను బలపరచుచుండిరి. వారినిచూచి ఇంగ్లీషువారును ఫ్రెంచివారునుగూడ నిట్లేచేయసాగిరి. ఇట్లుండఁగా 1914 లో ఆస్ట్రియావారికిని సర్వియావారికిని స్వల్పవివాదమొకటిజనించెను. అందు రషియావారు సర్వియాపక్షమవలంబించిరి. తక్షణమే జర్మనులాస్ట్రియావారికితోడ్పడిరి. అందుపై ఫ్రెంచివారు రషియావారితోకలిసిరి. అప్పుడు జర్మనులు ఫ్రాన్సుపైదండెత్తనెంచి బెల్జియందేశమును ప్రవేశించిరి. యుద్ధకాలమందు బెల్జియందేశముపై పడకుండుటకదివఱకెన్నియో సంవత్సరములనుండి ఇంగ్లండు ఫ్రాన్సు జర్మనీమొదలగుదేశముల వారొప్పుకొనియుండినను, ఈయొప్పుదలకు విరుద్ధముగ జర్మనులీసమయమున ప్రవర్తించినందున ఇంగ్లీషువారీయన్యాయమును సహింపక ఫ్రెంచివారితోకలిసి జర్మనులపై యుద్ధమునకుపక్రమించిరి. ఇట్లు

ప్రారంభమైన "ఐరోపామహా సంగ్రామము", 1914 మొదలు 1918 వఱకు జరిగెను

ఇంతటి గొప్పయుద్ధమిదివఱకెన్నఁడును జరిగినదిలేదు. రెండుపక్షములవారును లక్షలకొలఁది సైన్యములను రణరంగమునకుతెచ్చిరి. ఒకఇంగ్లీషువారి సైన్యమందు మాత్రము 8,654,537 సైనికులుండిరి. ఈసంగ్రామమున ప్రాణనష్టమొందినవారిసంఖ్య సుమారు డెబ్బదితొమ్మిదిలక్షలు. ప్రాణివిఘాతమునకై నిందుపయోగింపఁబడిన యాయుధములు చిత్రవిచిత్రములుగనుండెను. పదునాలుగు పదునైదు మైళ్ళదూరమునుండి కూడ శత్రుసైన్యములను కొట్టఁగల ఫిరంగులను జర్మనులు వందలుకొలది తయారుచేసిరి. అగ్నివర్షమునుకురిపించు ఆకాశవిమానములచే వారు శత్రువులకు దిగ్భ్రమగలిగించిరి. విషవాయువులచే శత్రుప్రాణములనుహరించిరి. జలాంతర్గాములచే శత్రువులనౌకలను సముద్రముపాలుగావించిరి. పాపమునకువెరవక నసహాయులగు స్త్రీపురుషులను మృత్యువువాతత్రోసిరి. పురాతనపట్టణములను సుందరములగు దేవాలయములను కీర్తిగాంచిన విశ్వవిద్యాలయములను నేలమట్టము గావించిరి. ఇట్టి ఘోరకృత్యముల నెన్నిటినోగావించి కలియుగరాక్షసుల ను నామధేయమునకు తగినవారైరి.

భీకరులగు జర్మనులయుపద్రవమునుండి ఆంగ్లేయులనురక్షించిన సాధనములలో సామ్రాజ్యమందలి సామంతరాష్ట్రముల ప్రజలయొక్క రాజభక్తియే మొదటిది. ఈవిషయములో మన దేశమగ్రగణ్యతనువహించియున్నది. యుద్ధమారంభమైనపుడు



ఇంగ్లండులోని ఆంగ్లేయసైన్యములసంఖ్య బహుస్వల్పముగనుండెను. ఫ్రాన్సులోనియుద్ధరంగమునకు లక్షలకొలఁదిగ వచ్చుచుండిన జర్మనుసైనికుల ప్రవాహమునడ్డలేక వీరువెనుకకు పారిపోవుచుండిరి. అట్టిసమయమున నతిశీఘ్రముగ మన దేశమందున్నసైన్యములో చాలభాగము ఫ్రాన్సునకువెళ్లి శత్రువుల నడ్డఁగలిగెను. కాలక్రమమున యుద్ధమితరప్రదేశములకుఁగూడ వ్యాపించెను. విసుగులేక వ్యయమునకుజంకక మనప్రభుత్వమువారు క్రొత్తసైన్యములను తయారుచేసి యుద్ధరంగములన్నిటికిపంపిరి. ఈజిప్టు సిరియా మెసపటోమియా తూర్పుఆఫ్రికా మొదలగుదేశములను వశపరచుకొనుటలో మనసైన్యములు చేసిన సహాయమమూల్యము. ఇట్లువెళ్ళినసైనికుల సంఖ్య సుమారు పదునైదులక్షలని చెప్పవచ్చును. ఇదేవిధముగ సామ్రాజ్యములోని తక్కినరాష్ట్రములవారుకూడ ప్రవర్తించిరి. కనడా ఆస్ట్రేలియా దక్షిణఆఫ్రికా న్యూజీలండు మొదలగుకాలనీలనుండి సైన్యములనేకములు ఇంగ్లీషువారికి తోడ్పడెను. ఇదిగాక మన దేశములోనిప్రజలును సంస్థానాధీశులును శక్తివంచనలేక కోట్లకొలఁదిద్రవ్యమును ప్రభుత్వమువారి కొసంగిరి. సామ్రాజ్యములోనివారు నలుదిక్కులనుండి హృదయపూర్వకముగ నిట్టిసహాయము చేయుటచే తుదకు జర్మనులను నాంగ్లేయు లోడింపఁగలిగిరి. సామ్రాజ్యమున్నందుకు ఫలమిట్టిదగదాయని ఇంగ్లీషువారికీయుద్ధము స్పష్టపరచెను.

జర్మనులకపజయము సంభవించుటకు ఆంగ్లేయులనౌకాబలము రెండవహేతువు. ఇంగ్లండుపైకిని ఇంగ్లీషువలసలలోనున్న

తక్కినరాష్ట్రములపైకిని దండెత్తివెళ్లుటకు ప్రయత్నించుచుండిన జర్మనునౌకలను నీబలమునాశముచేసెను. ఇంగ్లీషువారికి కావలసిన ఆహారపదార్థములు ఇంగ్లండునందు పండుటలేదు. వానినివారు దేశాంతరములనుండి తెచ్చుకొనుచుందురు. ఇతరదేశములతో రాకపోకలు నిర్విఘ్నముగ జరుగుచుండుటవారికెంతయో యావశ్యకము. దీనికెంతమాత్రము మాటంకము కలిగినను ఇంగ్లీషువారాహారములేక కృశించిశత్రువులకులొంగవలసివచ్చును. దీనినంతను జర్మనులెఱింగియుండి, సముద్రములపై నచ్చటచట తమనౌకలనుదాచియుంచి,ఆహారపదార్థాదులను తెచ్చుచున్నఓడలను ముంచుటకు ప్రయత్నించిరి. ఇంగ్లీషునౌకలీ ప్రయత్నములనన్నిటిని విఫలములుగచేసి, క్షామబాధనుండి ఇంగ్లండును ఇంగ్లీషుసైన్యములను రక్షించెను. ఇదిగాక జర్మనీదేశమున కితరదేశములనుండి సముద్రమార్గమున నెట్టిపదార్థములురానియ్యక, జర్మనులు సమస్తబాధలకు లోనగునట్లు చేయుటలో ఇంగ్లీషునౌకలెంతయో తోడ్పడెను. ఇంగ్లీషునౌకాబల మత్యధికమగుటవలననే యుద్ధరంగములన్నిటికి వారు వారిసైన్యములను నిరాటంకముగ పంపగలిగిరి. ఇండియా ఆస్ట్రేలియా మొదలగు దూరదేశములనుండి సైన్యములు సునాయాసముగ నెక్కడికనిన నక్కడకు రాగలుగుటకిదియేకారణము. ఇన్నివిధములుగ తోడ్పడినదగుటచే నాంగ్లేయులజయమునకు వారినౌకాబలమే ముఖ్యమగుహేతువులలో నొక్కటియని చెప్పదగియున్నది.

అతిఘోరమగు నీయుద్ధము నాలుగుసంవత్సరముల కాలము



జరిగి 1918 లో ముగిసెను. దీనియందు జర్మనులు పూర్తిగ నోడినందువలన ఇంగ్లీషువారు విధించినషరతులన్నిటికి వారంగీకరింపవలసినవారైరి. ఆల్సేసు లోరైను రాష్ట్రములను వారు ఫ్రెంచివారికొసంగిరి. ఆఫ్రికామొదలగు ఖండములలో వారి స్వాధీనమందున్న కాలనీలన్నియు ఆంగ్లేయులును వారిమిత్రులును వశపరచుకొనిరి. వారినౌకాబలమునంతను వారుకోల్పోయిరి. వారిమూలమున నాంగ్లేయసామ్రాజ్యమునకు రానున్నయాపద ఇంతటితో నదృశ్యమయ్యెను. వారికి సహాయముగ యుద్ధముచేసిన టర్కీసుల్తానుల యధీనమందుండిన మెసపటోమియా మొదలగు దేశములుకూడ ఇంగ్లీషువారివశమయ్యెను.

# కాలపట్టిక

| | |
|---|---|
| కొలంబసు అమెరికాను కనుగొనుట | 1492 సంవత్సరము |
| వాస్కోడిగామా ఇండియాకు క్రొత్త మార్గమును కనుగొనుట | 1498 |
| ఇంగ్లీషువారు స్పెయిన్ వారినోడించుట | 1588 ,, |
| తూర్పిండియా సంఘస్థాపనము | 1600 ,, |
| ప్యూరిటనులు అమెరికాకు వెళ్లుట | 1620 ,, |
| ఆంగ్లేయులు డచ్చివారితో చేసినయుద్ధములు | 1652-1674 |
| ఆంగ్లేయులు ఫ్రెంచివారితో చేసినయుద్ధములు | 1689-1815 |
| సప్తసంవత్సరయుద్ధము | 1756-1763 |
| ప్లాసీయుద్ధము | 1757 ,, |
| ఆంగ్లేయులు అమెరికనుకాలనీలతో యుద్ధముచేయుట | 1776-83 |
| ఆంగ్లేయులు ఫ్రాన్సులోని విప్లవకారకులతోను నెపోలియనుతోను చేసినయుద్ధములు | 1792-1815 |
| ఆంగ్లేయులు ఆస్ట్రేలియాను వశపరచుకొనుట | 1787 ,, |
| వెలస్లీ మహారాష్ట్రులనోడించుట | 1802-1804 |
| డల్‌హౌసీ శిక్కులనోడించుట | 1849 ,, |
| సిపాయీలకలహము | 1857 ,, |
| బోయరుయుద్ధము | 1899-1902 |
| ఐరోపామహాసంగ్రామము | 1914-1918 |

# అర్థశాస్త్రము. (POLITICAL ECONOMY)

ఇది 200 పుటలగ్రంథము. ఇట్టి గ్రంథము తెలుగులో ఇదివరకు లేదు. శైలి సులభము. భాష అందరికి బోధపడునట్టిది. విషయము ఉపయోగకరమైనది. ఇందు యీక్రిందివిషయములు చర్చింపబడియున్నవి.

1 ధనమనగా నేమి—దాని ప్రాధాన్యము. 2 ధనోత్పత్తి సాధనములు—భూమి, భూసారము, అడవులు, గనులు, మూలధనము దానిని వృద్ధిపరచుకొను మార్గములు. బ్యాంకులు—వాటివలనిప్రయోజనము. 3 జనసంఖ్య హెచ్చుటకు తగ్గుటకు కారణములు. 4 జనసంఖ్య హెచ్చుటవలన కలుగు లాభనష్టములు. 5 జనుల శక్తిసామర్థ్యముల వృద్ధిచేయుటయెట్లు? 6 మనప్రస్తుతపు విద్యాపద్ధతులలోని లోపములు. 7 విద్యయొక్క ఆవశ్యకత. 8 కార్యవిభజనము. 9 వ్యాపార సౌకర్యములు. 10 విదేశ వ్యాపారము. 11 యంత్రములనుపయోగించుటచే కలుగు లాభములు. 12 జాయింటు స్టాకు కంపెనీ వ్యాపారములు. 13 వ్యవసాయములో మనము చేసుకొనవలసిన మార్పులు. 14 నేత, వడ్రము మొదలగు శిల్పకర్మలు. 15 వ్యవసాయదార్లు అధికముగ నుండవలెనా, శిల్పులు అధికముగనుండవలెనా! 16 పదార్థములలో కొన్నిటి ఖరీదు హెచ్చుగ నుండుటకును, మరికొన్నిటి ఖరీదు తక్కువగ నుండుటకు కారణములు—మొదలగు వివిధవిషయములు ఇందున్నవి.

మన దేశమందు దరిద్రబాధ యెక్కువగ నుండుటకు కారణములు, ఐశ్వర్యము నధికము చేయుటకు వలయు సాధనములు తెలుసుకొనగోరు ప్రతి మనుష్యుడును దీనిని చదివితీరవలెను. ఇది ప్రతి గ్రంథాలయమునందు ఉండ తగినది. వెల రు 1—4—0 మాత్రమే. పాఠకులకు, 10 పుస్తకములు గాని అంతకంటె యెక్కువ కొనువారికని మంచి కమీషను ఇయ్యబడును. త్వరపడుడు! వలయువారు గ్రంథకర్తకు వ్రాయవలెను.

మామిడిపూడి వెంకటరంగయ్య,

విజయనగరం.

END OF
TITLE